16 ఆగస్టు 2026

# కథానిధి

# ఆదివారం కథలు

సమర్పణ:

కె.ఎ. మునిసురేష్ పిళ్లె, 99594 88088

## కథాక్రమం

మీకు నచ్చిన కథ ఉన్న వరుస మీద క్లిక్ చేయండి. నేరుగా ఆ కథ ఉన్న పేజీలోకి వెళ్లండి


| | | | |
|---|---|---|---|
| తెలుగుప్రభ | నాట్ ఏ హేట్ స్టోరీ | ప్రసేన్ | 70133 58154 |
| నమస్తే తెలంగాణ బతుకమ్మ | చంద్రమ్మత్త | సుంకోజి దేవేంద్రాచారి | 99491 18082 |
| ఆదివారం ఆంధ్రజ్యోతి | ప్రక్షాళన | సీత ముళ్లపూడి | 94912 72077 |
| ఈనాడు ఆదివారం | సముద్రం | గన్నవరపు నరసింహమూర్తి | 77520 20123 |
| సాక్షి ఫన్‌డే | పుణ్యఫలం | డా.పార్థసారధి చిరువోలు | 99088 92065 |
| విశాలాంధ్ర | అబద్ధం | హరివెంకటరమణ | 98660 84124 |
| ప్రజాశక్తి స్నేహ | స్వాభిమానం | ఎస్.ఉమామహేశ్వరి | 63019 12215 |
| నవతెలంగాణ సోపతి | ఈసారి ఆపాలి | పండరినాథ్ ప్రభల | pandarinath2101@gmail.com |
| వార్త | వదిలేస్తే పోలా | డా.సన్నిహిత్ | 94909 56012 |
| సూర్య | నాన్నచెప్పిన గీత | అనంతాత్మకుల రంగారావు | 79894 62679 |
| సాక్షి ఫన్‌డే | క్లూ | మల్లాది వెంకటకృష్ణమూర్తి | |
| ప్రజాశక్తి స్నేహ | శ్రీమతి ఒక బహుమతి | కెవి లక్ష్మణరావు | 90146 59041 |
| 9.8.26 కథానిధి సమీక్ష | అక్షరాలే అసలైన కాపలాదారులు | భూక్యా గోపినాయక్ | 99891 59196 |


మరికొన్ని బాలల కథలు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



కథా ప్రియులకు నమస్తే..

ఈ ఆదివారం (16 ఆగస్టు 2026) కథల సంకలనం 51 పేజీల కథానిధి పీడీఎఫ్ లో మొత్తం 12 కథలు, అదనంగా మరికొన్ని పిల్లల కథలు ఉన్నాయి. సావకాశంగా చదవండి.. రచయితలకు మీ అభిప్రాయాలు తెలియజేయండి.

**కథానిధి పాఠకులకోసం ఒక కొత్త సదుపాయం అందిస్తున్నాను. మొదటి పేజీలో కథల వరుసక్రమం, రచయిత, ప్రచురణల వివరాలు ఉంటాయి. అందులో మీకు నచ్చిన కథ ఉండే వరుస మీద క్లిక్ చేస్తే.. పీడీఎఫ్ సంకలనంలో నేరుగా ఆ పేజీ కి వెళ్లిపోవచ్చు. ఈ సదుపాయాన్ని కథాప్రియులు వాడుకోగలరు**

కథానిధి పాఠకులకు గతవారం కథల సమీక్షను కూడా అందిస్తున్నాము.
'9 ఆగస్టు 2026 కథానిధి' కథలపై భూక్యా గోపి నాయక్ సమగ్ర సమీక్ష కోసం
ఈ కింది లింక్ లను క్లిక్ చేయండి

**adarsini.com వెబ్ సైట్లో చదవడం కోసం**

**యూట్యూబ్ లో వినడం కోసం**

**9 ఆగస్టు 2026 కథానిధి సంకలనం పీడీఎఫ్ కోసం**

కథానిధి వాట్సాప్ గ్రూపులో మీరు నేరుగా మీ మిత్రులను చేర్చవచ్చు. మీరు జాయినింగ్ లింక్ పంపితే వారు కూడా నేరుగా చేరవచ్చు.

మీ
కె.ఎ. మునిసురేష్ పిళ్లె
99594 88088

- కథలు చదవండి.
- చదివే ఆసక్తి ఉన్న మిత్రులకు ఈ పీడీఎఫ్ షేర్ చేయండి.
- కథలు నచ్చితే రచయితలకు మీ స్పందనలు తెలియ జేయండి. మెసేజీ అయినా పెట్టండి.
- కథలు చదివి వదిలే యకండి. మంచి కథల గురించి మీ మిత్రులతో కూడా ముచ్చటించండి. వారికి కూడా చదివే ఆసక్తి పుట్టవచ్చు.
- సాహిత్యప్రియులు *https://kathavasudha.com* లింక్ లోకి వెళ్లిగానీ, దిగువ పేజీలో ఇస్తున్న *QR code* ను స్కాన్ చేయడం ద్వారా గానీ కథావసుధ వెబ్ మేగజైన్ లోని అనువాద కథలు, అనువాద కవితలు, సాహిత్యవ్యాసాలను చదవండి.
- ఆయా దినపత్రికల సౌజన్యంతో

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



NOT A HATE STORY

# నాట్ ఎ హేట్ స్టోరీ

• ప్రసేన్

మూడు రోజులుగా కుండపోత . ఆకాశం తనలో దాచుకున్నదంతా ఒకేసారి చెప్పేయాలని నిర్ణయించుకున్నట్టుంది. ఇంటి కప్పుల మీద, చెట్ల ఆకుల మీద, మూసిన కిటికీల మీద ఒకే వర్షం వేర్వేరు మాటలను చెబుతోంది.

"ఊరికి ఎగువన ఉన్న రిజర్వాయర్ పూర్తిగా నిండిపోయింది. ఈ రాత్రికి లాకులు తెరవాల్సి రావచ్చు"

ఉదయాన్నే రేడియోలో హెచ్చరిక. సుమేధ గుమ్మం దగ్గర నిలబడి ఆ వార్త విన్నది. రిజర్వాయర్‌కు సంబంధించిన హెచ్చరికే అయినా, ఆ మాట తనకోసమే చెప్పినట్టనిపించింది.

ఇంటిముందు వరండాలో కొన్ని కుండీలు వర్షంలో తడిసి మెరుస్తున్నాయి. రెయిన్ లిల్లీలు ఒక్క రాత్రిలోనే పూశాయి. నిన్నటిదాకా మట్టిలో ఏమీ లేనట్టున్న చోట తెల్లవారేసరికి పలుచని గులాబీ పూలు వెలుగుతున్నాయి. సుమేధ చాలా సేపు వాటినే చూస్తూ ఆలోచనల్లో మునిగిపోయింది.

కొన్ని భావాలు కూడా ఇలాగే ఉంటాయేమో. ఎన్నాళ్లుగానో మట్టిలో లేనట్టుగా ఉంటాయి. ఒక వర్షం పడగానే తమ ఉనికిని బయటపెడతాయి.

ఒక స్నేహితురాలి ఇంట్లో అదే రోజు సాయంత్రం రూఫ్‌టాప్ గార్డెన్ గ్రూప్ సమావేశం . వర్షం తగ్గింది. కానీ ఆకాశం నిండా మబ్బులు. వేదిక మీద వేదకుమార్ మాట్లాడుతున్నాడు. సుమేధ ఓ మూల కూచుని వింటోంది.

"మొక్కలకు నీళ్లు అవసరం , మనకు మొక్క మీద ఉన్న ప్రేమ ప్రకటించడానికి నీళ్లు ఎక్కువ పోస్తే వేర్లు కుళ్లిపోతాయి " అన్నాడు నవ్వుతూ. అందరూ నవ్వారు. సుమేధ మాత్రం నవ్వలేదు. ఈ మాటలు వేదకుమార్ సుమేధతో చాలాసార్లు అనేవాడు. వేదకుమార్ వేదిక మీద నుంచి ఆమెవైపు చూశాడు. వాళ్ల కళ్లు ఒక క్షణం కలిశాయి. ఆమె వెంటనే చూపు తిప్పుకుంది కానీ ఆలోచనల్లో కాలం వెనక్కు వెళ్లింది.

## రచయిత



కవిగా, పాత్రికేయునిగా ప్రసేన్ ప్రసిద్ధులు. పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో ఆయన ముద్ర ప్రత్యేకం. సాహిత్య విమర్శ, సినిమా సమీక్షల్లో నిష్కర్షతో కూడిన ఆయన రచనలు ప్రత్యేకంగా పాఠక వర్గాన్ని తయారుచేసుకున్నాయి. తను రాసే ప్రతి వాక్యానికీ కూడా శైలి, శిల్పాలు ఉండేంత నిష్ఠని పాటిస్తారు. 'రక్తస్పర్శ' కవితా సంకలనంతో మొదలైన సాహిత్య ప్రయాణంలో ఇప్పటివరకూ పన్నెండు పుస్తకాలు ప్రచురించారు. అనేక పురస్కారాలు అందుకున్నారు. వందకు పైగా పుస్తకాలకు ముందు మాటలు రాశారు. ఈ మధ్య వరుసగా కథలు రాస్తూ ఆ ప్రక్రియకీ వన్నె తెస్తున్నారు. ఉండేది ఖమ్మంలో. చదవడం, రాయడం ఇష్టమైన వ్యాపకం. కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడిగా బాధ్యతల్లో ఉన్నారు.

☎ 7013358154

వాళ్లు మొదట కలిసింది ఒక నర్సరీలో. ఇద్దరి చేతులూ ఒకేసారి చిన్న రెయిన్ లిల్లీ కుండీ మీద పడ్డాయి.

"మీరు తీసుకోండి" అన్నాడు వేదకుమార్. "మీరు ముందుగా తాకారు " అంది సుమేధ.

"అయితే నేను కొని మీకు ఇస్తాను. మీరు కొని నాకు ఇచ్చినా కూడా పర్లేదు " అన్నాడు వేదకుమార్. ఆమె నవ్వింది.

"ఇది ఏడాదంతా పచ్చగా ఉంటుంది సార్. కానీ వర్షం పడినప్పుడు మాత్రమే పూస్తుంది " అన్నాడు వాళ్ల సంభాషణ వింటున్న నర్సరీ యజమాని.

సుమేధ పువ్వును చూస్తూ "కొన్ని జీవితాలు కూడా ఇంతే, మామూలుగా ఉండీ ఉండీ అకస్మాత్తుగా పూస్తాయి " అంది.

"ఇదేదో మొక్కల గురించిలా లేదే?"

"ప్రస్తుతానికి మొక్కలగురించే"

మళ్లీ ఇద్దరూ నవ్వుకున్నారు. ఆమె ఆ కుండీ కొనుక్కుంది. వర్షం మొదలైంది.

"మీరు కూడా మిద్దెతోట పెంచుతారా?" అడిగాడు వేదకుమార్.

"పెంచుతున్నాననుకుంటాను. కానీ నిజానికి అవే నన్ను పెంచుతున్నాయేమో , మనుషుల మీద కోపం వస్తే మొక్కల దగ్గరకు వెళ్తాను. అవి ఎదురు మాట్లాడలేవు కదా "

"అందుకోసం కూడా మొక్కలు పెంచుతారా? నాకు తెలియదు" అన్నాడు వేదకుమార్ నవ్వుతూ.

వర్షం ఆగేలోపు వాళ్లు ఫోన్ నంబర్లు మార్చుకున్నారు.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

మొదట మొక్కల గురించి మాత్రమే మాట్లాడుకున్నారు. ఎలాంటి మట్టి వాడాలి? ఎంత ఎండ అవసరం? ఆర్కిడ్‌కు నీళ్లు ఎప్పుడు పోయాలి? జేడ్ ప్లాంట్ ఆకులు ఎందుకు రాలుతున్నాయి?

కొన్ని రోజుల తర్వాత సంభాషణల్లోకి మొక్కల మధ్య మనుషులు ప్రవేశించారు.

ఒక రోజు సుమేధ ఒక ఫోటో పంపింది. జేడ్ ప్లాంట్ ఆకులన్నీ పసుపు రంగులోకి మారిపోయారాయి.

"నీళ్లు ఎక్కువ పెడుతున్నట్టున్నావు? ప్రేమ ఎక్కువైందన్నమాట " అతను నవ్వాడు.

"మొక్కలకు కూడా ప్రేమ ఎక్కువైతే ప్రమాదమా?"

"మొక్కలకు మన ప్రేమ అర్థం కాదు సుమేధా. వాటికి దూరాన్ని మనసులు దాటేస్తాయి.

సుమేధ చిన్నతనంలోనే తల్లిని కోల్పోయింది. "అమ్మ చనిపోయిన రోజు నుంచి ఇల్లు పెద్దదైపోయింది," ఒక రాత్రి చెప్పింది.

"ఇల్లు ఎలా పెద్దదవుతుంది?"

"మనల్ని పిలిచే గొంతు ఒకటి తగ్గితే గదులు పెరిగిపోతాయి "

వేదకుమార్ ఏమీ అనలేదు. ఆమెకు అదే నచ్చింది. అతను ఓదార్చే ప్రయత్నం అస్సలు చేయలేదు. సలహా ఇవ్వలేదు. తాను విన్నానని తెలియజేసే చిన్న సూచనేదో ఇచ్చాడు. అంతే. ఆమె ఎవరితోనూ చెప్పని విషయాలు అతనితో చెప్పడం మొదలుపెట్టింది.

తన భర్త మంచి మనిషేనని చెప్పింది.



ఎంత అవసరమో అంతే కావాలి, అంతే ఇవ్వాలి "

"మనుషులకు?" అతను కొద్దిసేపు మౌనంగా ఉన్నాడు.

"వాళ్లకూ అంతేనేమో " ఆ మాట తర్వాత ఇద్దరూ కొంతసేపు మాట్లాడలేదు.

కొన్ని రోజుల తర్వాత సంభాషణల్లో మొక్కల మధ్య మనుషులతో పాటు మనసులు ప్రవేశించాయి.

వాళ్లు ఎన్నడూ ఒంటరి ప్రయాణాలు చేయలేదు. పరస్పర స్పర్శ లేదు. ఏ హద్దూ దాటలేదు. కానీ మనుషులు శరీరాలతో మాత్రమే దగ్గరవరు. కొన్నిసార్లు మనం ఎవరికీ చెప్పని ఒక వాక్యాన్ని ఒకరికి చెప్పిన రోజే, శరీరాలు దాటని

"మంచి మనిషితో జీవిస్తూ కూడా ఒంటరిగా ఉండగలమా?" అడిగాడు వేదకుమార్.

"మంచితనం మన ఒంటరితనానికి మందు కాదు "

ఆ తర్వాత వాళ్లు ఒకరికి ఒకరు మరింత అవసరమయ్యారు. అయ్యారు అనేకంటే అయ్యామని తెలుసుకున్నారు అనడం సమంజసం. వేదకుమార్ ఆమెను వినేవాడు. సుమేధ అతన్ని ఆపకుండా మాట్లాడనిచ్చేది. వాళ్ల మధ్య ప్రేమ అనే మాట రాలేదు. అది రావాల్సిన అవసరం కూడా లేకపోయింది.

కొన్ని భావాలకు పేరు పెడితే భావాలు చిన్నబోతాయి.

ఒకరోజు వేదకుమార్ ను ఆఫీసులో జరిగిన పరిణమాలు గాయపరిచాయి. అందరి ముందూ అతని పనిని తక్కువ చేసి మాట్లాడారు. అతను సమాధానం చెప్ప లేకపోయాడు. ఇంటికి ఫోన్ చేయాలనిపించలేదు. ఎందుకో తెలియకుండానే సుమేధ నంబర్ నొక్కాడు. ఆమె అరగంట విన్నది.అతను మాట్లాడుతూనే ఉన్నాడు. ఆమె వింటూ ఉంది. తన అవమానం గురించి మాత్రమే కాదు, తన భయాల గురించి కూడా చెప్పాడు. వయసు పెరుగు తోందన్న భయం. తాను చేయాలనుకున్నదేదీ చేయలేకపో యానన్న బాధ. అన్నీ.

ఫోన్ పెట్టిన తర్వాత సుమేధ బాల్కనీలోకి వెళ్లింది. జేడ్ ప్లాంట్‌కు నీళ్లు పోయడం మొద లుపెట్టింది. కుండీ నిండిపోయింది.

ఆమె నీటిధారను ఆపి "చాలు " అంది పైకే. ఆ మాట మొక్కకోసమా? తనకోసమా? ఆమెకే తెలియలేదు.

మరుసటి రోజు వేదకుమార్ అన్నాడు. "తెలుసా? రోజులో ఎక్కువసేపు నీతోనే మాట్లాడు తున్నాను." అతను నవ్వాడు. సుమేధ కూడా నవ్వింది. కానీ ఆ నవ్వు వెనుక ఏదో తొలుస్తోంది.

> "నువ్వు చెడ్డవాడివి కాదు. నేనూ చెడ్డదాన్ని కాదు. అదే మన సమస్య. మనిద్దరిలో ఎవరో ఒకరు చెడ్డవాళ్లమైతే, ఒకరి నొకరం నిందించుకుని వెళ్లిపోయే వాళ్లం. మొదట మనం మొక్కల గురించి మాట్లాడుకున్నాం. తర్వాత మనుషుల గురించి. ఒక రోజు నువ్వు మాట్లాడకపోతే నా రోజు అసంపూర్ణంగా అనిపించింది."

ఆ రోజు సాయంత్రం భర్త తన ఆఫీసులో జరిగిన విషయం చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు. సుమేధ వింటున్నట్టు తల ఊపుతోంది.

కానీ ఆమె మనసులో ఒక్కటే ఆలోచన "ఇది వేదకుమార్‌కు చెబితే ఏమంటాడు?". ఆ ఆలోచన వచ్చిన మరుక్షణం ఆమె ఉలిక్కిపడింది. ఎదురుగా కూర్చున్నది తన భర్త. కానీ అతను చెప్పే మాటలను తాను మరొకరి కోసం దాచుకుంటోంది. ఆ రాత్రి ఆమెకు నిద్ర రాలేదు.

ఒక మనిషికి తన బాధలు చెప్పాలనిపించే చోటే మనసు వేర్లు వేయడం మొదలుపెడుతుంది.

ఆ వేర్లు ఎంత లోతుకు వెళ్లాయో ఆమె మొదటిసారి గమనించింది.

ఏదో ప్రమాద హెచ్చరిక వినిపించింది సుమేధకు.

ఆమెలో మార్పు మొదలైంది. చిన్న చిన్న కారణాలతో సంభాషణలను కత్తిరిస్తోంది. ఉద్దేశ్యపూర్వకంగా చిన్న చిన్న విషయాలకూ గొడవపడుతోంది. ఫోన్ ఎత్తేది కాదు. మెసేజ్‌కు ఆలస్యంగా సమాధానం ఇచ్చేది. కలుద్దామంటే "బిజీగా ఉన్నాను" అనేది.

"ఏమైంది?" అడిగాడు వేదకుమార్.

"ఏమీ లేదు "

"అయితే ఎందుకు అదోలా ఉంటున్నావు?"

"ఊరికే."

ఆ "ఊరికే" అన్న మాట ఇచ్చిన నొప్పి తగ్గకముందే

"ఇక నాకు ఫోన్ చేయకు" అంది అసందర్భంగా.

ఆ మాటల చెబుతున్నప్పుడు ప్రతి అక్షరం ఆమె గొంతులో ముల్లులా గుచ్చుకున్న నొప్పి ఆమెకు మాత్రమే తెలుసు.

కొన్ని రోజులే. మళ్లీ అన్నీ మామూలే. నవ్వులు. జోకులు. వర్షంలో నడకలు. 'ఆ రోజు ఆమె మూడ్ బాగోలేదేమో'. బహుశా మూడ్ స్వింగ్స్ కావచ్చు అనుకున్నాడు వేదకుమార్. ఇది కూడా కొద్ది రోజులే. మళ్లీ మామూలే. అనవసరపు విషయాలకు గొడవ చేయడం. కలిసిన కొద్దిసేపూ చిరాకు పడడం. కస్సుబుస్సులాడడం. అలా ప్రతి సారీ ఏదో ఒక గొడవ. అతను ఎంత జాగ్రత్తగా ఉంటే ఆమె అంత దూరమయ్యేది. అతను ఎంత దూరంగా ఉంటే ఆమె మళ్లీ దగ్గరయ్యేది.

అది స్నేహం కాదు. అది ఒక విచిత్రమైన రోలర్ కోస్టర్. ఒక చివర అతను. మరో చివర ఆమె భయం.

కొన్ని రోజుల తర్వాత మళ్లీ మామూలుగా మాట్లాడింది. నవ్వింది. మొక్కల ఫోటోలు పంపింది. అతను "అన్నీ సర్దుకున్నట్టున్నాయి" అనుకున్నాడు.

మరోసారి ఒక బోన్సాయ్ ప్రదర్శనలో వాళ్లు కలిశారు. సుమేధ ఒక చిన్న మర్రిచెట్టు ముందు నిలబడింది. చెట్టు వయసు దాదాపు ఎనభై ఏళ్లు. కానీ రెండు అడుగుల ఎత్తు కూడా లేదు. "చూడు," అన్నాడు వేదకుమార్. "ఎంత అందంగా ఉందో!"

"కుదించిన జీవితానికి అందం అని పేరు పెట్టడం వింతగా లేదూ?"

అతను ఆమె ముఖం చూశాడు. ఆమె చెట్టు వేర్లను చూస్తోంది.

"కొన్ని పెరుగుదలలను ఆపకపోతే అవి కుండీని పగల గొడతాయి " అన్నాడు.

సుమేధ అతని వైపు చూసింది. ఆ చూపులో అతనికి

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

అర్థంకాని భయం ఉంది. "అయితే కుండీ మార్చాలి కదా," అన్నది.

"ప్రతిమొక్కకీ అడవి దొరకదు"

ఆమె ఏమీ అనలేదు. ఆ రోజు తర్వాత అతనితో మాట్లాడటం పూర్తిగా మానేసింది. నర్సరీల్లో, సమావేశాల్లో ఎదురుపడినా పలకరించలేదు.

ఆ రాత్రి వేదకుమార్ ఇంటికి వచ్చాడు. చెప్పులు విప్పి మూలన పెట్టాడు. బ్యాగ్ సోఫా మీద వేశాడు. ఎప్పటిలాగే




వచ్చాడు. కానీ ఎప్పటిలా లేదు. భార్య కల్యాణి అతని చొక్కా ఇస్త్రీ చేస్తోంది. కిటికీ దగ్గర ఉన్న మనీ ప్లాంట్ ఆకులు పసుపెక్కాయి.

"వచ్చావా?" అంది. ఆమె అతని ముఖాన్ని కొద్దిసేపు పరీక్షగా చూసింది.

"ఈ మొక్కకు ఎండ తక్కువైంది" అంది.

"కిటికీ దగ్గరే ఉంది కదా "

"కిటికీ దగ్గర ఉండటం వేరు. వెలుతురు పడటం వేరు"

కల్యాణి అతన్ని పరిశీలనగా చూస్తూ "నీకు కూడా వెలుతురు తగ్గినట్టుంది " అంది.

భోజనం దగ్గర ఇద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు. పళ్లెంలో అన్నం ఉంది. మాటలు లేవు. స్పూన్ల శబ్దమే వినిపిస్తోంది.

కల్యాణి నెమ్మదిగా అడిగింది. "ఆఫీసులో ఏమైనా జరిగిందా?"

అతని చెయ్యి ఆగిపోయింది. ఎందుకో, చాలా రోజుల తర్వాత మనసు విప్పి మాట్లాడాలనిపించింది.

"అందరి ముందూ అవమానించారు, దాని ప్రభావం కావచ్చు ఈ మధ్య ఏ పనీ పూర్తిగా చేయలేకపోతున్నాను . ఎప్పుడూ అలసిపోయినట్టే ఉంటుంది. కొన్నిసార్లు ఇంటికి రావడానికి కూడా భయమేస్తుంది" అన్నాడు.

"నన్ను చూసా?" అంది నవ్వీ నవ్వనట్టు నవ్వుతూ.

"నువ్వు అడుగుతావేమో అని కాదు. నువ్వు అడగకపోతే ఇంకా బాధేస్తుంది " కల్యాణి అతనివైపు చూసింది. ఆమె కళ్లలో ఆశ్చర్యం లేదు. "ఇన్నేళ్లుగా నువ్వు 'ఏమీ లేదు' అన్నప్పుడల్లా ఏదో ఉందని నాకు తెలుసు "

"అయితే ఎందుకు అడగలేదు?"

"చెప్పడానికి సిద్ధంగా లేని మనిషిని ప్రశ్నలు సమాధానపరచవు"

"నేను నీతో చాలా విషయాలు చెప్పలేదు."

"తెలుసు."

"ఎందుకు కోపం రాలేదు?"

"కోపం వచ్చింది. కానీ నీ మౌనంతో గొడవపడటం నాకు రాదు "

ఆ రాత్రి వేదకుమార్ చాలా సేపు మాట్లాడాడు. కల్యాణి విన్నది. అప్పుడు అతనికి మొదటిసారి అర్థమైంది . ఇన్నేళ్లుగా తన పక్కనే ఉన్న ఈవిడ తన మాటల్ని కాదు, తన మౌనాలనే ఎక్కువగా వింటోందని.

తాను చెప్పలేదు. ఆమె వినలేదని మాత్రమే తను అనుకున్నాడు.

సుమేధకు ఇంట్లో ఆ రోజు ఏ పనీ చేయాలనిపించలేదు. బాల్కనీలో కూర్చుని వర్షాన్ని చూస్తోంది. పక్కనే ఒక ఎండిపోయిన కుండీ. కొన్ని రోజుల క్రితం ఆమె భర్త దాన్ని పారేయబోయాడు. "వద్దు " అని ఆపింది.

"చనిపోయింది " అన్నాడు.

"తెలుసు "

"అయితే ఎందుకు ఉంచాలి?"

"కొన్ని రోజులు అలాగే ఉండనివ్వు "

అతను ప్రశ్నించలేదు. ఇప్పుడు ఆ ఎండిన మట్టిలో చిన్న పచ్చ చిగురు కనిపిస్తోంది.

వెనక నుంచి అడుగుల శబ్దం వినిపించింది. భర్త రెండు కప్పుల టీ తీసుకొచ్చాడు. ఒక కప్పు ఆమె చేతిలో పెట్టాడు.

"వేడిగా ఉంది. జాగ్రత్త " అతను పక్కనే కూర్చున్నాడు. కొద్దిసేపు ఇద్దరూ వర్షాన్నే చూశారు.

"నువ్వు పారేయొద్దన్న మొక్క మళ్లీ చిగురేసింది " సుమేధ ఆ చిన్న చిగురును చూసింది.

"ఈ మధ్య చాలా అలసిపోయినట్టుంటున్నావు" అన్నాడు.

"అలా ఏమీ లేదు "

అతను నవ్వలేదు. వాదించలేదు.

"అంతే కదా " అని టీ తాగడం మొదలుపెట్టాడు.

ఆ ఒక్క "అంతే కదా " అనే మాట ఆమెను కుదిపేసింది.

"నువ్వు ఎందుకు ఇంకేమీ అడగలేదు?"

అతను ఆమెవైపు తిరిగాడు.

"నువ్వు చెప్పాలనిపిస్తే చెబుతావు "

"చెప్పకపోతే?"

"అప్పుడు నీ పక్కనే కూర్చుంటాను "

ఆమె చేతిలో కప్పు కొద్దిగా వణికింది. "నేను చాలాసార్లు నీతో ఉండి కూడా నీతో లేను " అతను నిశ్శబ్దంగా విన్నాడు.

"నువ్వు మంచి మనిషివి " అంది.

"అది వింటే ఎందుకో భయంగా ఉంది" ఆమె చిన్నగా నవ్వి మళ్లీ మౌనమైంది.

"మంచి మనిషితో జీవిస్తూ కూడా ఒక మనిషి ఎందుకు ఒంటరిగా ఉంటాడో తెలుసా?"

"తెలియదు."

"నాకూ తెలియదు."

"తెలియకపోతే కలిసి తెలుసుకుందాం"

"నాకే అర్థం కాని ఖాళీతో...చాలా ఏళ్లు గడిచి పోయాయి "

అతను నెమ్మదిగా ఆమె చేతిమీద తన చేయి ఉంచాడు.

"ప్రతి మనిషికీ ఇంటికి రావడానికి ముందు ఇంకో ప్రయాణం ఉంటుంది. కొన్ని సార్లు ఆలస్యం కావచ్చు అంతే"

సుమేధ కళ్లలో నీళ్లు నిండాయి.

"నా లోపల ఒక గది ఉంది , దాని తలుపు నేను ఎప్పుడో మూసేశాను. నువ్వు తట్టలేదని అనుకున్నాను "

"తట్టాను" ఆమె అతని వైపు చూసింది.

"నువ్వు తలుపు తీస్తావని ఎదురుచూడలేదు. లోపల నువ్వు ఉన్నావు అంతే చాలు అనుకున్నాను"

ఆమెకు ఒక విషయం తెలిసొచ్చింది. తన ఒంటరితనానికి కారణం తనలోని గది తాళం తన దగ్గరే ఉండడం. ఆ తలుపు వేదకుమార్ తట్టాడు. అందువల్లే కావచ్చు, ఈ ఇంట్లో ఎదురు చూస్తున్న మనిషి ఇప్పటికీ తన కోసం టీ వేడి చేస్తూనే ఉన్నాడు.

> "ఆమెకు ఒక విషయం తెలిసొచ్చింది. తన ఒంటరితనానికి కారణం తనలోని గది తాళం తన దగ్గరే ఉండడం. ఆ తలుపు వేదకుమార్ తట్టాడు. అందువల్లే కావచ్చు, ఈ ఇంట్లో ఎదురు చూస్తున్న మనిషి ఇప్పటికీ తన కోసం టీ వేడి చేస్తూనే ఉన్నాడు."

ఆరు నెలలు గడిచాయి. క్యాలెండర్‌లో ఆరు పేజీలు మాత్రమే. మాట్లాడుకోవాలనుకున్న ఇద్దరి మధ్య మాత్రం అది ఒక చిన్న యుగం.

వాళ్లు మాట్లాడుకోలేదు. కలుసుకోలేదు. కనీసం రాంగ్ డయల్స్ కూడా లేవు. ఆమెకు కాల్ చేయకుండా ఉండటానికి అతను ప్రతిరోజూ ప్రయత్నించాడు. సుమేధది కూడా అదే స్థితి కావచ్చు.

ఒక మధ్యాహ్నం నర్సరీ నుంచి ఫోన్ . "వేదకుమార్ గారూ, మీ స్నేహితురాలొకరు కొన్ని మొక్కలు ఇక్కడ వదిలి వెళ్లారు. మీకు ఇవ్వమన్నారు "

గంట తర్వాత నర్సరీకి వెళ్లాడు. కౌంటర్ దగ్గర మూడు చిన్న కుండీలు ఉన్నాయి. ఒక రెయిన్ లిల్లీ. ఒక జేడ్ ప్లాంట్. మరొక చిన్న బోన్సాయ్. వాటి పక్కన నీలిరంగు నోటుబుక్.

"వీటిని వెంటనే పెద్ద కుండీల్లోకి మార్చకండి సార్ , వేర్లు ఇంకా బలంగా లేవు " నర్సరీ యజమాని కుండీలను చూపిస్తూ అన్నాడు.

అతను బోన్సాయ్ వైపు చూసి నవ్వాడు. "దీన్ని మాత్రం పెద్ద కుండీలో పెట్టినా పెరగనివ్వరుగా?"

యజమాని భుజాలు ఎగరేశాడు. "పెరగకుండా ఉండటంలోనే కొన్ని మొక్కల అందం ఉంటుందంట కదా"

వేదకుమార్ మాట్లాడలేదు. నోటుబుక్ తెరిచాడు. మొదటి పేజీలో సుమేధ చేతిరాత.

వేదా...

నాకు నీ మీద కోపం లేదు. కోపం నటించాను. నిన్ను గాయపరచాలని కాదు. నువ్వు నన్ను వెనక్కి పిలవకుండా ఉండాలని, నేను నీ దగ్గరకు రాకుండా ఉండాలని. మన

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

సమస్య నీకు కూడా అర్థమయే ఉంటది. నువ్వు చెడ్డవాడివి కాదు. నేనూ చెడ్డదాన్ని కాదు. మనిద్దరిలో ఎవరో ఒకరు చెడ్డవాళ్లమైతే ఎలా ఉండేదో మరి, అది చాలా బాగుండేదేమో అది చాలా బాగుండకపోయేదేమో కూడా. మొదట మనం మొక్కల గురించి మాట్లాడుకున్నాం. తర్వాత మనుషుల గురించి, మనసుల గురించి. ఒక రోజు నువ్వు మాట్లాడకపోతే నా రోజు అసంపూర్ణంగా అనిపించేది. అది స్నేహమో, ప్రేమో, మోహమో నాకు తెలియదు. ఏదీ కాకపో వచ్చుకూడా. మనం చేసిన తప్పు ప్రేమ కాదు, వేదా. ఒకరి కొకరం నీళ్లుగా మారిపోవడం. నేను నీ జీవితంలో వర్షం కావాలనుకున్నానేమో. వరద అవాలను కోలేదు.

వేదకుమార్ పేజీ తిప్పాడు.

ఒకవేళ మనం ఇంకొంచెం దగ్గరైతే ఏమవుతుందో చాలాసార్లు ఆలోచించాను. శరీరానికి సమాజం గీసిన గీతలు ఆత్మకూ వర్తించాలా అని నన్ను నేనే అడిగాను. నా లోపల కూడా సమాధానం లేదు. నేను నైతికతకు భయపడ్డానో, పరిణామాలకు భయపడ్డానో, నాలోని కోరికకు భయపడ్డానో కూడా తెలియదు. ఒక విషయం మాత్రం అర్థమైంది. మనం పొందేదానికంటే మన వల్ల గాయపడేవాళ్లు ఎక్కువగా ఉండొచ్చు. అందుకే నన్ను నువ్వు అపార్థం చేసుకోవడాన్ని స్రుష్టించాను. మన మధ్య దూరాన్ని కల్పించాను. కొన్నిసార్లు మనం ప్రేమించే మనిషి దృష్టిలో చెడ్డవాళ్లమవడం, మనల్ని నమ్ముకున్నవాళ్ల జీవితాల్లో చెడ్డవాళ్లమవడం కంటే తక్కువ శిక్ష.

మనుషులు ప్రేమను తిరస్కరించరు. ఆ ప్రేమ తమలో మేల్కొలిపే బలహీనతను తిరస్కరిస్తారు. తమలో తామే దాచుకున్న మరో మనిషిని చూసి భయపడతారు. నేను చేసింది సరైనదని ఇప్పటికీ చెప్పలేను. బహుశా నేను పిరికిదాన్ని కావచ్చు. బహుశా బాధ్యతగలదాన్ని కావచ్చు. కొన్ని నిర్ణయాల్లో ఈ రెండింటి మధ్య తేడా చాలా పలుచగా ఉంటుంది.


మనకు కావలసినదాన్ని పొందే క్రమంలో మనలో మనం గౌరవించుకున్న దేనినైనా కోల్పోతామేమోననే భయం గమ్మత్తయినది.

వేదా ఒక చివరి మాట...

నేను నీకు దూరమైంది నువ్వు నాకు అవసరం లేక కాదు. అవసరానికి మించి అవసరమవుతున్నావనే భయంతో. దూరమవడానికి కారణం ప్రేమ లేకపోవడం కాదు వేదా. ప్రేమ మరింత పెరగకూడదనే భయం.

వేదకుమార్ చేతులు కొద్దిగా వణికాయి.

నర్సరీలో ఎవరో ఒక కుండీని కింద పడేశారు. అతను ఉలిక్కిపడ్డాడు. మట్టి నేల మీద చెల్లాచెదురైంది.



మూడో పేజీ తిప్పాడు.

రిజర్వాయర్ నిండిపోయినప్పుడు లాకులు ఎందుకు తెరుస్తారో తెలుసా వేదా ?

నీటిని వదిలించుకోవడానికి కాదు. నీరు అవసరం లేదని కాదు. గోడలు పగలకుండా ఉండటానికి. మన స్నేహం కూడా అలాంటి జలాశయమే. మొదట కొన్ని మాటలు చేరాయి. తర్వాత ఎదురుచూపులు. తర్వాత చెప్పుకోలేని కోరికలు. రోజుకో చిన్న చినుకులా పడిన ఆత్మీయత మనకు తెలియకుండానే ఒక రిజర్వాయర్ అయింది. ఇంకొంచెం నిండితే మన జీవితాల గోడలను పగలగొట్టేదేమో.

అందుకే నేను లాకులు తెరిచాను. బయటకు వెళ్లిపోయింది నీరు కాదు వేదా.

నా జీవితంలో నాకు మాత్రమే తెలిసిన ఒక గదిలాంటి ప్రవాహం.

వేదకుమార్ చాలా సేపు నోటుబుక్ తెరిచే ఉంచాడు.

అతను జేబులో నుంచి ఫోన్ తీశాడు. ఆమె నంబర్ దగ్గరికి వెళ్లాడు. వేలు కాల్ గుర్తు మీదకు వెళ్లింది. నర్సరీ షెడ్ మీద వర్షం చప్పుడు.

కొద్దిసేపు ఆ నంబర్ నే చూస్తూ ఉండి, కొద్ది సేపటి తరవాత ఫోన్ తిరిగి జేబులో పెట్టుకున్నాడు.

మూడు కుండీలను చేతుల్లోకి తీసుకున్నాడు. రెయిన్ లిల్లీ ఆకుల మీద అప్పటికే వానచుక్కలు చేరాయి.

చప్పట్ల మోతకు సుమేధ వర్తమానంలోకి వచ్చింది. రూఫ్‌టాప్ గార్డెన్ సమావేశం ముగిసింది. వేదకుమార్ వేదిక మీద నుంచి దిగుతున్నాడు. ఆమె లేచి బయటకు నడిచింది. మెట్ల దగ్గర ఒక క్షణం ఆగింది. వెనక్కి తిరిగి చూడలేదు. వేదకుమార్ మాత్రం ఆమె వెళ్లిపోవడాన్ని చూశాడు. వాళ్ల మధ్య పలకరింపు లేదు. కోపం లేదు. క్షమాపణ లేదు. కానీ ఇద్దరికీ ఒకే విషయం తెలిసింది. వాళ్లు ఒకరినొకరు వదిలిపెట్టలేదు. ఒకరినొకరు పెరగకుండా కాపాడుకున్నారు.

కొన్ని నెలల తర్వాత మళ్లీ వర్షాకాలం వచ్చింది. రిజర్వాయర్ నిండిపోయింది. లాకులు తెరుస్తున్నారని తెలిసి రిజర్వాయర్ దగ్గరికి జనం తండోపతండాలుగా వచ్చారు. వేదకుమార్ కూడా అక్కడే నిలబడ్డాడు. వేల క్యూసెక్కుల నీరు గేట్ల నుంచి దూసుకుపోతోంది.

ఆ ప్రవాహంలో విధ్వంసమూ ఉంది. విముక్తీ ఉంది. సృష్టీ ఉంది.

పక్కనే నిలబడ్డ ఒక చిన్న పిల్లవాడు తన తండ్రిని అడిగాడు. "నాన్నా... ఇంత కష్టపడి దాచుకున్న నీళ్లను ఎందుకు పారబోస్తున్నారు?" ఆ తండ్రి నవ్వాడు.

"దాచుకోవాలంటే కొన్నిసార్లు వదులుకోవాలి బాబూ"..చాలా పెద్ద మాట. పిల్లవాడికి అర్థం అయిందో లేదో కానీ వేదకుమార్ కు మాత్రం అర్థం అయింది.

కొన్ని కోల్పోవడాలు మనకు అత్యంత అవసరమైన వాటిని కాపాడుకోవడానికి చెల్లించే మూల్యం.

వేదకుమార్ కళ్లు ప్రవాహాన్నే చూస్తున్నాయి. లాకులు పూర్తిగా తెరుచుకున్నాయి. నీరు ముందుకు వెళ్లిపోయింది. వేదకుమార్ వెనక్కి తిరిగి చూడలేదు.


ఇంట్లో బాల్కనీలో సుమేధ ఇచ్చిన మూడు మొక్కలు జ్ఞాపకాలలా మిగిలాయి . జేడ్ కొత్త ఆకులు వేస్తోంది. రెయిన్ లిల్లీ ఇంకా పూయలేదు. బోన్సాయ్ మాత్రం ఎదగడం మరచిపోయినట్టే నిలబడి ఉంది. కానీ దాని చిన్న కుండీ లోపల వేర్లు నిశ్శబ్దంగా వ్యాపిస్తూనే ఉన్నాయి.

బహుశా . లాకులు తెరిచింది సుమేధ మాత్రమే కాదేమో. ఆమె బయటకు పంపిన నీరు మళ్లీ రిజర్వాయర్‌లోకి చేరకుండా ఆ రోజు మొదటిసారిగా వేదకుమార్ కూడా తనవైపు లాకులు కూడా మూసుకున్నాడు. అతనికీ అదే భయం.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# చంద్రమ్మత్త

సుంకోజి దేవేంద్రాచారి



''ఏమత్తా.. ముఖం ఎలిగిపోతాండాదే'' నవ్వుతూ అడిగాను.

''బండెక్కే యాలొస్తే ఎవరికైనా ఎలిగిపోతాది'' తనూ నవ్వుతూనే సమాధానం చెప్పింది చంద్రమ్మత్త.

ఆమెకు దాదాపు 85 ఏళ్లుంటాయి. రెండు పళ్లు మాత్రమే ఊడాయి. మిగిలిన పలువరుస బాగుంది. కంటి చూపూ బాగుంది. చెవులూ బాగా వినిపిస్తాయి. అంత వయసు వచ్చినా గొంతులో వణుకు లేదు. గట్టిగా పిలిచిందంటే ఊరవతల దాకా వినిపిస్తాది. వెంట్రుకలు మాత్రం నెరిసినాయి. తలస్నానం చేసిందేమో.. జుట్టంతా వెండితీగల్లాగా మెరుస్తా ఉంది. శుభ్రంగా ఉతికిన పాతచీర కట్టుకోనుంది. దవడన వక్కాకు ఉంది.

''బండ్లో మామోళ్లు వచ్చినట్టుండారే'' అన్నాను లోపలికి తొంగిచూస్తూ.

''అవునుప్పా.. నిన్న సందేళ బండికి వచ్చినారు''

తిరుపతి-ధర్మవరం ప్యాసింజర్ రైలు సాయంత్రం మా ఊరిమీదుగా పోతుంది. అందుకని దాన్ని సందేళ బండి అంటారు.

''పండగనాపొద్దు కూడా పాతచీరేనా!?'' అత్తను ఎగతాళి చేశాను.

ఈరోజు వినాయక చవితి పండగ. కొన్నేళ్లుగా ఊర్లో అందరూ వినాయక చవితి పండగ చేస్తాండారు. మా చిన్నప్పుడు ఈ పండగ చేసేది చంద్రమ్మత్తోళ్లు మాత్రమే.

''కొత్త చీరయినా గుంతలో ఎయ్యరు కదా?'' ప్రశ్నించింది అత్త.

''అదికాదత్తా.. పండగ కదా''

''బిత్తల వచ్చినాం.. బిత్తల పోతాం! మద్దెలో మానం కాపాడేదానికి ఏ చీరయితే ఏముంది లేప్పా.. రా కూచ్చో! ఇంగా పూజలో ఉండారు. పూజయితానే తిందువు'' అనింది అత్త.

''పూజని ఇంతవరకూ తినకుండా ఉంటే ఎట్లత్తా?'' కోపం నటిస్తూ అడిగాను.

టైము పదకొండు గంటలు అవుతా ఉంది.

''నేనేపొద్దన్నా పూజలు చేసినానా.. ఒక్కపొద్దులు ఉన్నేనా..? అయ్యన్నీ పిల్లోళ్లకు అల్లుడూ. ఇంట్లో పూజని వాళ్లు వంటలు చేసుకుంటాంటే.. నేను పొద్దన్నే కొబ్బరి, బెల్లం తిని నీళ్లు తాగేస్తా. ఈ పొద్దు ఆకలి కాలా.. ఒగపూట తినకపోతే ఏమీ కాదు.. బరువు లేకుండా ఒళ్లు ఉలకాగా ఉంటాది లేప్పా'' నవ్వుతూ చెప్పింది.

''సరేత్తా.. నేను బాయికాడికి పోవాల. తోటలకు నీళ్లు కట్టాల. కరెంటిచ్చిండారు. మామోళ్లతో మళ్ల మాట్లాడతా'' అని చెప్పి ముందుకు కదిలినాను.

వెనక నుంచి..

''జాగ్రత్తల్లుడూ.. అమ్మను బాగ చూసుకో'' అనింది.

'సరేత్తా!' అంటూ తల ఊపుతూ నడిచినాను.

* * *

చంద్రమ్మత్త మా బంధువు కాదు. మాది వాళ్లది వేర్వేరు కులాలు. ఊర్లో ఆరేడు కులాల వాళ్లున్నారు. అందరూ ఒకరినొకరు వరుసలతో పిల్చుకోవడం మా పూర్వీకుల నుంచి వస్తా ఉంది. అలా చంద్రమ్మ నాకు అత్తయింది. ఊర్లో చాలా మందికి ఆమె అత్త వరుస. అందుకే వరుసలతో సంబంధం లేకుండా ఆమెను చాలామంది 'చంద్రమ్మత్త' అని అంటుంటారు.

జీవితంలో ప్రతి మనిషీ చాలా సందర్భాల్లో నటిస్తుంటారు. కానీ, చంద్రమ్మత్త జీవితంలో ఒక్కసారి కూడా నటించలేదు. తన మనసులో ఉన్న విషయాన్ని ఉన్నది ఉన్నట్టు చెబుతాది. లోపటొక మాట బయటొక మాట ఉండదు. ఊరందరికీ ఆమె తీరు అలవాటై పోయింది. ఆమె ఏదన్నా చెప్పింది అంటే.. ఇక దానికి తిరుగుండదు. అది నిజం అంతే! అయితే ఒక్కోసారి ఆమె మాట్లాడే మాటల లోతు అంతు చిక్కదు. అవి మామూలు మాటల్లాగా ఉంటాయి కానీ.. వాటి వెనక మరో విషయం దాగుంటాది.


మా ఊర్లో పురాతన శివాలయం ఉంది. ఆ శివాలయం ఎంత విశేషమైందో.. చంద్రమ్మత్త జీవించే విధానం కూడా అంత విశేషమైంది. ఆమె జీవించే విధానం ఎవరికీ హాని చేయదు. అయితే చాలామందికి ఆమె జీవన విధానం నచ్చదు. అయినా సరే, ఏదో ఒక సమయంలో.. 'బతికితే చంద్రమ్మత్త మాదిరి బతకాల' అని అనుకోని వారైతే ఉండరు.

చంద్రమ్మత్త భర్త చనిపోయి దాదాపు యాభై ఏళ్లయింది. ఆమెకు ఒక్కడే కొడుకు. ఆయన చిన్న

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# కథ

**'నమస్తే తెలంగాణ-ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2026'లో తృతీయ బహుమతి రూ.10 వేలు పొందిన కథ.**



ఉద్యోగి. విజయవాడలో ఉంటారు. పల్లెలో చంద్రమ్మత్త ఒకతే ఉంటాది. కొడుకు, కోడలు, వాళ్ల పిల్లలు పల్లెకు ఎప్పుడు వస్తారా!? అని ఎదురుచూస్తా ఉంటాది. అత్త ఊరొదిలి బయటకు వెళ్లేది చాలా తక్కువ. విజయవాడలో ఉండే కొడుకింటికి, తిరుపతిలో ఉండే మనవరాలి ఇంటికి ఏడాదికి ఒకసారి కూడా పోదు. పోయినా.. ఒకటి రెండు రోజులకు మించి ఉండదు. అక్కడికి పోయినప్పటి నుంచి అత్త ధ్యాసంతా ఇంటిపైనే ఉంటాది.

''ఇంటికాడేమన్నా పాలుతాగే పిల్లోళ్లు ఉండారా!? వారం పదిరోజులు ఉండచ్చు కదా'' అని కొడుకంటే.. ''ఇంటికాడ చెట్లుండాయి. నేను లేకపోతే వాటికి నీళ్లెవరు పోస్తారు? ఊర్లో వాళ్లు కాయాకసురూ పెరుక్కోని పోతారు'' అంటాది.

''పెరుక్కోని పోతే పోనీలే.. వాటిని అమ్మి నువ్వేమన్నా మాడీ కట్టాల్నా!?'' అని కొడుకు ఎగతాళి చేస్తే.. ''నేనుండే ఇల్లే నాకు మాడీ.. ఒగ దానికి అంతకు మించిన మాడీ ఏమవసరం లేదు. ఒగుంటే నువ్వు కట్టి చూపించు మాడీ'' అని కొడుక్కు సవాల్ విసురుతాది.

మా అసలూరు మేమున్న చోటుకు నాలుగు పర్లాంగుల దూరంలో ఉంది. దాదాపు 70 ఏండ్ల క్రితం కలరా వచ్చి ఊర్లో చానామంది చనిపోయినారు. దీంతో మిగిలిన వాళ్లంతా ఊరొదిలి.. ఇప్పుడుండే తావన ఇళ్లు కట్టుకున్నేరు. అట్ల చంద్రమ్మత్త, ఆమె మొగుడూ కట్టిన ఇల్లే ఇప్పుడు ఆమె ఉండేది.

పది సెంట్ల స్థలంలో చంద్రమ్మత్త ఇల్లుంది. అందులో నైరుతి మూలన చుట్టుగుడిసె. అందులోనే వంట చేసుకోవడం. ఆ గుడిసె గోడకు రెండు దేవుని పటాలు వేలాడుతుంటాయి. వాటి కింద ఒక దీగూడు. ఆ పటాలళ్లో ఉండే దేవుళ్లు ఎవరో కూడా అత్తకు తెలీదు. దేవుళ్లకు ఆమె పూజ చేసింది ఎవరూ చూడలేదు. ఆమె భర్త మద్రాసు నుంచి తెచ్చి వాటిని గోడకు తగిలించినాడు. అప్పటి నుంచి అవి అక్కడున్నాయి. ప్రతి ఉగాది పండగ రోజు వాటిని తీసి శుభ్రంగా కడిగి తుడిచి, బొట్లు పెట్టి తగిలిస్తాది. అయితే.. రోజూ సాయంత్రం దీగూట్లో దీపం పెట్టి రెండు చేతులు జోడించి దండం పెట్టుకుంటాది.

'దేవున్ని ఏమి కోరుకున్నేవత్తా!?' అంటే..


'దండం పెడతా అంతే! నాకేమి కావాలో దేవునికి తెలీదా. ఆ మాత్రం తెలీకుంటే ఆయన దేవుడెందుకయితాడు?' అని తిరిగి ప్రశ్నిస్తాది.

గుడిసెకు కుడివైపున రెండు మూరల వెడల్పు, బార పొడవుండే అరుగుంది. ఊర్లో వాళ్లెవరన్నా వచ్చి అక్కడ కుచ్చోని అప్పుడప్పుడూ అత్తతో ముచ్చట్లు పెడతాంటారు. గుడిసెకు ఎదురుగా ఆరంకణాల మిద్దె. మిద్దెకు తూర్పు, పడమర తలుపులున్నాయి. మిద్దెకు తూర్పు వైపున ఒక అరుగుంది. పొద్దు వాలింతర్వాత అత్త ఎప్పుడైనా ఆ అరుగుపైన పడుకుంటా ఉంటాది. గుడిసెకు ఎడమవైపున జలజారుంది. మూడు వైపుల బండలు నాటారు. ఒకవైపు బందారు పుల్లలతో తయారు చేసిన తడిక. అక్కడ స్నానం చేసుకోవడం. అంతే ఇల్లు.. ఇక మిగిలిన స్థలమంతా చెట్లే. రెండు చింతచెట్లు. కూరలోకి వాడే చింతపండు కొనదు. మిగిలిన చింతకాయలు అమ్మేస్తాది. మార్కెట్ రేటు కంటే సగం తక్కువ ధరకే ఇచ్చేస్తాది. రెండు వేపచెట్లు, ఒక కొబ్బరి చెట్టు. ఉగాదికి పిల్లలొస్తే పచ్చడి చేసుకోవడానికి వేపపూలకు, పూజ కోసం టెంకాయలకు బయటకు పోగూడదంటాది. సీతాఫలం చెట్లు పదికి పైగా ఉండాయి. కనకాంబరాలు, మల్లి, జాజి తీగలు. వీటికి పందిర్లు వేసింది. సీజన్‌లో కనకాంబరాలు, మల్లెపూలు కోసి అమ్ముతాది. ఆమె దగ్గర తక్కువ ధర కావడంతో ఏ రోజు పూలు ఆ రోజు ఊర్లో ఎవరో ఒకరు కొనుక్కునేస్తారు. ఆ రోజు పూలు ఎవ్వరూ కొనలేదు.. వాటిని మాలకట్టి తీసకపోయి శివాలయంలో ఇస్తాది. లేదూ ఇంట్లో దేవుడి పటాలకు వేస్తాది. ఇంటికి మనవరాళ్లు వస్తాండారని తెలిస్తే.. ఆ రోజు చెట్లల్లో ఒక్క పూవు కూడా కోసుకోనివ్వదు. నాకు బాగా గుర్తు..

ఆ రోజు సాయంత్రం మా పాపకు స్కూల్ డే ఉంది. పొద్దున్నే మా పాప వెళ్లి..

''అవ్వా.. ఈ రోజు మల్లిపూలు, కనకాంబరాలు అన్నీ నాకే కావాల. ఎవరికీ ఇవ్వొద్దు'' అని చెప్పింది.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



''లేదు కొడకా.. ఈ రోజు పూలు ఎవరికీ ఈను'' అనింది అత్త.

''డబ్బులిస్తాం వ్వా. పూలు కావాల..''

''లేదుమ్మా.. ఈరోజు ఇచ్చేది లేదు'' అంది అత్త.

మా పాప ఇంటికి పరిగెత్తుకుంటా వచ్చి..

''నాయనా.. అవ్వ పూలు ఈనంటాంది. నువ్వొచ్చి అడుగు'' అనింది.

'పూలు ఎందుకీ దబ్బా!?'.. అనుకుంటా నేను వెళ్లాను. మమ్మల్ను చూస్తానే..

''ఏమి పాపా.. మీ నాయన్ను పిల్సకచ్చినావా!? మీ నాయనే కాదు.. ఆ గుళ్లో ఉండే దేవుడొచ్చినా ఈ రోజు పూలు ఈను'' అనింది నవ్వుతా.

''ఈ రోజు పాపకు స్కూల్‌లో ఫంక్షన్ ఉందత్తా'' అన్నాను.

''ఈ రోజు మనవరాళ్లు వస్తాండారు అల్లుడూ. ఎప్పుడో ఒగసారి వస్తారు. బిడ్డలు ఇంట్లో కాసిన పూలు తల్లో పెట్టుకోని తిరగతాంటే బాగుంటాది. వాళ్లు ఎన్నిరోజులుంటే అన్ని రోజులూ ఇచ్చేది లేదప్పా'' అనింది.

అత్త ఇవ్వను అనిందంటే ఇక ఇవ్వదంతే!

ఆ ఇంటి ఆవరణలో రెండు చిక్కుడు తీగలు ఎప్పుడూ ఉంటాయి. మూడు రకాల మామిడి చెట్లు, రెండు మునగచెట్లు ఉన్నాయి. ఇవే కాదు.. మిరప, టమాటా, వంకాయ, తోటకూర.. ఇలా గుడిసె, మిద్దె పోనూ.. మిగిలిన స్థలం అంతా పచ్చగా ఉంటుంది. ఎవరైనా చూస్తే అదంతా అడివి అనుకుంటారు. కానీ, అత్త మాత్రం చాలా చాకచక్యంగా వాటి మధ్య తిరగతా ఉంటాది.

అత్త తిండి తినే విధానం చాలా ప్రత్యేకం. ఆమె ఒక్కతే ఉన్నా.. ప్రతిరోజూ వంట చేసుకుంటాది. కూరలు చాలా బాగా చేస్తాది. వేరే వాళ్లు చేసే కూరలు ఆమెకు ఒక పట్టాన నచ్చవు. చెట్లల్లో కాసే చిక్కుడు కాయలు అమ్మకానికి పోను మిగిలినవి తాలింపు చేసుకుంటాది. ఇంకా మిగిలినాయంటే చెట్లకే వదిలేస్తాది. బాగా ముదిరినాక కోసి గింజలు వలిచి ఎండబెట్టి ఎత్తిపెట్టుకుంటాది. చిక్కుడు కాయలు లేని రోజుల్లో ఇంట్లో వారంలో ఒక రోజయినా ఆ గింజలు కూర చేసుకుంటాది. ఇక ఆకుకూరలు వారంలో రెండుసార్లు తప్పనిసరి. మునగాకు వారంలో ఒకరోజయినా వండుకుంటాది. అంత వయసు వచ్చినా ఆరోగ్యంగా ఉండటానికి ఆమె తినే తిండేనేమో కారణం. బీపీ, షుగర్ లేవు. మోకాలి నొప్పనో, నడుము నొప్పనో పడుకునిందే లేదు.

ఊరగాయలు పెట్టడంలో అత్తను మించినోళ్లు లేరు. ఊర్లో ఎవరికి ఊరగాయ కావాలన్నా అత్తదగ్గరే పెట్టించుకుంటారు.

చంద్రమ్మత్త పని రాక్షసి. ఒక్క క్షణం ఖాళీగా ఉండదు. ఎప్పుడూ ఏదో ఒకపని చేస్తానే ఉంటాది. భర్త ఉన్న సమయంలో యాభై ఎకరాలకు పైగా ఉన్న పొలం.. కొడుకు చేతికి వచ్చాక ఐదెకరాలకు చేరింది. మొదట్నుంచీ అత్తే పొలం పనులు దగ్గరుండి చేయించేది. కొడుకు విజయవాడ చేరి, పల్లెకు రావడం తగ్గించేసి, పొలాన్ని పట్టించుకోవడం లేదు. తనకూ వయసై పోవడంతో.. అత్త ఆ పొలంలో అడుగు పెట్టేదే మానేసింది. యాభై ఎకరాల పొలం ఉన్నప్పుడు మహారాణిలా దగ్గరుండి పొలం పనులు చేపించినా.. యాభై కాస్త ఐదెకరాలయినాక తనే కూలి మనిషిలా పొలంలో పనిచేసినా.. ఆ ఐదెకరాల్లో అడుగు పెట్టడం మానేసినా.. అత్తలో అదే నిబ్బరం. అదే హుందాతనం. అదే ధైర్యం. ఎప్పుడూ పొలం పొలం అని ఉండే అత్త.. ఆ పొలంలో అడుగు పెట్టడమే మానుకోవడం ఊరందరికీ ఆశ్చర్యమే. ఎవరైనా పిలిస్తే పొలాల్లో కూలి పనులకు కూడా పోతాది. 80 ఏళ్లు దాటింతర్వాత పెద్దామె అని అత్తను కూలికి పిల్చేది మానుకున్నేరు. అయినా సరే.. గమ్మున ఉండదు.

సంక్రాంతి పండగ అయిపోయిందంటే దాదాపు రెండు నెలలు రోజూ చిన్న కత్తి తీసుకుని ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండే అడివికి పోతాది. అక్కడ మధ్యాహ్నం దాకా పొరకూసలు కోసుకుని తెస్తాది. వాటిని ఎండబెట్టి ఊపర ముండ్లు అదరగొట్టి చీపురుకట్టలు కట్టి అమ్ముతాది. ఎండాకాలం వచ్చిందంటే.. తెల్లవారుజామున మూడుగంటలకే నిద్ర లేసేస్తాది. ఊరికి ఆనుకోనుండే చింతతోపుల్లోకి పోతాది. రాలిన చింతకాయలు ఏరుకోనొచ్చి ఎండబెట్టి గింజలు తీసి అమ్ముతాది. ఏ పనీ లేదంటే ఇంటిదగ్గరుండే చెట్ల మధ్య గడ్డి పెరుకుతానో, మొక్కలకు పాదులు చేస్తానో ఉంటాది. అది కూడా లేదంటే శివాలయం దగ్గరకు పోయి.. పూజారి భార్యకు పూలు కట్టిస్తేదో, వాళ్ల పిల్లలను ఆడించేదో చేస్తాది. లేదంటే గుడి ఆవరణ ఊడ్చి శుభ్రం చేస్తాది. పెద్దామె వచ్చి పనిచేసింది కదా అని వాళ్లు రెండు మూడు కొబ్బరి చిప్పలు ఇస్తారు. వాటిని ఇంటికి తీసుకొచ్చి ఎండబెట్టి ఎత్తిపెడతాది. వాటికి తోడు పెరట్లోని కొబ్బరిచెట్టులోంచి రాలిన కాయలన్నీ కలిపి నూనె ఆడించేసి మనవరాళ్లు, కోడలు వచ్చినప్పుడు ఇచ్చి పంపుతాది. గుడిలో శుభ్రం చేస్తాన్నెప్పుడు ఎవరైనా చూసి..

'పున్నెమంతా నీకే' అంటే..

'పున్నెం నాకెందుకు? పాపాలు చేసినోళ్లకు కావాల' అంటాది.

* * *

''ఎన్నుండాయి లేన్నా.. అన్నీ కలిపి ఐదారు కేజీలుంటా యంతే. తొలికోత కాయలు. ఊర్లోనే అయిపోతాయిలే.. ఇంగో సంగతి తెలుసాన్నా.. ఇప్పుడు ఊర్లో ఆడబిడ్డలు సమర్తాడితే.. అదేదో పెద్దపండగ మాదిర్తో చేస్తాండారు. పొటోలు, వీడియోలు తీస్తాండారు. మనవరాళ్లు సమర్తాడిన ఐదారేండ్ల దాంకా చంద్రమ్మత్త ఎవరికీ తెలీనీలా.. 'ఏమత్తా దాపెట్టినావే!?' అంటే.. 'ఒసే కోడలా.. దాపెట్టేది ఏం ఉండాదే.. ఆడబిడ్డన్నేక పెద్దబిడ్డ కాకుండా ఉంటాదా.. అదిగూడా ఊరంతా చెప్పుకోవాల్నా!?' అనింది''

''ఏందిన్నా.. ఏదో లోకంలో ఉన్నెట్టుండావే''

అప్పటిదాకా చంద్రమ్మత్త గురించి ఆలోచిస్తా నడుస్తాండే నేను.. ఆ మాటలతో ఉలిక్కిపడి చూశాను. ఎదురుగా నాకు చెల్లెలి వరసయ్యే లక్ష్మి. మా వీధిలోనే నాలుగిళ్ల అవతల వాళ్ల ఇల్లు. తన నెత్తిన చిన్న గంపలో కూరగాయలున్నాయి. సంతలో అమ్మేదానికి, తోటలోనించి కోసుకుని వస్తా ఉంది.

''ఏం లేదులే పాపా.. వస్తాంటే ఇంటి ముందర చంద్రమ్మత్త కనిపించేలకు పలకరించినా. ఆ అత్త పనుల గురించే ఆలోచిస్తా ఉండా'' నవ్వుతూ చెప్పాను.

''అన్నో.. ఆ అత్తట్లా మనిషి యాడుంటాదినా. ఒగరిజోలికి పోతాదా!? ఒగరూపాయ ఆశిస్తాదా!? ఊరికే ఉంటాదా!? ఎప్పుడూ ఏదో ఒగ పనిచేస్తానే ఉంటాది'' చెప్పింది లక్ష్మి.

''ఔను లక్ష్మి. ఎప్పుడూ ఖాళీగానే ఉండదు. ఏదో ఒగపని చేస్తానే ఉంటాది. సేద్యం పనులు లేని ఎండాకాలంలో ఊరంతా రాముని గుడికాడనో, చింతచెట్లకిందనో కుచ్చోని అరువులు చేస్తాంటారు.. అత్త అప్పుడు కూడా ఊసలు ఇదిలించేదో, చింతకాయలు కొట్టేదో చేస్తాంటాంది'' అన్నాను.

''గుడంటే గుర్తొచ్చిందినా.. ఇప్పటికీ మనూర్లో ఆడోళ్లకు ముట్టొస్తే కొందరు ఇంట్లోకి రానీరు. గొడ్లకొట్టంలో ఉండాల్సిందే. అట్లాడిది వాళ్ల మనవరాళ్లకు ముట్టు వచ్చినా.. నీళ్లు పోసుకోనొచ్చి దేవుని దీగూట్లో దీపం పెట్టమంటాది. ఒగరోజు నేను వాళ్లింటికాడున్నే.. 'ఇట్ల చేస్తే దేవునికి కోపం రాదాత్తా!'.. అంటి. అత్త నవ్వి.. 'ఒసే పిచ్చిదానా.. నా మనవరాలికి ఒగదానికే ముట్టు వస్తాందా!? లోకంలో ఉండే అందరు ఆడోళ్లకు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ముట్టు వస్తాది. ఇది దేవుడు పెట్టిందే కదా! ముట్టు రోజు దీపం పెడితే దేవుడు ఎందుకు వద్దం టాడు?' అని నన్నే నిలదీసింది''

''నిజమే కదామ్మా.. నువ్వు పదా పాపా.. నెత్తిన బరువుండాది. సంతకు పోవాలేమో'' అన్నాను.

''ఎన్నుండాయిలేన్నా.. అన్నీ కలిపి ఐదారు కేజీలుంటాయంతే. తొలికోత కాయలు. ఊర్లోనే అయిపోతాయిలే.. ఇంగో సంగతి తెలుసాన్నా.. ఇప్పుడు ఊర్లో ఆడబిడ్డలు సమర్తాడితే.. అదేదో పెద్దపండగ మాదిర్తో చేస్తాండారు. పొటోలు, వీడి యోలు తీస్తాండారు. మనవరాళ్లు సమర్తాడిన ఐదారేండ్లదాంకా చంద్రమ్మత్త ఎవరికీ తెలీనీలా.. 'ఏమత్తా దాపెట్టినావే!?' అంటే.. 'ఒసే కోడలా.. దాపెట్టేది ఏం ఉండాదే.. ఆడబిడ్డన్నేక పెద్దబిడ్డ కాకుండా ఉంటాదా.. అదిగూడా ఊరంతా చెప్పు కోవాల్నా!?' అనింది''

''అత్తకు మనవరాళ్లంటే ప్రేమ ఎక్కువ''

''అవును. చంద్రమ్మత్త దినమ్మూ వాళ్ల చెట్లల్లో పూలమ్మతాది కదా.. మనవరాళ్లు వచ్చినారంటే అమ్మేదుండదు. వాళ్లు పెట్టుకోంగా మిగిలినోటియి దేవునికి పెట్టమంటాది''

''అవునుమ్మా.. నేను కూడా గమనించినా. ఎవరైనా ముందు దేవుడంటారు. తర్వాత మని షంటారు. అత్త అట్ల కాదు. ముందు మనిషికి.. మిగిలితేనే దేవుడికి అంటాది'' అన్నాను.

''ఒగరోజు ఏమైందో తెలుసాన్నా.. ఈ మాట చెప్పేసి ఎలబారిపోతా.. ఐదారేండ్లయింటాది. గంగజాతరకు చంద్రమ్మత్త కొడుకు, కోడలు విజ యవాడ నుంచి వచ్చినారు. తెల్లారి ఊర్లోకి దున్న పోతు వస్తాది. ఇంటింటికాడ టెంకాయలు, పసు పు-కుంకుమ పెట్టుకోనుండాలని ముందురోజే చాటింపేయించినారు. అంటు ముట్టు ఉండే వాళ్లు తప్ప అందురూ ముందురోజు రాత్రే టెంకాయలు తెప్పించి పెట్టుకున్నేరు. అత్తోళ్ల చెట్లో టెంకాయలు లేవు. అంగట్లోనించి రెండు టెంకాయలు తెప్పిం చింది. ఆరోజు రాత్రి కోడలికి బేదులు పట్టుకు న్నేయి. జిలకర కాంచి నీళ్లు తాపించింది. సాస వలు ఏంచిచ్చి ఉప్పేసుకోని తినమనింది. బేదులు పట్టుకుంటే నీరసం వస్తాది కదా. అత్త ఏం చేసిందో తెలుసా.. గంగమ్మ కోసం తెచ్చిండే టెంకాయలు కొట్టి ఆ నీళ్లు కోడలికి ఇచ్చి తాగ మని చెప్పింది. 'అవి గంగమ్మకత్తా' అని కోడ లంటే.. 'ఏం కాదులే! పాణం బాగయితే జాత రలో గంగమ్మ కాడ నాలుగు టెంకాయలు కొట్టు. గంగమ్మ ఏమనుకోదు' అనింది..''

''చదువు రాకపోయినా, అత్త చాలా బాగా ఆలోచిస్తాది. చదువుకున్నోళ్లే మూర్ఖంగా ఉండారు'' అన్నాను.

''సరేన్నా! నేను ఎలబారతాండా.. '' అని చెప్పి లక్ష్మి పల్లెవైపు అడుగులు వేసింది.

నేనూ కాసేపట్లోనే మా పొలం చేరుకున్నాను. నాలుగెకరాల్లో వరి నాటిండాము. స్విచ్ వేశాను. బోరుబావి నీళ్లు పైపులోంచి బయటకు దుంకాయి. నాలుగెకరాలు పారడానికి కనీసం గంటసేపు పడతాది. పొలం గట్టున చెట్టు కింద కూర్చున్నాను. ఈ రోజెందుకో చంద్రమ్మత్త ఆలో చనలు వదలడం లేదు.

* * *

అత్తకంటే మా అమ్మ పదేండ్లు చిన్నది. మా అమ్మ అత్తను 'ఒదినా!' అని పిలస్తాది. అత్త కూడా అంతే ఆప్యాయంగా 'ఏం మరదలా!' అని పలకరిస్తాది. అత్త బొడ్డులో ఎప్పుడూ ఒక్కాకు తిత్తి ఉంటాది. అత్త మా ఇంటికి వచ్చినా, మా అమ్మ వాళ్లింటికి పోయినా.. ఇద్దరూ ఒక్కాకు వేసుకుని మాట్లాడుకుంటా కుచ్చోంటారు. నేను చాలాసార్లు వాళ్ల మాటలు విన్నాను. అత్త మాటల్లో ఆరోజు లేదా ముందు రోజంతా తను ఏం చేసింది అనేది కథలాగా చెప్పేది. ఒక్కోసారి తన పెళ్లయిన రోజులు, అప్పట్లో ఇంట్లో ఎట్లుండేది? పొలం పనులు ఎట్ల చేపించింది? చెప్పేది. ఎక్కడా గొప్పలు ఉండవు. పక్కమనిషిని ఎగతాళి చేయడమూ ఉండదు. తనను తక్కువ చేసుకోవడమూ ఉండదు. ఎదుటి మనిషిని తక్కువ చేసి మాట్లాడ్డమూ ఉండదు. తను ఎలా జీవించింది? తను ఆ పనిని ఎలా చేసింది? అనేది మాత్రమే చెప్పేది. అత్త చెప్పేది విన్నామంటే.. ఈ పని ఇంత సులభమా!? అనిపి స్తాది. కానీ మనం ఆ పనిచేస్తే కానీ అది ఎంత కష్టమో అర్థం కాదు.

తనను ఎవరైనా ఎగతాళి చేశారంటే.. ఇక ఆ ఇంటి గుమ్మం కూడా తొక్కదు.

'ఏయ్.. నన్నే అంటావా! నీకు చేతనయితే నా మాదిర్తో బతికి చూపించు' అంటా కండ్లు పెద్దవి చేసి, లేని మీసాన్ని తిప్పతాది. ఇంకా కోపం వస్తే.. మీసం తిప్పి, సవాల్ అంటా తొడకొడ తాది.

ఒకసారి మా నాయనను అత్త కొట్టిందంట. మా అమ్మ ఈ విషయం నాకు ఎన్నిసార్లు చెప్పిందో లెక్కేలేదు. మా అమ్మకు పెండ్లయిన పదేండ్లకు.. ఒగరోజు రాత్రి కూరలో ఉప్పెయ్యలే దని అమ్మను మా నాయన దున్నికట్టెతో కొట్టడం మొదలు పెట్టినాడంట. దీంతో యాడ చంపేస్తాడో అని భయపడి, అత్తోళ్ల ఇంటికి పోయి దాక్కునిం దంట. అమ్మకోసం నాయన ఊర్లో మా బంధు వుల ఇండ్లల్లో తాలాడినాడు. యాడా లేదు. అమ్మ యాడుండేది ఎవరో చెప్పినారంట. నాయన నేరుగా అత్తోళ్ల ఇంటికాడికి పోయి ఈదిలో నిలబడుకోని..

'నా పెండ్లాన్ని పంపించు' అన్నేడంట.

'నీ పెండ్లాం ఈడెందుకుంటాది. మొగుడు నువ్వా నేనా. ఇది నీ ఇల్లా నా ఇల్లా' అనిందంట.

'ఏయ్.. తార్పుడు దానా. నా పెండ్లాన్ని ఇంట్లో పెట్టుకోని లేదంటావా' అన్నేడంట నాయన.

అంతే.. అత్త దున్నికట్టెత్తుకోని..

'దొంగ ముం.. కొడకా! ఎంత మాటంటా వురా!?' అంటా వాకిట్లో నింటి ఇసిరి ఏసిందంట.

దున్నికట్టె నేరుగా పొయ్యి మా నాయన కాలికి తగిలిందంట.

'ఓయమ్మా.. చంద్రక్క నన్ను చంపేస్తాంది' అంటా ఇంటికి పరిగెత్తినాడంట. అత్త ఈధిలోకి వచ్చి బండ బూతులు తిడతా రెండు రాళ్లెత్తుకోని బీరిబీరి ఏసిందంట.

'కూరలో ఉప్పెయ్యలేదని ఆడబిడ్డను కొడ తావా నా బట్టా! చిటికెడు ఉప్పు తీసి కూరలో ఏసుకోని తినలేవా!?' అంటా మాట మాటకూ ఒక బూతు మాట కలిపి తిట్టిందంట.

ఈ విషయాలన్నీ మా అమ్మ నాకు ఎన్నిసార్లు చెప్పిందో. చెప్పిన ప్రతిసారీ మా అమ్మ నవ్వతానే ఉంటాది.

జేబులో ఫోన్ మోగింది. లక్ష్మి ఫోన్ చేసింది. ఫోన్ తీయగానే..

''అత్త సచ్చిపోయిందినా..'' అనింది.

నాకు ఒక్క క్షణం ఏమర్థం కాలేదు.

''ఏ అత్త!?'' అన్నాను.

''చంద్రమ్మత్త!'' అనింది.

నా తల గిర్రున తిరుగుతున్నట్టనిపించింది.

''ఇంట్లో అంతా పూజ చేసుకుంటా ఉన్నే రంట. అత్త ఇంటిబయట అరుగుమింద పడుకోని ఉన్నిందంట. ఈ రోజు పొద్దన కూడా ఏమీ తినలే దంట. 'ఇనాయకమయ్యకు పూజ చేసేసినాక, తినేదానికి రాత్తా!' అని కోడలు పిలిచిందంట.. అప్పటికే పాణం పోయిందంట''..

అటువైపు లక్ష్మి ఏడుస్తూనే విషయం చెప్పింది.

నేను పల్లెవైపు పరుగు పెట్టాను. అత్తోళ్ల ఇంటికి చేరుకునేప్పటికే.. ఊర్లో చానామంది ఉండారు. మిద్దెకు తూర్పుగా అప్పడప్పుడూ అత్త తలవాల్చే అరుగు మీద.. అత్త పడుకున్నట్టే ఉంది. మా అమ్మ అప్పటికే అక్కడికి వచ్చింది. అత్త చెంపలు పట్టుకోని..

''లే ఒదినా.. ఊరికూరికే పెండ్లాలను దుడ్డుక ర్రతో కొట్టే ఈ మొగనా బట్టలను దుడ్డుదువు లే ఒదినా.. ఇద్దరం ఒక్కాకు ఏసుకుందాం లే ఒదినా'' అంటా మా అమ్మ ఏడుస్తా ఉంది.

''మంచాన పడి ఒకరిదగ్గర సేవ చేపించుకో వడం ఇష్టం లేదని ఎప్పుడూ అంటా ఉంటాది. కాలూ చెయ్యి బాగా ఆడతాన్నెప్పుడే కాలం అయి పోవాలనేది. మూడు దినాల నింటి బేదులంట. మంచాన పడకముందే మట్టిలో కలిసిపోతాంది'' ఎవరో చెప్పారు.

''పండక్కని కొడుకు కొత్త చీర తెచ్చినా కట్టుకో లేదంట. పాత చీరే కట్టుకునింది''

''పొద్దట్నించీ అందరితో హుషారుగా నవ్వుతా మాట్లాడతాన్నింది. ఇట్లయితాదని అనుకోలేదు''

''జీవితంలో అన్నీ చూసేసినా.. ఇంక బతికేది వద్దనుకునిందేమో!? అయినా ఇట్లా సావు ఎంత మందికి వస్తాది..''

అక్కడ చేరిన వారంతా అత్త గురించి తలా ఒక మాట మాట్లాడతాండారు.

'జాగ్రత్తల్లుడూ.. అమ్మను బాగ చూసుకో'.

అత్త నాతో అన్న చివరి మాటలు గుర్తొచ్చాయి.

అత్తమీద పడి అమ్మ ఏడుస్తానే ఉంది.

అత్త చనిపోయినట్టు లేదు.. ఏడుస్తున్న అమ్మను ఓదారుస్తున్నట్టుగా ఉంది. ■



సుంకోజి దేవేంద్రాచారి

99491 18082

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# ప్రక్షాళన

- సీత ముళ్ళపూడి

"సర్వమంగళ మాంగళ్యే శివే... సర్వార్థ సాధికే శరణ్యే త్రయంబకే
గౌరీ నారాయణి నమోస్తుతే..."

గుడిలోనుంచి చండీహోమం తాలూకు మంత్రాలు శ్రావ్యంగా వినబడుతున్నాయి.

రాధ హడావిడిగా 'అయ్యో ఎన్నో అధ్యాయమో ఏమో! ఆలస్యమయితే ఈయన తిడతారు' అనుకుంటూ తలుపులు మూసి, తాళం పెట్టి గుడికి బయలుదేరింది.

హోమం ముందు కూర్చొని రుత్విక్కులు స్వాహా అన్నప్పుడల్లా హవిస్సు వేస్తున్న రామనాథం ఒకసారి కోపంగా రాధ వైపు చూశాడు. రాధ క్షమాపణ చెబుతున్నట్లు చూస్తూ ఎదురుగుండా ఉన్న కుర్చీలో కూచుంది. మరో గంటలో హోమం ముగిసింది.

ఆశీర్వచనం తీసుకుని యింటికి వచ్చారు.

రాధ, రామనాథం ఈ మధ్యనే రిటైరై యింటి దగ్గరలో వున్న గుడిలో అమ్మవారి సేవలో తరిస్తున్నారు. దసరా నవరాత్రులు వైభవంగా జరుగుతాయి. తొమ్మిది రోజులు చండీహోమం, అన్నదానం యధావిధిగా జరుగుతాయి.

హోమం జరిగినన్నాళ్ళూ రామనాథం రుత్విక్కులకు సాయంగా అక్కడే ఉంటాడు. రాధ యింట్లో పని, నైవేద్యం ముగించుకొని అక్కడికెడుతుంది. ప్రతీ రోజు హోమం ముగిసేటప్పుడు కాక తొందరగా రమ్మని రాధకి చెబుతూంటాడు. కానీ రాధ యింట్లో చేయాల్సిన పనులన్నీ ముగించుకొని మధ్యాహ్న భోజనానికి అన్నీ సిద్ధం చేసుకుని గానీ బయలుదేరదు.

గుళ్ళోనే మధ్యాహ్నం రెండవుతుంది. అప్పటికే భోజనానికి వేళ మించిపోతుంది. అందుకనే అన్నీ సిద్ధం చేసుకునే హోమం దగ్గరికి వెళుతుంది. ఈ విషయంలోనే ఇద్దరికీ తేడా వస్తుంటుంది.

"అబ్బ! ఏం చేస్తావు యింట్లో? రానేరావు తొందరగా?"

'పొద్దునే పూజ, నివేదన, మిగతా పనులు కావాలి, వంట కావాలి. మరి కావద్దూ? యిప్పుడొచ్చి చేయలేనుగా?" భోజనం వడ్డిస్తూ అన్నది రాధ.

అప్పటికే ఆకలి మీదవుండటంతో తినేసి పడుకున్నాడు రామనాథం. రాధ వంటిల్లు సర్దుకుని బయటకి వచ్చేటప్పటికి సమయం మూడయ్యింది.

నవరాత్రులలో ప్రతీరోజు సాయంత్రం ఆరుగంటలకు మళ్లీ ప్రదోషపూజా కార్య క్రమాలు జరుగుతాయి. అన్నీ ముగిసేటప్పటికే రాత్రి తొమ్మిదిగంటలు అవుతుంది. రాధా వాళ్ళకి దసరా మొత్తం హడావుడే.

"ఈ రోజు తొందరగా రా! ఈ రోజు హోమం ముందే మొదలెట్టేస్తారు. ఆ ఇందిరగారు చూడు ఎప్పుడు చూసినా గుళ్ళోనే వుంటారు. ఈ పదిరోజులైతే యిక చెప్పక్కర్లేదు. ఎప్పుడు స్కూలుకి వెడుతుందో ఎప్పుడు యింట్లో పన్లు చేసుకుంటుందో తెలియదు. మనం రిటైరైనా యింట్లో పనులేకావు. ఉన్నది ఇద్దరమే మరి" అమ్మవారికి నివేదన పెట్టిన గారెలు తింటూ రాధని హెచ్చరించాడు రామనాథం.

"ఏమోనండీ, ఇందిరగారి ట్రిక్కేమిటో అడిగి తెలుసుకోవాలి" అన్నది నవ్వుతూ.

ఇందిర వాళ్ళు ఎదురుగుండా అపార్ట్‌మెంట్‌లో వుంటారు. చాలా బాగా ముస్తాబై చలాకీగా తిరుగుతూ గుడిలో జరిగే కార్యక్రమాలన్నింటిలో పాల్గొంటూ వుంటుంది. రామనాథం నోట ఇందిర పట్ల ప్రశంస తరచుగా వస్తూనే ఉంటుంది.

గుళ్ళోకి ఆ నియోజక వర్గం ఎమ్మెల్యే రావడంతో అంతా హడావిడిగా ఉంది. కార్పొరేటర్, యితర సిబ్బంది, వాళ్ళ అనుచరులు రావడంతో గుడి నిండిపోయింది.

ఒకపక్క హోమం జరుగుతుంటే మరోపక్క ఆలయ సిబ్బంది ఎమ్మెల్యేకి స్వాగతం పలకడంతో బిజీగా వున్నారు. హోమం తరువాత సామూహిక భోజన కార్యక్రమం వుండటంతో జనం కిక్కిరిసి వున్నారు. ఎవరికి వాళ్ళు రాజకీయ నాయకుల దృష్టిలో పడాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

చండీహోమం పూర్తికావచ్చింది. రాధ జాడలేదు. హోమగుండం ముందు కూర్చున్న రామనాథం అసహనంగా వున్నాడు. 'ఏమైనా సమస్య వచ్చిందా? ఏం చేస్తుంది రాధ ఇంతసేపు? ఎన్నిసార్లు చెప్పినా ఇంతే' పదోసారి అనుకుంటూ ఎవరినన్నా పంపిద్దామా అనుకుంటుంటే కమిటీ ఛైర్మన్ పిలవడంతో అటు వెళ్ళాడు. రుత్విక్కులు హోమంలో పాల్గొన్నవాళ్ళకి ఆశీర్వచనం యిచ్చే పనిలో వున్నారు.

"సర్ అమ్మగారు" అంటూ రామనాథం వైపు చూశాడు పూజారిగారు.

ఆశీర్వచనం కానివ్వమంటూ సైగచేసి అక్కడ కూర్చున్నాడు.

మనసులో ఎన్నో ఆలోచనలు.

'రాధకేమైయింది ఏమన్నా ఆరోగ్యం బాగా లేదా? లేకపోతే ఎక్కడన్నా పడిపోయిందా? ఎక్కడికన్నా వెళ్లిందా?' ఏవో సందేహాలు తొలుస్తుంటే యింటికి దారితీశాడు.

అనూహ్యంగా యింటి గేటుకి తాళం వేసుంది. కారు బయటవుంది. రామనాథం గుండె దడ హెచ్చింది. ముచ్చెమటలు పోశాయి. అంతలో డ్రైవరు వెంకట్రావు వచ్చి "సార్ అమ్మగారు ఎదురింట్లో వున్నారు" అన్నాడు.

రామనాథం ఉరుకులు పరుగులతో ఎదురింట్లో మూడో అంతస్తులో ఉన్న ఇందిరగారింట్లోకి దూసుకెళ్లాడు.

అక్కడ, ఇందిరా వాళ్ళ అత్తగారిని సోఫామీద పడుకోబెట్టడానికి ప్రయత్నిస్తోంది




రాధ. రాధని చూడగానే ఊపిరి పీల్చుకుని పైనవేసుకున్న ఉత్తరీయంతో ముఖం గట్టిగా తుడుచుకున్నాడు. అక్కడున్న కుర్చీలో కూలబడిపోయాడు.

"రాధా ఏమిటిది? యేమైంది?"

"నేను చెబుతా సార్" ఎప్పుడువచ్చాడో వెంకట్రావు రామనాథం వెనుక నిలబడి అన్నాడు.

• • •

రాధ పనులు చేసుకుంటూ వంటింట్లో నుంచి గుడికి వెళ్లే వాళ్ళను చూస్తూ తయారవుతోంది.

అంతలో దబ్బుమన్న చప్పుడు వినిపించింది గేటు బయట నుంచి. గబగబా వాకిట్లోకి పరుగెత్తింది. ఎదిరింటి ఇందిరా వాళ్ళ అత్తగారు సుజాతమ్మ నంది వర్ధనం చెట్టుకింద పడిపోయింది. ఆమె చేతిలోని పూలసజ్జ పక్కకి పడిపోయింది. ఊపిరి భారంగా పీలుస్తోంది. కళ్లు మూతలు పడుతున్నాయి. రాధకి ఆ సమయంలో ఏవీ గుర్తురాలేదు. పడిపోయిన సుజాతమ్మను చూస్తూనే గుండె దడ దడా కొట్టుకుంది. షుగర్ పేషంటని గుర్తొచ్చింది. కొంచెం పంచదార నోట్లో వేసింది. సాధ్యమైనంత తొందరగా ఆమెని హాస్పిటల్‌కి తీసుకెళ్లాలని

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి




మాత్రం తోచింది. గుళ్ళోకెళ్ళేవాళ్ళు ఆగి చూస్తున్నారు.

రాధ అక్కడేవున్న డ్రైవర్ వెంకట్రావుతో "వెంకట్రావ్ కారు తియ్యి హాస్పిటల్‌కి తీసుకెడదాం. నేను యిల్లు తాళమేసి వస్తాను" కారు తాళాలు ఇస్తూ అన్నది రాధ.

"వాళ్ళింటికాడ ఎవ్వరూ లేరమ్మా. ఇందిరమ్మ వాళ్ళు వేరే గుడికి పోయిన్రు. ఈ అమ్మ ఏందో గిట్ల పడ్డది" అన్నది లక్ష్మి.

లక్ష్మి ఇందిరావాళ్ళ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ భార్య.

అక్కడున్న వాళ్ళ సాయంతో ఆమెని కార్లో ఎక్కించింది.

వాచ్‌మెన్ భార్యకూడా ఎక్కింది కార్లో.

దగ్గరలో వున్న నర్సింగ్‌హోమ్‌కి తీసుకెళ్లారు.

షుగర్ లెవెల్స్ పడిపోవడం వల్ల క్రిందపడిందని చెప్పి ట్రీట్మెంట్ మొదలెట్టారు. ఫ్లూయిడ్స్ పెట్టారు. కాసేపటికి ఆమె తేరుకుంది. ఇందిర భర్త నాగరాజుకి ఫోన్ చేయగా ఆయన వచ్చారు. హాస్పిటల్లో ఆయనను వుంచి రాధ ఒకసారి యింటికి వచ్చి మళ్లీ వెళ్ళింది. ఆమెని యింటికి తీసుకెళ్ళచ్చని చెప్పాక అందరూ కలిసి యింటికి వచ్చేశారు.

రాధ యింటికి వద్దామని ప్రయత్నిస్తుండగా రామనాథం వచ్చాడు.

• • •

"అమ్మగారెక్కడున్నారని సార్ వెదుకుతున్నట్లున్నారు. ఆమె పాపం మా అమ్మని తీసుకుని హాస్పిటల్‌కి వెళ్ళింది. మీకు శ్రమ యిచ్చాం" అంటూ గ్లాసుతో మంచినీళ్ల తీసుకుని వంటగదిలో నుంచి బయటకి వచ్చాడు.

"అమ్మగారు లేకపోతే మా అమ్మ కోమాలోకి పోయేదే. అంతా మా అదృష్టం అమ్మగారు టైముకు తీసుకువెళ్లారు. మాయింటికి ఎన్నడూ రాకపోతిరి. కూర్చోండి సర్."

"పరవాలేదండీ" అంటూ లేచి నిలబడి ఇంటిని పరీక్షగా చూడసాగాడు.

హాల్లోని సోఫా కమ్ బెడ్ మీద అస్తవ్యస్తంగా ఉన్న బెడ్ షీట్. దానిమీదే దువ్వుకొని వదిలేసిన దువ్వెనలు, ఏవో వస్తువులు. అన్ని వస్తువులమీదా అంగుళం మందాన దుమ్ము పేరుకొని వుంది. పేపర్లు పుస్తకాలు టీవీ యూనిట్ కింద అడ్డదిడ్డంగా పడివున్నాయి. ఒకవైపు డైనింగ్ టేబుల్ మీద స్విగ్గీ నుండి తెప్పించుకున్న ప్యాకింగ్ దారాలతో సహా వుంది. దానిమీద, అక్కడేవున్న పండ్లమీద దోమలు ముసురుతున్నాయి. దానిమీదే పచ్చడి సీసాలు మూతలు సరిగ్గా లేకుండా లోపల స్పూన్లతో సహా వున్నాయి.

పైన అందరు దేవుళ్ల ఫోటోల మీద వాడిన దండలు వేలాడుతూ ఉన్నాయి. ఫోటోల వెనుక అంతా బూజు వేలాడుతోంది. రెండు గదులకు మాసిపోయిన కర్టెన్లు వేలాడుతున్నాయి. లోపల మంచంమీద దుప్పటి ఉంగచుట్టివుంది. ఏవో బట్టలు కుప్పలుగా పడివున్నాయి. ఇంకో గది పక్కగా ఉండటం వల్ల సరిగ్గా కనిపించడం లేదు. కిందనేలంతా మురికిగా మరకలు మరకలుగా వుంది. మంచి నీళ్ళు తీసుకొచ్చిన గ్లాసు జిడ్డుగా లోపల గారపట్టి వుంది. నీళ్ళు తాగడానికి మనస్కరించక వదిలేశాడు.

"ఇది వంటిల్లు సార్" అంటూ లోపలికి చూపించాడు నాగరాజు. సింకునిండా గిన్నెలుండటం వల్ల జుమ్మని దోమలు ముసురుతున్నాయి. అంతా కంగాళీగా ఉంది. ఎక్కడా వంటచేసిన దాఖలాల్లేవు.

దేవుడి ఫోటోలు మకిలిపట్టి ఎన్నడూ తుడుపుకి నోచుకోని వాటిలా వున్నాయి. దీపాలు మసిపట్టి నూనె కిందికి కారి మడ్డిగా ఉన్నాయి. ఆరిపోయిన అగ్గిపుల్లలు అక్కడే పడివున్నాయి.

రామనాథం చూడలేక తలతిప్పుకుని "పద" అన్నాడు రాధతో.

"అమ్మకి తినడానికి ఏమైనా ఉన్నాయా?"అడిగింది రాధ.

"ఈ రోజు పొద్దున్నే అష్టలక్ష్మి గుడికి వెళ్లింది మేడం ఇందిర. మాపాప కాలేజీ పిల్లలతో టూరుకి పోయింది. నేనూ, అమ్మ గుడిలో తిందామని అనుకున్నాం. ఇంతలో యిట్లయింది."

"అమ్మకి నేను పంపిస్తాను లెండి."

• • •

రాధ, రామనాథం యింటికి వచ్చేశారు.

అప్పటివరకూ ఏమీ తినకపోవడంతో ఆకలిగావుంది ఇద్దరికీ. ఇంకా అన్నం వండలేదేమోనని భయపడ్డాడు రామనాథం.

"మీరు భోజనం చేసేయండి. నేను కొన్ని బియ్యం పెట్టి కూర్చుంటాను. సుజాతగారికి పంపించాలి గదా."

మాట్లాడుతూనే భోజనం వడ్డించింది.

మారు మాట్లాడకుండా తినడం మొదలుపెట్టాడు.

మళ్ళీ కుక్కర్ పెట్టి వచ్చి భోజనం వడ్డించుకుంది రాధ.

"అన్నం ఎప్పుడు వండావు? పొద్దునే వండావా? యింత వేడిగా ఎలావుంది?"

"హాస్పిటల్ నుంచి మధ్యలో వచ్చాగా! అప్పుడు వండి వెళ్లాను."

తృప్తిగా భోజనం చేసి లేచాడు రామనాథం.

తరువాత వంటిల్లు సర్దుకుంటూ హాట్ ప్యాక్‌లో అన్నం, మామిడికాయ పప్పు, టమాట చారు, బీరకాయకూర సర్ది వెంకట్రావుతో పంపించింది. అలసటగా వున్నా రాధ చేసేపనిని చూస్తూ కూర్చున్నాడు రామనాథం.

అద్దంలా వున్న హాలు, సోఫాలు కాస్త కూడా దుమ్ములేకుండా నీట్‌గా దిండ్లు సర్ది వున్నాయి. పూజగదిలో దేవుడికి అలంకరించిన పూల సువాసన ఇల్లంతా వ్యాపించింది. వంట గదిలో స్టవ్ ఎప్పుడన్నా వంట చేసారా అన్నట్లు కొత్తగా వుంది. పాత్రలన్నీ తళతళ మెరిసిపోతున్నాయి. కప్ బోర్డులో వున్న బట్టలు వేటికవి మడతలు పెట్టి వున్నాయి.

**"ఈ రోజు తొందరగా రా! ఈ రోజు హోమం ముందే మొదలెట్టేస్తారు. ఆ ఇందిరగారు చూడు ఎప్పుడు చూసినా గుళ్ళోనే వుంటారు. ఈ పది రోజులైతే యిక చెప్పక్కర్లేదు. ఎప్పుడు స్కూలుకి వెడుతుందో ఎప్పుడు యింట్లో పన్లు చేసుకుంటుందో తెలియదు. మనం రిటైరైనా యింట్లో పనులేకావు. ఉన్నది ఇద్దరమే మరి" అమ్మవారికి నివేదన పెట్టిన గారెలు తింటూ రాధని హెచ్చరించాడు రామనాథం.**

**"ఏమోనండీ, ఇందిరగారి క్షేమం టో అడిగి తెలుసుకోవాలి" అన్నది నవ్వుతూ.**

ఇందిర వాళ్ళ ఇల్లు గుర్తొచ్చి ఒళ్ళు జలదరించింది!

నాగరాజు హాట్ పాక్ తీసుకుని వచ్చాడు.

"అమ్మకి పెట్టి నేను గుడిలో తిన్నాను మేడం. అమ్మ మంచిగుందంటే అది మీ వల్లనే" నమస్కరించాడు.

"ఇందిర గారు వచ్చారా?" అడిగాడు రామనాథం.

"లేదు సర్."

"అయ్యో! సమయానికి ఆమె లేకుండా అయింది."

"ఏం చెప్పమంటారు సర్ నా గోడు. మా ఇందిర టీచర్. ఆ డ్యూటీనే కాక ఎప్పుడూ ఏదో ఒక గుడి పట్టుకుని తిరుగుతుంటది. సెలవులిచ్చారంటే యింట్లనే వుండదు.



చిన్నతనంలోనే మా నాయన చనిపోతే నన్నూ, యిద్దరు అక్కలను మా అమ్మే పెంచి పెద్దజేసింది. మస్తు కష్టాలు బడ్డది సర్. ఇన్ని రోజులు ఆమెకి బాగానే ఓపికవుండే అన్నిపనులు ఆమెనే చేస్తుండేది. ఆమెకి ఆరోగ్యం బాగలేక యిల్లు ఆగమైంది. మా అక్కలొస్తే వాళ్లే చేసుకొని తిని పోతారు. ఈమె ఎంతసేపూ తయారవడం గుడికి బోవడం. చెప్పి చెప్పి విసిగిపోయాను. ఏమన్నా అంటే నేనెక్కడ బోతున్న... గుడికేగా అంటది. రోజుకో పంచాయతీ. తల్లి లెక్కనే నా బిడ్డకూడా. బిడ్డ పెళ్ళిజేసి అమ్మను తీసుకొని మా చిన్నక్క దగ్గర వుందామని చూస్తున్నా. అప్పటివరకు అమ్మకెట్లుంటదో" చెమ్మగిల్లిన కళ్లను రుమాలుతో తుడుచుకుంటూ అన్నాడు నాగరాజు.

'ఆఫీసుకు వెళ్ళేటప్పుడు కూడా అమ్మకి మడిగా వంట

**హాల్లోని సోఫా కమ్ బెడ్ మీద అస్తవ్యస్తంగా ఉన్న బెడ్ షీట్. దానిమీదే దువ్వుకొని వదిలేసిన దువ్వెనలు. ఏవో వస్తువులు. అన్ని వస్తువులమీదా అంగుళం మందాన దుమ్ము పేరుకొని వుంది. పేపర్లు పుస్తకాలు టీవీ యూనిట్ కింద అడ్డదిడ్డంగా పడివున్నాయి. ఒకవైపు డైనింగ్ టేబుల్ మీద స్విగ్గీ నుండి తెప్పించుకున్న ప్యాకింగ్ దారాలతో సహా వుంది. దానిమీద, అక్కడే వున్న పండ్లమీద దోమలు ముసురుతున్నాయి. దానిమీదే పచ్చడి సీసాలు మూతలు సరిగ్గా లేకుండా లోపల స్పూన్లతో సహా వున్నాయి.**

చేసి, అన్నీ సర్ది వెళ్లేది రాధ. సెలవురోజుల్లో అమ్మకి, పిల్లలకి, తనకి, వడ్డించి అమ్మ కంచం తీసిన తర్వాతనే భోజనానికి కూర్చునేది. అందుకే ఆమెకి రోజంతా పనే సరిపోయేది. అరవై దాటాక కూడా అదే పర్ఫెక్షన్ పనిలో. వయస్సు ప్రభావం వల్ల వేగం కొద్దిగా తగ్గింది అంతే. తనేమో ఇందిరను ఆదర్శంగా చూపించాడు. నాణానికి ఒకవైపే చూశాడు. రాధ మానవతా దృష్టితో సుజాతమ్మను హాస్పిటల్‌కి తీసికెళ్లింది. మనిషిగా చేయాల్సింది చేసింది. తన కర్తవ్యం, యింట్లోవాళ్ళ సంక్షేమం వదిలేసినప్పుడు ఎన్ని గుళ్ళు తిరిగి ఏం ప్రయోజనం?' మార్పు తన ఆలోచనలో రావాలి. రాధకి ఇంటి పనులలో సాయం చేయాలి. అస్తమానం యితరులతో పోల్చడం మానేయాలి.'

కాసేపు నడుం వాల్చిన రాధను తదేకంగా చూస్తూ మనసులో అనుకున్నాడు రామనాథం.

**94912 72077**

# 'విండో క్లీనింగ్' వరల్డ్‌కప్

**ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్ వరల్డ్ కప్ గురించి విన్నాం. కానీ 'విండో క్లీనింగ్' వరల్డ్ కప్ గురించి ఎప్పుడైనా విన్నారా? కిటికీలు తుడిచే వాళ్ల కోసం ఒక వరల్డ్ కప్ నిర్వహిస్తున్నారంటే ఆశ్చర్యమే. ఇంతకీ ఈ పోటీ ఎక్కడ జరుగుతుంది?...**




చిన్న పనైనా ఇష్టంతో, నైపుణ్యంతో చేస్తే అది కూడా గుర్తింపును తెచ్చిపెడుతుంది. అందుకు చక్కని ఉదాహరణ 'విండో క్లీనింగ్' పోటీలు. వేల మంది జనం... స్టేజీ మీద వరుసగా అద్దాల కిటికీలు... పోటీదారులను ఉత్సాహపరుస్తూ కేకలు వేస్తున్న ప్రజలు... వెరసి క్రికెట్, ఫుట్‌బాల్ పోటీలకు ఇదేమీ తక్కువ కాదన్నట్టుగా సందడి. లండన్‌లో జరిగే 'విండో క్లీనింగ్' వరల్డ్‌కప్ పోటీల్లో కనిపించే దృశ్యమిది. ఈ పోటీల్లో పాల్గొనడానికి జపాన్, అమెరికా, జర్మనీ, ఇటలీ, చెక్ రిపబ్లిక్... వంటి దేశాల నుంచి పోటీదారులు వెళ్తుంటారు.

**విజేత ఎంపిక ఇలా...**

పోటీలో పాల్గొనే గాజు యోధులు బకెట్, గుడ్డ, స్క్వీజ్, క్లీనింగ్ ద్రావణం పట్టుకుని సిద్ధంగా ఉంటారు. రెఫరీ విజిల్ ఊదగానే వాళ్లంతా మెరుపు వేగంతో కిటికీలను శుభ్రం చేయడం మొదలెడతారు. అదొక పనిలా కాకుండా, శుభ్రం చేయడం కూడా ఒక కళ అనిపించేలా పోటీలు సాగుతాయి. అద్దం మీద ఒక్క గీత కూడా లేకుండా శుభ్రం చేసిన యోధున్ని ఆ రౌండ్ విజేతగా జడ్జీలు ప్రకటిస్తారు. అలా ప్రిలిమినరీ రౌండ్స్‌లో విజేతలుగా నిలిచినవారు ఫైనల్ రౌండ్‌లో తలపడతారు. ఈ రౌండ్ అత్యంత కఠినమైనది. ప్రతిభ కనబర్చినవారే విజేతగా నిలుస్తారు. ఫైనల్‌లో మూడు కిటికీలను ఎంత వేగంగా, ఎంత బాగా శుభ్రం చేస్తారో వారే విజేత. ముగ్గురు న్యాయనిర్ణేతలు ప్రతీ చిన్న గీత, చుక్క, మరకను కూడా గమనిస్తారు. ఇప్పటిదాకా క్లీనింగ్‌లో దిగ్గజం అంటే... 71 ఏళ్ల టెర్రీ బరోస్. ఆయన 2009 పోటీలలో 45 అంగుళాల వెడల్పు, 45 అంగుళాల పొడవున్న 3 కిటికీలను కేవలం 9.14 సెకన్లలో శుభ్రం చేసి ప్రపంచ రికార్డు క్రియేట్ చేశారు. ఆ రికార్డు ఇప్పటికీ పదిలంగా ఉంది. వరల్డ్‌కప్ విజేతకు నగదు బహుమతి అందిస్తారు. ఈ బహుమతి కన్నా ప్రపంచ ఛాంపియన్‌గా పేరు పొందడాన్ని గౌరవంగా భావిస్తారు. ❋



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# సముద్రం

గన్నవరపు నరసింహమూర్తి, 77520 20123..

సముద్రం. అందులోని ప్రతి అల ఎగిసిపడుతూ వచ్చి తీరాన్ని తాకి వెంటనే వెనక్కి వెళ్లిపోతుంది. అయినా నిరుత్సాహం చెందకుండా మళ్లీ అంతే వేగంతో వస్తుంది. ఓటమి అన్నది దానికి ఇష్టం ఉండదు.బహుశా అందుకేనేమో నాకు సముద్రం అంటే బాగా ఇష్టం.నాకు మనసు బాగా లేనప్పుడు సముద్రం దగ్గరకు వచ్చి ఒంటరిగా దాన్ని చూస్తూ కూర్చుంటాను.ఆ రోజు కూడా నా మనసు బాగా లేకపోవడంతో నేను సముద్రం ఒడ్డుకి వచ్చి కూర్చున్నాను.అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతూ వస్తూ పోతున్నాయి.

నా మనసు మాత్రం మధుకర్ గురించి ఆలోచిస్తోంది. వాడు నన్ను వదిలి వెళ్ళిపోయి ఐదేళ్లు కావస్తోంది.అయినా ఇప్పటికీ నేను వాడి కోసం ఎదురుచూస్తూనే ఉన్నాను. వాడు బతికున్నాడో లేదో కూడా తెలియదు. అయినా ఎప్పుడో ఒకరోజు తిరిగి వస్తాడని నా ఆశ. కొన్ని ఎదురుచూపులకు కారణాలు ఉండవు. కొన్ని స్నేహాలకు ముగింపులు ఉండవు. పదిహేనేళ్ల క్రితం మేమిద్దరం కలిసి నాటిన చిన్న మొక్క మా కంపెనీ ఇప్పుడు వందలాది మంది ఉద్యోగులతో పెద్ద వృక్షమైంది.కానీ మా స్నేహమే కనుమరుగైంది.జీవితంలో మధుకర్‌ను నేను మొదటిసారి చూసిన రోజు నాకు ఇప్పటికీ గుర్తుంది.ఇంటర్మీడియట్ లో మొదటి రోజు నేను క్లాసుకి ఆలస్యంగా పరుగెత్తుకుంటూ వెళ్ళినప్పుడు సన్నగా ఉన్న ఒకబ్బాయి తన చేతి గడియారాన్ని నాకు చూపిస్తూ "నువ్వు ఐదు నిమిషాలు ఆలస్యమయ్యావు" అనీ అన్నాడు.వాడే మధుకర్.సమయ పాలన గురించి చెప్పిన ఆ మనిషి కోసం నేను జీవితాంతం ఎదురు చూడాల్సి వస్తుందని ఆ రోజు నాకు తెలియదు.సముద్రంలోని అలలు తీరానికి వస్తూ వెనక్కి వెళ్లిపోతున్నాయి.ఆ అలల్లాగే నా ఆలోచనలు కూడా పాతికేళ్ల వెనక్కి వెళ్ళసాగాయి.

మనిషి జీవితంలో కొన్ని పరిచయాలు యాదృచ్ఛికంగా కలుగుతాయి.కానీ అవే తరువాత జీవిత దిశను మార్చే మలుపులవుతాయి.మధుకర్‌తో నా పరిచయం కూడా అలాంటిదే.ఇంటర్మీడియట్‌లో మొదలైన ఆ స్నేహం, డిగ్రీ పూర్తయ్యేలోపే విడదీయలేని బంధంగా మారిపోయింది.మేమిద్దరం చదువులో పోటీ పడేవాళ్లం.కానీ ఒకరి మీద ఒకరికి అసూయ ఎప్పుడూ ఉండేది కాదు.వాడు గణితంలో అసాధారణ ప్రతిభ చూపిస్తే నేను ఆర్థిక శాస్త్రంల్లో ఆసక్తి చూపించేవాడిని.పరీక్షల్లో మా ఇద్దరిలో ఎవరు మొదటి ర్యాంకు సాధించినా ఇద్దరం సంతోషించే వాళ్ళం.డిగ్రీ చివరి రోజునాడు కాలేజీ ఆవరణలోని పాత వేపచెట్టు కింద కూర్చున్నప్పుడు "తరువాత ఏం చేస్తావు"?అనీ నేను అడిగితే మధుకర్ ఆకాశం వైపు చూస్తూ"ఐఐటీ" లో ఇంజినీరింగు చదువుతాను"అనీ చెప్పాడు. అప్పుడు నేను "నాకు అహమ్మదాబాద్ ఐ ఐ ఎం లో ఎంబీఏ చదవాలని వుంది"అనీ చెప్పాను.నా మాటలు విన్న వాడు"మనం స్వంతంగా ఒక కంపెనీ పెట్టి పది మందికి ఉద్యోగాలు ఇద్దాము"అనీ చెప్పాడు.

సంవత్సరాలు గడిచాయి.మధుకర్ ఐఐటీ ఖరగ్‌పూర్‌లో కంప్యూటర్ సైన్స్ లో ఇంజనీరింగ్ పూర్తి చేస్తే నేను అహ్మదాబాద్ ఐఐఎంలో ఎంబీఏ చదివాను.దేశంలోని పెద్ద పెద్ద కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలకు వచ్చాయి. మొదట నాకు ఒక బహుళజాతి సంస్థ నుంచి ఉద్యోగ ఆఫర్ వచ్చింది.అదే సాయంత్రం నాకు మధుకర్ నుంచి ఫోన్ వచ్చింది.

"శర్మ,మనం ఇంకొకరి కంపెనీని అభివృద్ధి చేయడానికి చదవలేదు.మన కలను నిజం చేసుకునేందుకు చదివాం.మనమే ఓ కంపెనీని ప్రారంభిద్దాం"అనీ చెప్పాడు.

సంవత్సరం తరువాత విశాఖపట్నం లో సముద్రానికి దగ్గరగా ఉన్న ఒక చిన్నఅద్దె భవనంలో మా కంపెనీ "న్యూ వేవ్స్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ లిమిటెడ్"ప్రారంభమైంది. ఆ రోజు మా దగ్గర డబ్బు,అనుభవం రెండూ లేవు .ఉద్యోగులు కూడా లేరు.కానీ ఆత్మవిశ్వాసం మాత్రం అపారంగా ఉండేది.మొదటి ఉద్యోగి వచ్చిన రోజు మేమిద్దరం హోటల్‌కి వెళ్లి ఒక్క ప్లేట్ బిర్యానీ పంచుకుని తిన్నాము .పది మంది ఉద్యోగులు చేరిన రోజు స్వీట్లు పంచాము .యాభై మంది అయిన రోజు ఆఫీసులో చిన్న వేడుక చేసుకున్నాము .అలా ప్రతి విజయాన్ని మేమిద్దరం కలిసి ఆస్వాదించాం.

అయితే మొదటి నుంచి మధుకర్ సమయం విషయంలో కచ్చితంగా ఉండేవాడు."ఒక నిమిషం ఆలస్యం అంటే ఒక నిమిషం నష్టం"అని తరచూ చెప్పేవాడు.మొదట అది క్రమశిక్షణలా అనిపించింది.తరువాత అది అలవాటైంది.చివరికి అదే అతని స్వభావంగా మారిపోయింది.అప్పట్లో నేను దాన్ని పెద్దగా పట్టించుకోలేదు.ఒక రోజు అదే అలవాటు మా జీవితాలను అల్లకల్లోలం చేసి పెనుమార్పులకు కారణం

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్స్అప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

అవుతుందని నాకు తెలియదు.ఆ మార్పుకు కారణమైన వ్యక్తి లయ.ఆమె మా కంపెనీ గుమ్మం దాటిన రోజు మా జీవితాల్లోకి విధి కూడా నెమ్మదిగా అడుగుపెట్టింది.

ఉదయం తొమ్మిది గంటలకు ఆఫీసు ప్రారంభమైతే వాడు ఎనిమిది నలభై ఐదుకే తన గదిలో కూర్చుని ఉండేవాడు.టేబుల్ మీద కంప్యూటర్.మరొకవైపు అతని తండ్రి బహుమతిగా ఇచ్చిన పాత చేతి గడియారం.

"ఫోన్‌లో టైమ్ ఉంది కదా! ఇంకా ఆ పాత గడియారం ఎందుకు?"అనీ నేను వాణ్ని అడిగితే

"మా నాన్న రైల్వే స్టేషన్ మాస్టర్.ఒక్క నిమిషం ఆలస్యం అయితే ఒక రైలు కాదు వందల మంది జీవితాలు ఆలస్యం అవుతాయని ఆయన చెప్పేవాడు.అతని వల్ల నాకు సమయ పాలన అలవాటైంది"అనీ చెప్పాడు.

కాలం తో పాటు మా కంపెనీ కూడా వేగంగా ఎదిగింది.మా క్లయింట్లు అమెరికా, జర్మనీ, జపాన్ వరకు పెరిగారు.ఒక్క ప్రాజెక్టు ఆలస్యమైనా కోట్ల రూపాయల నష్టం.ఆ ఒత్తిడి ఎక్కువగా మధుకర్ మీదే ఉండేది.

అతను ఉద్యోగులకు "మీరు ఎనిమిది గంటలు పనిచేయాల్సిన అవసరం లేదు.నాలుగు గంటలు చేసినా పరవాలేదు.కానీ ఆ చేసిన నాలుగు గంటలు ప్రపంచంలో ఎవరూ చేయలేనంత నిజాయితీగా పని చేయాలి"అనీ చెప్పేవాడు.

ఆ మాటలో నిజం ఉండేది.అందుకే అందరూ అతన్నిగౌరవించేవారు.కానీ వాడిని ఇష్టపడేవారు కాదు. మా కంపెనీలో ఉద్యోగులు చేరడం చాలా సులభం.కానీ అందులో కొనసాగడం కష్టం.దానికి కారణం మధుకర్.

ఒకసారి కొత్తగా చేరిన ఒక ఇంజనీర్ ఉదయం పది నిమిషాలు ఆలస్యంగా వచ్చాడు.అప్పుడు

మధుకర్ అతన్ని తన గదిలోకి పిలిచి "ఎందుకు ఆలస్యమైంది?"అనీ అడిగాడు.

అతను ఆలస్యానికి కారణం చెబుతుంటే "రేపటినుంచి ఆలస్యం అయితే నువ్వు కంపెనీకి రానవసరం లేదు"అనీ చెప్పాడు.

నేను ఆ విషయం తెలుసుకొని "ఇంత కఠినంగా ఉండటం అవసరమా?"అనీ అడిగితే

అతను కంప్యూటర్ స్క్రీన్ మీద నుంచి తల ఎత్తకుండా "ఈరోజు పది నిమిషాలు.రేపు గంట.

ఎల్లుండి ప్రాజెక్టు ఆలస్యం అవుతుంది.ఆ తరువాత కంపెనీకి నష్టాలు తప్పవు"అనీ అన్నాడు.

వాడి వాదనలో తర్కం ఉండేది కానీ అది ఉద్యోగులకు నచ్చేది కాదు.వాడి కఠినత్వం ఆఫీసుకే పరిమితం కాలేదు.ఇంటివద్ద కూడా అంతే.అయితే మధుకర్ చెడ్డవాడు కాదు.అతను ఎవరికీ అన్యాయం చేయాలని అనుకోడు.అతనికి పని మొదటి ప్రాధాన్యం.ఆ తరువాతే బంధాలు,స్నేహాలు.

ఒక సారి మా మానవ వనరుల విభాగానికి వందలాది దరఖాస్తులు వచ్చాయి.వాటిలో ఒక అమ్మాయి బయోడేటా నా దృష్టిని ఆకర్షించింది.ఆమె పేరు లయ.ఆమె ఎన్ఐటీ వరంగల్ లో కంప్యూటర్ సైన్స్ చదివింది.విశ్వవిద్యాలయ బంగారు పతక విజేత.ఆమె ప్రాజెక్టుల జాబితా చదివిన తరువాత నేను వెంటనే ఇంటర్వ్యూకు పిలవమని చెప్పాను.ఆ రోజు నా టేబుల్ మీదకు వచ్చిన ఆమె దరఖాస్తు మా కంపెనీ చరిత్రనే కాదు మా ముగ్గురి జీవితాలనూ శాశ్వతంగా మార్చేస్తుందని అప్పుడు నాకు తెలియదు.

ఆ సాయంత్రం నాలుగు గంటలకు ఆమె ఇంటర్వ్యూ ప్రారంభమైంది.ఇంటర్వ్యూ ని నేను,మధుకర్ కలిసి చేసాము.మేము అడిగిన ప్రశ్నలన్నింటికీ లయ బాగా సమాధానాలు చెప్పింది.వారం తరువాత లయ మా కంపెనీలో చేరింది. మొదటి రోజే అందరితో కలిసిపోయింది. కొత్త ఉద్యోగుల్లా సంకోచం లేదు. సీనియర్ల పట్ల గౌరవం ఉంది. జూనియర్లకు సహాయం చేసే మనసుంది. మూడు వారాల్లోనే ఆమె అభివృద్ధి చేసిన ఒక చిన్న సాఫ్ట్‌వేర్ మాడ్యూల్‌ను అమెరికా క్లయింట్ ప్రత్యేకంగా అభినందించడంతో మధుకర్ ఆమెను ప్రత్యేకంగా అభినందించాడు. ఆరు నెలల్లో లయ మా కంపెనీలో అత్యంత విశ్వసనీయమైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లలో ఒకరిగా మారిపోయింది. క్లిష్టమైన ప్రాజెక్టులకు లయను టీం లీడర్ గా నియమించడం జరిగింది.

కానీ జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఒక రోజు మొదటిసారిగా ఉదయం తొమ్మిది గంటలు దాటినా లయ ఆఫీసుకు రాలేదు.ఆ రోజు మొదలైన ఆ ఆలస్యం మా జీవితాల్లో కూడా ఒక పెద్ద మార్పుకు నాంది పలికింది.ఆమె తరచూ ఆఫీస్ కి ఆలస్యంగా రావడం మాకు ఇబ్బందులు కలిగించింది.

ఒక రోజు ఆమె ఆఫీసుకి పన్నెండు గంటలకు వచ్చింది.మధుకర్ ఆమెను తన గదిలోకి పిలిచి “ఈ నెలలో మీరు ఆలస్యంగా రావడం ఇది ఐదోసారి.టీం లీడర్ అయిన మీరే ఇలా ఆలస్యంగా వస్తే ఎలా?"అనీ అసహనం వెలిబుచ్చాడు.

ఆ రోజు నుంచి ఆమె ఆలస్యంగా రావడం అనేది మా కంపెనీకి ఒక సమస్యగా మారసాగింది. ఆమె చేతిలో ఉన్న ప్రాజెక్టులు అన్నీ ఆమె ఆలస్యం కారణంగా వాయిదా పడటంతో క్లయింటులందరు అసంతృప్తి వ్యక్తం చెయ్యడం మొదలైంది.దాని వల్ల మధుకర్ చిరాకు రోజు రోజుకీ పెరగసాగింది.

ఒక రోజు నేను లయను నా గదికి పిలిచాను.మా అటెండెంట్ ఇద్దరికీ కాఫీలు తెచ్చాడు. "లయ,నీ వ్యక్తిగత జీవితంలో జోక్యం చేసుకోవాలని నాకు లేదు.కానీ నువ్వు ఇంతకు ముందులా పనిచేయటం లేదు.దాని వల్ల మన ప్రాజెక్టులన్నీ ఆలస్యం అవుతున్నాయి.నీకు ఏదైనా సమస్య ఉంటే నాకు చెప్పు.మనం కలిసి పరిష్కారం వెతుకుదాం" అనీ

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

చెప్పాను.

నా మాట వినగానే ఆమె తల దించుకుంది . ఒక కన్నీటి బొట్టు ఆమె కాఫీ కప్పులో పడింది. "సార్,మూడు సంవత్సరాల క్రితం నాకు ప్రేమ వివాహం జరిగింది.అతను కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.పెళ్లైన సంవత్సరం అయిన దగ్గరనుంచి హింస మొదలైంది . ప్రతి చిన్న విషయానికీ అనుమానం.అవమానం.మాటలతో హింస.ప్రతి రోజు" ఆమె కళ్లు మూసుకుంది. "శరీరంపై పడిన గాయాలు మందులతో పోతాయి కానీ మాటలతో పడిన గాయాలు మాత్రం" ఆమె వాక్యం పూర్తి చేయలేకపోయింది.ఆమె కళ్ళల్లో నీరు చెమ్మగిల్లసాగింది."అతనితో బాధలు పడలేక విడాకులు తీసుకున్నాను.కానీ దానికి నా తల్లితండ్రులతో సహా అందరూ నన్నే తప్పు పట్టారు.నా కూతురు ప్రియను నేనే పెంచుతున్నాను.అతని నీడ కూడా దాని మీద పడటం నాకు ఇష్టం లేదు. నేను భార్యగా ఓడిపోయినా తల్లిగా గెలిచాను" అనీ చెప్పింది. ఆ మాటలు చెబుతున్నప్పుడు ఆమె కళ్లలో వెలుగు కనిపించింది.

"ఉదయం నాలుగు గంటలకు లేచి వంట చేసి,ప్రియకు టిఫిన్ సిద్ధం చేస్తాను.ఆమె హోంవర్క్ చూస్తాను.స్కూల్ బస్సు ఎక్కిస్తాను.నేను ఒంటరి తల్లిని.అన్ని పనులే నేనే చేసుకోవాలి.నాకు తోడు ఎవ్వరూ లేరు. అందుకే ఆఫీసుకు ఆలస్యమవుతోంది.దయచేసి. మధుకర్ గారికి నా సమస్య గురించి చెప్పండి.నేను ఎంత చెప్పినా అతను అర్ధం చేసుకోవటం లేదు "అనీ కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది లయ.

"లయ ,నీ సమస్య నాకు అర్థమైంది. మధుకర్‌తో మాట్లాడుతాను" అనీ చెప్పి ఆమెను పంపించేసాను.

ఆ మర్నాడు నేను మధుకర్ తో లయ సమస్య గురించి చెప్పాను.వాడు నా మాటలు విని "సమస్యలు అందరికీ ఉంటాయి.కానీ వాటి నీడ ఉద్యోగంపై పడకుండా చూసుకోవడం ప్రతి ఉద్యోగి బాధ్యత" అనీ చెప్పాడు.

"మధూ,ఆమె వల్ల మనకు రెండు పెద్ద ప్రాజెక్టులు వచ్చాయి.ఇప్పుడు ఆమెకు కావలసింది శిక్ష కాదు.సహాయం"అనీ చెప్పాను.

"శర్మ,మనం ఆమెకు మినహాయింపు ఇస్తే మిగతా ఉద్యోగులకు కూడా ఇవ్వవలసి ఉంటుంది.అది కంపెనీ అభివృద్ధి మీద ప్రభావం చూపిస్తుంది"అనీ చెప్పాడు.

రెండు నెలల తరువాత ప్రాజెక్టుల ఆలస్యానికి ఆమెను బాధ్యత చేస్తూ లయను ఉద్యోగం లోంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి.ఆ సాయంత్రం లయ నాకు లిఫ్ట్ దగ్గర కనిపించింది.

నేను ఆమెతో "సారీ లయ,నీకు నేను సహాయం చెయ్యలేక పోయాను.నన్ను క్షమించు"అనీ చెప్పాను.

"సార్,జీవితంలో కొన్ని తలుపులు మరో తలుపు తెరుచుకోవడానికి మూసుకుపోతాయి.“Everything happens for a reason, good or bad, positive or negative.” ఏదొచ్చినా మన మంచికే అంటారు"అనీ చెప్పింది.

కాలం గడిచింది. లయ ఉద్యోగం వదిలి వెళ్లిన తరువాత కంపెనీ పనులు ఆగలేదు.లయ స్థానంలో మరో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వచ్చాడు. కొత్త ప్రాజెక్టులు వచ్చాయి. కొత్త క్లయింట్లు చేరారు. ఆదాయం పెరిగింది. అమెరికా నుంచి వచ్చిన ఒక పెద్ద ఒప్పందం వల్ల మా కంపెనీ పేరు దేశవ్యాప్తంగా మారుమోగింది. అన్నీ సరిగ్గానే జరిగాయి. కానీ ఆఫీసులో లయ ఖాళీ చేసిన కుర్చీ అలాగే ఉంది.

ఆరు నెలల తరువాత ఒక రాత్రి పదకొండు గంటలకు మధుకర్ నాకు ఫోన్ చేసి "ఇంటికి రమ్మనమని చెప్పాడు.నేను వెంటనే వాడి దగ్గరకు వెళ్ళాను.ఇంట్లో అతను ఒంటరిగా ఉన్నాడు.అతని భార్య ప్రియంవద,కొడుకు వంశీ కనిపించలేదు.కొద్దిసేపటి తరువాత మధు ఒక కాగితాన్ని నా చేతిలో పెట్టాడు. అది ప్రియంవద మధుకి పంపిన విడాకుల నోటీసు. నేను దాన్ని నిశ్శబ్దంగా చదివాను.

ఆరు నెలల తరువాత ప్రియంవద భర్త మధుకర్ తో విడాకులు తీసుకుంది.కోర్టులో వంశీ తాను అమ్మతోనే ఉంటానని చెప్పడంతో ప్రియంవద వంశీని తనతో పాటు తీసికెళ్ళిపోయింది. ఆ సంఘటన తరువాత మధుకర్ పూర్తిగా మారిపోయాడు. ఆఫీసులో ఉద్యోగస్తులను మందలించడం తగ్గిపోయింది.ఒకరోజు నేను వాడి గదిలోకి వెళ్లాను.అక్కడ వాడు తన తండ్రి ఇచ్చిన పాత గడియారాన్ని చేతిలో తిప్పుతూ కనిపించాడు.

నన్ను చూసి "శర్మ,ఈ గడియారం నన్ను ఎప్పుడూ ఆలస్యం చేయనివ్వలేదు. కానీ నాకు అత్యంత అవసరమైన మనుషులను మాత్రం దూరం చేసింది"అనీ చెప్పాడు.వాడి మాటల్లో మొదటిసారి నాకు పశ్చాత్తాపం వినిపించింది.

ఒక నెల తరువాత శ్రీ సరస్వతి విద్యానికేతన్ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అథిధులుగా హాజరు కమ్మని మా ఇద్దరికీ ఆహ్వానం వచ్చింది.మా కంపెనీ ఆ పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయడంతో కృతజ్ఞతా భావంతో ఆ పాఠశాల యాజమాన్యం ముఖ్య అతిథులుగా నన్ను, మధుకర్‌ను ఆహ్వానించారు.

ఆ సాయంత్రం పాఠశాల ప్రాంగణం పిల్లల నవ్వులతో కళకళలాడుతోంది. వేదిక మీద సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి . ఎంతో కాలం తర్వాత మధుకర్ ముఖంలో ప్రశాంతత కనిపించింది. కార్యక్రమాలు ముగిసాక ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మైక్ దగ్గరకు వచ్చి పదవ తరగతి పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను అందజెయ్యడం జరుగుతుందని చెప్పి

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

విజేతలను ప్రకటించడం మొదలుపెట్టారు.

"ఈ సంవత్సరం మా పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని ప్రియ"అనీ పిలవగానే తెల్లటి యూనిఫాం,ఆత్మవిశ్వాసంతో నిండిన కళ్లతో ఒక అమ్మాయి వేదికపైకి వచ్చింది.

ప్రిన్సిపాల్ ఆ అమ్మాయిని "నీ ఈ విజయానికి కారణం ఎవరు?"అనీ అడిగింది. ఆ అమ్మాయి ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ప్రేక్షకుల మధ్య కూర్చున్న ఒక మహిళ వైపు చేయి చూపిస్తూ "మా అమ్మ"అనీ చెప్పింది.

వెంటనే నేను,మధుకర్ ఆ మహిళను చూసాము.ఆమె లయ. మూడు సంవత్సరాల క్రితం లిఫ్ట్ దగ్గర ఓడిపోయిన వ్యక్తిలా కనిపించిన లయ ఇప్పుడు గెలిచిన తల్లిలా కనిపించింది. అప్పుడు ప్రిన్సిపాల్ " ప్రియ విజయానికి కారణమైన ఆమె తల్లి లయ గారిని వేదికపైకి ఆహ్వానిస్తున్నాను.లయ గారు మూడేళ్ళ క్రితం "ప్రియ సాఫ్ట్ వేర్ సర్వీసెస్" అనే సాఫ్ట్ వేర్ కంపెనీని స్థాపించి అనతి కాలంలోనే దాన్ని అత్యున్నమైన స్థాయికి తీసికెళ్ళి, దేశంలో ఉత్తమ యువ మహిళా పారిశ్రామిక వేత్త పురస్కారాన్ని ప్రధాన మంత్రి నుంచి అందుకున్న ఒక గొప్ప మహిళ. ఆమెను సాదరంగా స్టేజ్ మీదకు ఆహ్వానిస్తున్నాను"అనీ చెప్పగానే లయ నెమ్మదిగా లేచి ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య వేదిక మీదకు వచ్చింది.ఆమె వేదిక మీదకు వస్తుంటే ఆమె ప్రతి అడుగునూ మధుకర్ మౌనంగా చూసాడు.

వేదిక మీద నిలబడ్డ లయను చూడగానే కాలం ఒక్కసారిగా వెనక్కి తిరిగినట్టు అనిపించింది నాకు .ఒకప్పుడు మా కంపెనీ సమావేశ మందిరంలో నిలబడి తన ఉద్యోగాన్ని కాపాడుకోవాలని మౌనంగా ప్రయత్నించిన లయ ఈ రోజు వందలాది మంది ముందు తలెత్తుకుని గర్వంగా నిలబడింది.

అప్పుడు ప్రిన్సిపాల్ ఆమెను మాట్లాడవలసిందిగా మైక్ ని లయకు ఇచ్చారు.ఆ సమయంలో ఆమె దృష్టి ముందు వరుసలో కూర్చున్న మా మీద పడింది. నన్ను చూసి చిన్నగా నవ్వితే మధుకర్ వైపు చూసిన క్షణం మాత్రం ఆమె ముఖంలో ఎలాంటి భావం కనిపించలేదు.ఆ తరువాత లయ మాట్లాడటం మొదలుపెట్టింది.

"అందరికీ నమస్కారం. ఈ రోజు నా కూతురు సాధించిన విజయం గురించి మాట్లాడమన్నారు.నిజం చెప్పాలంటే ఈ విజయం నాది కాదు.ఇది ప్రతి రోజు ఓడిపోవడానికి నిరాకరించిన ఒక చిన్నారి విజయం"అనీ ఆమె చెబుతుంటే హాల్ అంతా చప్పట్లతో మారు మ్రోగిపోయింది.

"జీవితంలో నేను రెండు పరీక్షలు ఎదుర్కొన్నాను.ఒకటి భార్యగా మరొకటి తల్లిగా.మొదటి పరీక్షలో నేను విఫలమయ్యాను కానీ రెండవ పరీక్షలో నా ఫలితం నా పక్కనే నిలబడి ఉంది"అంటూ తన కూతురు ప్రియ భుజం మీద చెయ్యి వేయగానే ఆడిటోరియం అంతా మళ్ళీ కరతాళధ్వనులతో మార్మోగిపోయింది.

"ఈ రోజు నా జీవితంలో నన్ను బాధపెట్టిన వాళ్ల గురించి గాని, నాకు సహాయం చేసిన వాళ్ల గురించి గాని మాట్లాడను.ఎందుకంటే వాళ్లందరూ కలిసి నన్ను ఈ రోజు ఇలా ఇక్కడ నిలబడే లయగా తీర్చిదిద్దారు.కొంతమంది నన్ను ప్రేమించారు.మరి కొంతమంది నన్ను నమ్మారు.మరి కొంతమంది నన్ను అపార్థం చేసుకున్నారు.కానీ వాళ్ళెవ్వరూ నా శత్రువులు కారు.ఎందుకంటే ప్రతి మనిషి మన జీవితంలో ఒక పాఠం చెప్పడానికి వస్తాడు.

“The wound is the place where the Light enters you”.మన జీవితంలో సమస్యలు ఎదురవకపోతే మనలోని బలం బయటకు రాదు.కూతురిగా,భార్యగా,ఉద్యోగినిగా నేను ఓడిపోయిన సందర్భాలు చాలా ఉన్నాయి.కానీ ఒక తల్లిగా మాత్రం ఓడిపోవడానికి నా మనసు ఒప్పుకోలేదు.ఈ రోజు చాలామంది నన్ను అభినందిస్తున్నారు.కానీ ఈ పతకం,ఈ చప్పట్లు,ఈ గౌరవం,ఇవేవీ నా విజయాలు కావు.ఒక చిన్నారి తన తల్లి మీద పెట్టుకున్న నమ్మకానికి వచ్చిన ప్రతిఫలం.

ఈ రోజు నేను మీతో పంచుకోవాలనుకునే గొప్ప పాఠం ఒక్కటే.జీవితం వ్యాపారం కాదు.లాభ నష్టాల పట్టిక కాదు. ప్రతి ఆలస్యం నిర్లక్ష్యం కాదు.కొన్నిసార్లు ఆ ఆలస్యం వెనుక నిద్రలేని రాత్రులు ఉంటాయి.ఒక అనారోగ్యంతో ఉన్న తల్లి ఉంటుంది.ఒంటరితనంతో చేసే యుద్ధం ఉంటుంది.మనకు కనిపించేది తప్పు మాత్రమే.కానీ మనకు కనిపించనిది ఒక జీవితమంత బాధ.అందుకే శిక్షించే ముందు ఒక్కసారి అర్థం చేసుకోండి.మనకు ఎదురయ్యే ప్రతి మనిషి మనకు తెలియని ఒక యుద్ధం చేస్తూనే ఉంటాడు.జీవితంలో సమయపాలన,క్రమశిక్షణ,నిరంతర శ్రమ,వ్యాపారాలు,పదవులు,లాభాలు అన్నీ అవసరమే.కానీ ఇవన్నీ సంపాదించే ప్రయాణంలో మనిషి తనను తాను కోల్పోకూడదు.మన చుట్టూ ఉన్న మనుషులను మర మనుషుల్లా చూడకూడదు.మనం డబ్బు వెంటపడితే అది మనకు సుఖాలను ఇస్తుంది కానీ బంధాలను,అనుబంధాలను దూరం చేస్తుంది.

'People will forget what you said, people will forget what you did, but people will never forget how you made them feel .కాబట్టి మనిషన్నవాడు ఇతరుల మీద దయ చూపించాలి. దయ బలహీనత కాదు.దయ మనిషి గొప్ప బలం.ధన్యవాదాలు"అనీ చెప్పి హర్ష ధ్వానాల మధ్య కిందకు దిగిపోయింది.

ఆ తరువాత లయ అందరికీ వీడ్కోలు చెప్పి తన కూతురు ప్రియ చేయి పట్టుకుని కారు ఎక్కి వెళ్లిపోయింది. మధుకర్ లయ వెళ్లిపోతుంటే అక్కడే నిలబడి చూసాడు. ఆమె కారు

కనుమరుగయ్యే వరకు వాడు ఒక్క అడుగు కూడా వేయలేదు.

ఆ మరుసటి రోజు ఉదయం నేను ఎప్పటిలాగే తొమ్మిది గంటలకు ఆఫీసుకు చేరుకున్నాను. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశం ప్రారంభం కావడానికి ఇంకా ఐదు నిమిషాల సమయం ఉంది. నేను సమావేశ మందిరంలోకి అడుగుపెట్టే సరికి మధుకర్ అప్పటికే తన స్థానంలో కూర్చొని కనిపించాడు. సమావేశం ప్రారంభమవగానే మధుకర్ లేచి ఒక తెల్ల కవర్‌ను టేబుల్ మీద ఉంచి "గౌరవ సభ్యులకు నమస్కారం.నేను నా పదవికి రాజీనామా చేస్తున్నాను.దయచేసి కారణాలు అడగవద్దు.ఇన్నాళ్లు నాకు సహకరించిన మీ అందరికీ ధన్యవాదాలు" అనీ చెప్పి తన గదిలోకి వెళ్ళిపోయాడు.ఒక్క క్షణం సమావేశ మందిరం మొత్తం నిశ్శబ్దంగా మారిపోయింది. సమావేశం ముగిసిన తర్వాత నేను వాడి గదిలోకి వెళ్లాను.వాడు కిటికీ దగ్గర నిలబడి సముద్రాన్ని చూస్తున్నాడు.

"ఒక నాయకుడు తన విజయాలను మాత్రమే కాదు తన వైఫల్యాలను కూడా అంగీకరించాలి.కంపెనీని నడిపించడంలో నేను విజయం సాధించినా మనుషులను అర్థం చేసుకోవడంలో మాత్రం నేను ఓడిపోయాను.నువ్వు ఆ రోజు లయ గురించి చెప్పినప్పుడు నేను ఆమెలో ఒక ఉద్యోగిని మాత్రమే చూసాను కానీ ఒక మనిషిగా చూడలేదు.లాభ నష్టాలను మాత్రమే చూసాను కానీ రాగ ద్వేషాలను చూడలేదు.అది నా ఓటమి" అనీ చెప్పి కిందకు దిగి కారెక్కి వెళ్ళిపోయాడు.వాడి కారు కనుమరుగయ్యేవరకు నేను అక్కడే నిలబడి చూస్తూ నిలబడ్డాను.ఆ కారు మలుపు తిరిగి కనిపించకుండా పోయింది. అదే నేను మధుకర్‌ను చివరిసారి చూసిన క్షణం.

వారాలు,నెలలు,సంవత్సరాలు గడిచాయి.కానీ వాడు రాలేదు.వాడి ఆచూకీ తెలియలేదు. అప్పటి నుంచి నేను వాడి కోసం చకోర పక్షిలా ఎదురు చూస్తూనే ఉన్నాను.మధుకర్ నా జీవితంలో ప్రభాత సంధ్యలా వచ్చి సాయం సంధ్యలా అదృశ్యమయ్యాడు. సముద్రాన్ని చూస్తే నాకు మధుకర్ గుర్తుకొస్తాడు.సముద్రం లాగే వాడు కూడా ఎవరికీ అర్థం కాని ఒక ప్రవల్లిక లాంటి వాడు. నాకు మనసు భారంగా అనిపించినప్పుడల్లా సముద్రం దగ్గరకు వెళుతుంటాను.సముద్రం ముందు నిలబడితే, మనిషి గర్వమంతా ఒక ఇసుక రేణువులా అనిపిస్తుంది. అలలు గర్జిస్తుంటాయి. ఆకాశం నీలంగా ఉంటుంది.కానీ నా కళ్లకు మాత్రం మధుకర్ కనిపిస్తుంటాడు.ఇప్పటికీ నేను వాడి కోసం నిరీక్షిస్తూనే ఉన్నాను.


ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ఈవారం కథ



• డాక్టర్ పార్థసారథి చిరువోలు

# పుణ్యఫలం





"రేపు ఉదయమే కార్యక్రమం. ఇంకా గోవు సిద్ధం కాకపోతే ఎలా?"

"మీరేం ఆందోళన చెందకండి. అనుకున్నట్టుగానే కార్యక్రమం పూర్తవుతుంది".

"పదిరోజుల నుంచి మీ వెంట పడుతున్నాను. ఇప్పటి వరకూ ఏదీ ముడిపడలేదు. అందుకే భయంగా ఉంది."

"మీకిది మొదటిసారేమో! మేము ఎన్ని కార్యక్రమాలు చేయలేదు. ఉదయం చెప్పి ఆవు పంపమని అడిగినా క్షణాల్లో సిద్ధం చేసేస్తాం".

"ఏదో మిమ్మల్నే నమ్ముకున్నాను... ".

"మనకు ఎప్పుడూ సప్లై చేసేవాడి దగ్గర ఆవు చనిపోయింది. మనుషుల్లాగానే ఇప్పుడు ఆవులకు కూడా ఇన్సూరెన్సు ఉంటోంది. ఆ గొడవల్లో మునిగి ఉన్నాడతను.".

"అతను కాకపోతే, ఇంకెవరయినా...".

"మొన్న రెండు ఆవుల ఫొటోలు పంపాను కదండీ.."

"ఆ... తెల్లటిచర్మం పైన నల్లటి మచ్చలున్న ఆవు... చూడగానే అదోలా ఉంది. అందుకే..."

"ఫరవాలేదు. మీకు నచ్చిన ఆవునే అనుకున్న బడ్జెట్లో వచ్చేలా చూసే పూచీ నాది. మీరేం ఫికర్ కాకండి".

"తెల్ల ఆవు అయితే బావుంటుందని చెప్పాను తప్ప రంగు పట్టింపు అంత లేదు. మంచి ఆరోగ్యంగా ఉన్న ఆవుని చూసి పంపండి."

"సరేనండి..."

"మధ్నాహ్నం 12.30 కల్లా మీకు ఫొటోలు వచ్చేస్తాయి. మీకు నచ్చిన ఆవును ఎంపిక చేసుకోండి. మరణించిన మీ బంధువుల ఆత్మశాంతి కోసం ఈ పనికి పూనుకుంటున్నారు. మిమ్మల్ని అభినందించాలి".

"అంతా సజావుగా జరిగితే ఫరవాలేదు, లేకపోతే నలుగురి ముందూ నవ్వుల పాలవుతాను."

"ఆ విషయం నాకు వదిలెయ్యండి. మీరు చెప్పిన టైమ్ కంటే ఓ అర్ధగంట ముందే సత్రం దగ్గర ఆవు ఉంటుంది. నా మాట నమ్మండి".

• • •

"అయ్యో, సమయం 5.30 దాటుతోంది. ఆవు సంగతి తేలలేదు. అనుకున్న పని సజావుగా పూర్తవుతుందా లేదా అని భయంగా ఉంది?"

"నాకొదిలెయ్యమన్నా కదా... జహీరాబాద్ వాడు ఫోన్ ఎత్తటం లేదు. చాలాసార్లు ట్రై చేశా. ఇప్పుడు చింతలకుంట మార్కెట్ అతను మాట్లాడాడు. ఇప్పుడే ఫొటోలు వచ్చాయి. పంపుతున్నాను."

"మరి ధర విషయం?"

"కాస్త ఎక్కువ చెబుతున్నాడు."

"మీరే మాట్లాడి నా బడ్జెట్ ప్రకారం తెగ్గొట్టండి."

"నా వంతు ప్రయత్నం చేస్తాను."

"మధ్యాహ్నం అనగా మాట్లాడాను. ఇప్పుడు రాత్రి 7.30 దాటింది. కొన్ని గంటల్లో కార్యక్రమం పెట్టుకుని ఆవు సిద్ధం కాకపోతే ఎలా?"

"తను ఆవు ధర చెప్పాడు. తగ్గటం కుదరదని బిగుసుకుపోయాడు. ఏం చేయాలో తోచక.."

"ఇంతకీ ఎంత చెబుతున్నాడేమిటి?"

"మీకు మెసేజ్ పెట్టాను. వాట్సాప్ ఓపెన్ చేసి చూడండి."

"అమ్మో.. ఇంతా? బడ్జెట్ పదివేలు దాటుతుంది".

"అందుకే నేనే తగ్గించమని బతిమాలుతున్నా".

"ఎలాగోలా అయ్యేటట్టు చూడండి".

"చూద్దాం. మనకు బానే పరిచయం ఉన్నవాడు. తగ్గుతాడనే అనుకుంటున్నాను".

"ప్లీజ్. ఏదో రకంగా సెటిల్ చేయండి."

• • •

"రెండు గంటల నుంచి మీ కోసం ఎదురుచూస్తున్నాను. ఈ టెన్షన్ భరించటం నా వల్ల కావటం లేదు. ఎంతో కొంతకి సెట్ చేయండి. ఇప్పుడు రాత్రి 9 అవుతోంది"

"చాలాసార్లు మాట్లాడి చూశాను. ధర తగ్గించటం కుదరదంటున్నాడు. మీరే ఆలోచించి ఏదో ఒకటి ఫైనల్ చేసుకోండి."

"ఇప్పుడు నేను మాత్రం చేయగలిగింది ఏముంది?"

"అలా కాదు. మీ ఇద్దరికీ కాన్ఫరెన్సు కాల్ ఏర్పాటు చేస్తాను. మీరు కూడా మాట్లాడి ఓ నిర్ణయానికి వస్తే బావుంటుంది."

"ఆ అవసరం ఎంత మాత్రం లేదు. మీపైన బాధ్యత పెట్టాను. అతను తగ్గనంటే నేను మాత్రం ఏం చేస్తాను. ఆ రేటుకే కానిచ్చేయండి."

"సరే. వాట్సాప్‌లో లొకేషన్ పంపితే వచ్చి మీ ఇంటికొచ్చి డబ్బులు తీసికెళతాడు. పురోహితుడు కూడా కావాలన్నట్టున్నారు. మాకు తెలిసిన ఓ పెద్దాయన్ని పంపుతాను."

"ఆయనకు సంభావన, ఇతర ఖర్చులు.."

"గోదానానికి రెండువేల నుంచి మూడువేల వరకూ తీసుకుంటారు. దానితో పాటు పెట్రోలు ఖర్చులు నాలుగైదు వందలు ఉంటుందేమో? అంత వరకూ ముట్టచెప్పండి చాలు..."

"అలాగే. సత్రం చిరునామా పంపుతాను. ఉదయం 8, 8.30 కల్లా వచ్చెయ్యమని చెప్పండి.

"అలాగే.."

• • •

"అదేంటి? ఉదయం ఆరుగంటలకే బయలుదేరతానన్నావు కదా?"

"మీరు చెప్పిన ధరకయితే రాలేను."

"అదేంటి? బేరం మాట్లాడుకున్న తర్వాత ఇలా చేస్తారా ఎవరైనా?"

"ఓసారి మీరన్నది గుర్తు చేసుకోండి. ఆవుకు డబ్బులిచ్చాను. మళ్లీ ట్రాన్సుపోర్టుకు అదనమని నాకు తెలీదు అని మీరు వాదించారు.."

"అవును, గుర్తుంది. ఆవు అమ్మిన అతన్ని దగ్గర నంబరు తీసుకుని నీతో మాట్లాడాను.

ఇప్పటికే ఖర్చు తడిసిమోపెడయ్యింది. నేను ఇంతే ఇస్తాను. మిగతా ఎమౌంట్ అతని దగ్గర తీసుకోమన్నాను.''

''ఆ..''

''అంటే నువ్వు ఒప్పుకున్నట్టే కదా, ఇప్పుడు పంచాయితీ చేస్తున్నావేంటి?''

''బాడుగ గిట్టదు..''

''సరే, ఏం చేస్తాం? నువ్వడిగినదంతా ఇస్తాను, ఆవు, దూడలతో వచ్చెయ్యి''

''డబ్బులు ఫోన్ పే చేస్తే.. బయలుదేరతా.''

●●●

''అయ్యా, కార్యక్రమం ప్రారంభిద్దాం. ఆవుని, దూడని పసుపు, కుంకుమలతో చక్కగా అలంకరించండి.''

రామశర్మ కారు దిగి అక్కడ అడుగుపెట్టగానే వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది.


నుదుటిన పెద్ద బొట్టు, మెడలో రుద్రాక్ష మాల, చేతికి బంగారు కడియాలు, వేళ్లకు తళతళా మెరుస్తున్న ఉంగరాలు, ఖరీదైన సిల్కులాల్చీ... బాగా ఖరీదయిన మనిషిలాగా కనిపించాడు.

నిన్న ఉదయం నుంచి పడిన శ్రమ సార్థకమయ్యే సమయం వచ్చింది. క్రతువు ఘనంగా చేయాలనే సంకల్పంతో ఉన్నా. అందుకే మనసులో ఆందోళనగా ఉన్నా, మిగతా అన్ని ఆలోచనలను పక్కకు నెట్టి చేస్తున్న పనిమీద మనసు నిలిపాను. చుట్టూ ఉన్న వాళ్లని హుషారు చేశాను. ఆవు అలంకరణ పూర్తి కావటానికి ఎంతో సమయం పట్టలేదు. పసుపు, కుంకుమ అలంకరించిన తర్వాత కొత్తగా కొన్న చీర, బ్లౌజ్ పైన పరిచాం. రామశర్మ పెదవులు కదులుతున్నాయి. బయటకు వినిపించటం లేదు గానీ ఆయన ఏవో మంత్రాలు చదువుతున్నాడని అర్థమైంది. ఓ పదినిముషాల తర్వాత ''మీ కుటుంబ సభ్యులంతా దంపతులుగా వచ్చి ముమ్మారు ప్రదక్షిణ చేయండి'' గట్టిగా చెప్పారు.

ఆయన ఆదేశాలు తు.చ. తప్పకుండా అమలు చేశాం. అపరకర్మల కోసం అక్కడకు వచ్చిన వాళ్లు, సత్రం గదుల్లో ఉన్న వాళ్లు బిలబిలమంటూ బయటకు వచ్చి ఈ తంతు చూడటం ప్రారంభించారు. యూట్యూబ్ వచ్చిపడ్డ తర్వాత జనాల్లో చాలా మార్పు వచ్చింది. దానిని భక్తి అనాలో, మరొకటనలో.. అంతమందిని చూడగానే రామశర్మలో ఎక్కడలేని హుషారు వచ్చింది.

''మీకు గోదానం ప్రాశస్త్యాన్ని వివరిస్తాను'' ఆయన కంఠం ఖంగుమంది.

''గోవులను దానం చేయటం వల్ల దారిద్ర్యం తొలగి సంపదలు కలుగుతాయి. అనారోగ్య, అపమృత్యు భయాలు తొలగిపోతాయి. గృహదోషాలు మాయమవుతాయి. జన్మజన్మల పాపాలు హరించుకుపోతాయి. మరణానంతరం 'వైతరణి' దాటే క్రమం సులభమవుతుంది. కొన్ని వేల సంవత్సరాల పాటు పితృదేవతలు ఉత్తమగతులు పొందుతారని శాస్త్రాలు చెబుతున్నాయి.''




రామశర్మ చెప్పేది అందరూ సావధానంగా వింటున్నారు. టీవీ కార్యక్రమాల్లో ప్రయోక్త మాదిరిగా హావభావాలను ప్రదర్శిస్తూ ఆయన సంభాషణను రక్తికట్టిస్తున్నాడు.

''గోవు సకల దేవతా స్వరూపం. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి తర్వాత, కన్నతల్లి తర్వాత, ఒక్క ఆవును మాత్రమే గోమాత అని పిలుస్తారు...'' అని వివరించిన తర్వాత.. కాస్త విరామం ఇచ్చి.. ''గోమాత నమోనమో నమోనమో నమః'' అన్నాడు రామశర్మ.

''ఈ నామాన్ని మీరంతా మూడుసార్లు అనండి'' అని అందరి చేత అనిపించాడు.

అందరి మొహాలు ఒక్కసారిగా వెలిగిపోయాయి. ఈ క్షణంలో ఇక్కడ లేకపోయుంటే ఎంత పుణ్యాన్ని కోల్పోయేవాళ్లమో అనుకున్నారు.

''మీలో చాలా మందికి గోదానం చేయాలని ఉంటుంది. అదెలాగో తెలియదు. అలాగే కొందరికి ఆసక్తి ఉంటుంది కాని, ఆర్థికంగా స్తోమత ఉండదు. అలాంటి వాళ్లందరి కోసం నా దగ్గర చిట్కా ఉంది. మీరు నెలనెలా వెయ్యి రూపాయలు ఖర్చుపెడితే చాలు, మీ పేరుతో ఆవుకి మేత వేస్తాం. ఆవుల సంతతి పెరుగుతుంది. మీకు పుణ్యం వస్తుంది. వెయ్యి అనే కాదు. ఇవ్వగలిగిన వాళ్లు అంతకంటే ఎక్కువ ఇచ్చినా ఇబ్బంది లేదు.''

''మీకు ఆవులు ఉన్నాయా పంతులు గారూ?'' ఎవరో ఒకావిడ అడిగింది.

''ఎంతమాట అన్నావమ్మా! పెద్ద గోశాలనే నడుపుతున్నా. అక్కడ చాలా ఆవులు ఉంటాయి. దానాలు అవసరం అయిన వాళ్లు ఫోన్ చేయవచ్చు. కావాలనుకుంటే వచ్చి చూడొచ్చు''.

లాల్చీ జేబులో నుంచి విజిటింగ్ కార్డుల కట్ట బయటకు తీశాడు. చుట్టూ ఉన్న జనం ఒక్కసారిగా మీద పడ్డారు.

''వెయ్యి కష్టం అనుకున్న వాళ్లు కనీసం ఐదు వందలయినా ఇవ్వండి. పుణ్యం మూటకట్టుకోండి.'' అప్పటికప్పుడు రాయితీ కూడా ప్రకటించారు.

రామశర్మ మాటలతో మైకం కమ్మిందో, అప్పటికే పుణ్యం అన్న మాట చాలాసార్లు విని ఉండటం వల్లనో తెలియదు అందరికీ పూనకం వచ్చిందో తెలియదు గాని, వెనకా ముందు చూసుకోలేదు. జేబుల్లో నుంచి నోట్లు తీసి రామశర్మ చేతుల్లో కుక్కారు. మరికొందరు డిజిటల్ పేమెంట్ మోడ్‌లోకి వెళ్లారు. రామశర్మ ఓ వైపు నోట్లు సరిచూసుకుంటూ దాతలకు అక్షతలు వేసి ఘనంగా దీవించారు. అందరూ తలో వైపు వెళ్లిపోయారు. ఇది ప్రైవేటు కార్యక్రమం. మా కుటుంబానికి పరిమితమైన వ్యవహారం. దానిని పక్కన పెట్టి ఆయన తన సొంత బిజినెస్‌లో నిమగ్నం కావటం నాకు ఇబ్బంది అనిపించింది. అయినా నోరు మెదపలేకపోయాను. మా కుటుంబంలో మిగతావాళ్లదీ దాదాపుగా అదే పరిస్థితి. అంతలోనే ఆయన నా వైపు చూస్తూ 'కార్యక్రమం ముగిసింది' అన్నట్టుగా కళ్లతోనే చెప్పాడు. నేను పర్సులో నుంచి డబ్బులు తీసి ఆయన చేతిలో పెట్టాను.

వాటిని లెక్క పెట్టుకుని ''ఇదేంటి?'' అన్నాడు సీరియస్‌గా.

''నేను ఒప్పుకున్నది అంతకేగా.. ఆవు పంపిన వ్యక్తి.. పేరు చెప్పాను. ఆయన చెప్పిన మొత్తం ఇదేగా?'' అన్నాను అదే స్థాయిలో తీవ్రంగా స్పందిస్తూ.

''ఈ చిల్లర తీసుకోవటానికి నేనేం ఆషామాషీ వ్యక్తిని కాదండీ.''

ఎంత ఇవ్వాలో అంకె చెప్పాడు. అది వినేసరికి నా కళ్లు బైర్లు కమ్మాయి.

''జంటనగరాల్లో నేను ఫేమస్. సినిమావాళ్లు, పొలిటీషియన్స్, బిజినెస్ బిగ్ షాట్స్ అందరూ నా క్లయింట్స్. వాళ్లందరికీ నా మాట మీద గురి. నేను చెప్పినట్టల్లా నడుచుకుంటారు. నా నాలిక మీద సరస్వతి నాట్యం చేస్తుంది. నేను ఒక మాట అన్నానంటే అంతే...''

ప్రవాహంలా ఆయన మాటలు సాగుతున్నాయి. ఆ సొద వినటం నాకు ఇబ్బందిగా ఉంది.

''నేను సోషల్ మీడియా చూడను. నాకు ఇవేమీ తెలియవు'' అన్నాను చికాకు బయటకు కనపడకుండా.

''నా యూట్యూబ్ చానల్‌కి లక్షల్లో సబ్ స్క్రైబర్లు ఉన్నారు.'' అన్నాడు దర్పాన్ని ప్రదర్శిస్తూ.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

అప్పటి వరకు నేను పెద్దగా పట్టించుకోలేదు. ఓ పన్నెండేళ్ల కుర్రాడు మొబైల్‌లో వీడియో తీయటాన్ని ఇంతకు ముందు గమనించాను. ఇప్పుడు ఆయన చెబుతుంటే అర్థం అవుతోంది. ఒకేసారి స్వామికార్యం, స్వకార్యం పూర్తి చేస్తున్నాడన్నమాట. డబ్బు పుచ్చుకుని కార్యక్రమాలు చేయటానికి వస్తాడు. వాటిని షూట్ చేసి యూట్యూబ్‌లో పెట్టి తిరిగి డబ్బు సంపాదిస్తాడు.

ఆయన నా ఆలోచనలు తుంచేస్తూ. ‘‘సర్సరే. అవతల నాకు వేరే కార్యక్రమం ఉంది. డబ్బులిస్తే బయలుదేరతాను’’ అన్నాడు దబాయించినట్టుగా. ఆయన అడిగిన మొత్తం చేతిలో పెట్టి నమస్కారం చేశాను. ఆ డబ్బుల్ని లాల్చీలోకి నెట్టుకుని క్షణాల్లోనే మాయమయ్యాడు. నేను ఊపిరి పీల్చుకున్నాను. అప్పటికే నాకు ఓర్పు సడలింది. పని ముగించుకుని ఎప్పుడెప్పుడు అక్కడి నుంచి పారిపోదామా అనిపిస్తోంది. కాని అదంత సజావుగా ముగిసేటట్టు లేదు.

●●●

‘‘ఉదయం 8గంటలకు రమ్మని పిలిచారు. నాలుగు గంటలు వెయిట్ చేయించారు. ఇంకో వెయ్యి అదనంగా ఇవ్వండి’’ ఆవును వెంట తెచ్చిన వ్యాన్ డ్రైవర్ డిమాండ్ చేశాడు.

‘‘ఓ ఐదొందలు.. కాదంటే అదనంగా ఇంకో వంద.. తప్ప అంత కంటే ఎక్కువ ఇవ్వలేను. అంతా లెక్క వేసుకుని డబ్బులు తెచ్చాను. దయచేసి నన్ను ఇబ్బంది పెట్టకు’’ బతిమాలుతున్నట్టుగా అడిగాను.

‘‘మీరిచ్చే దానిలో రెండు వందలు చీటీకే పోతుంది’’ నిర్లక్ష్యంగా చెప్పాడతను.

‘చీటీ అంటే..?’’

‘‘సంతలో ఆవును కొన్నప్పుడు దానికి రిసీప్ట ఇస్తారు. మీ పేరుతో తీసుకున్నాను. కావాలంటే చూడండి’’ చీటీ తీసి నా చేతిలో ఉంచాడు.

‘‘పరిస్థితి చాలా అన్యాయంలా ఉందే. ఆవు కొన్నందుకు డబ్బు చెల్లించటం కాకుండా మళ్లీ అదనంగా ఇంకో ఖర్చా? నా దగ్గర ఉన్నవి ఇవే. వీటితో సర్దుకో. విసిగించొద్దు’’.

‘‘మిగిలిన డబ్బులు గూగుల్ పే చేయండి’’.

‘‘బాబూ, నీకో దండం. ఈ పని తలకెత్తుకుని నేను పడ్డ నరకయాతన చాలు. ఇచ్చింది పుచ్చుకుని వెళ్లు’’.

‘‘ఛీ... వెధవ బేరం’’

అతని నోటి నుంచి వచ్చిన బూతులు విన్న తర్వాత డబ్బులు ఇచ్చినా బావుండేదని అనిపించింది.

●●●

ఈ తంతులో ఆఖరి ఘట్టంలోకి ప్రవేశించాం. ఓ వైపు భోజనాలకు ఏర్పాట్లు సాగుతున్నాయి. కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు, అల్లుళ్లు, మనవలు, మనవరాళ్లు, మునిమనవలు, మునిమనవరాళ్లు... అటూ ఇటూ ఐదు తరాల వాళ్లు ఒకచోట చేరారు. అనుబంధాలను నెమరువేసుకుంటున్నారు.

‘‘ఆవిడ పరిపూర్ణ జీవితాన్ని గడిపింది. ఇన్ని తరాల వాళ్లను చూసుకుంది అదృష్టవంతురాలు...’’

‘‘పెట్టుపోతలంటే ఆవిడ తర్వాతనే ఇంకెవరయినా. ఇంటికొస్తే ఎంగిలిపడకుండా తిరిగి వెళ్లనిచ్చేది కాదు..’’

‘‘ఎవరు ఎన్ని మాటలన్నా మౌనంగా ఊరుకునేది. పరుషంగా ఒక్కరిని నిందించటం చూళ్లేదు..’’

‘‘ఇంత పెద్ద సంసారాన్ని ఒంటి చేతిమీద నెట్టుకొచ్చింది.’’

నాకు తెలిసి నిన్న మొన్నటి వరకూ వీళ్లంతా ‘ఈ ముసలమ్మ నస భరించలేకపోతున్నాం’ అని విసుక్కున్న వాళ్లే. మరి ఇప్పుడేంటి వింతగా ప్రవర్తిస్తున్నారు? వ్యక్తుల మరణంతో అన్నీ తుడిచిపెట్టుకుపోయాయా? ఈ సంభాషణ ఒక వైపు సాగుతూండగానే మాకు కొద్ది దూరంలో.. తోడికోడళ్లు నలుగురు పోగయి మాట్లాడుకుంటున్నారు. అక్షరం పొల్లుపోకుండా అవన్నీ నా చెవిలో పడుతున్నాయి.

‘‘ఇదంతా పెద్ద షో అక్కా? నెలనెలా జీతం రాళ్లతో బతికేవాళ్లు... వేలకు వేలు పోసి ఆవు కొనగల సత్తా ఉందా? ఎక్కడో ఆవును, దూడను తెచ్చి తంతు ముగించేసి ఉంటారు. దానికి పెద్దగా ఖర్చు కూడా కాదట!’’

‘‘ఈ ముసల్ది కూతురికి పెద్ద మూట ఇచ్చి ఉంటుంది. అందుకే ఘనంగా గోదానం చేస్తున్నారు. ’’

‘‘అమ్మ బతికున్నప్పుడు ఉన్న ఊళ్లోనే అయినా ఒక్కసారి కూడా చూడటానికి రాలేదు గానీ, టింగురంగా అంటూ ఇప్పుడొచ్చి ప్రేమ ఉన్నట్టు వేషాలేస్తోంది చూడు. ఆ అల్లుడుగాడు ఏదో గొప్ప పని చేసినట్టు ఫోజు కొడుతున్నాడు. పాపం ఊరికే పోతుందా? వీళ్లను కట్టి కుడపదూ?’’

‘‘అత్తగారి వైపు నుంచి బాగా ఆస్తి వచ్చి ఉంటుంది? కొడుకు అమెరికాలో ఉన్నాడుగా.. నెలనెలా డాలర్లు పంపుతూ ఉండుంటాడు. డబ్బులు ఏం చేసుకోవాలో తెలియక, నలుగురి ముందు గొప్ప చాటుకోవాలని..’’

‘‘ఇవన్నీ కాదు అక్కా... ముసలమ్మ వాటా కొట్టెయ్యటానికి ప్లాన్ చేశారేమో?’’

‘‘మేం చేతగాని వాళ్లమా? అదెలా జరగుతుందో చూస్తాం...’’

మా దంపతుల్ని లక్ష్యంగా చేసుకుని మాటల దాడి కొనసాగుతోంది. ఇతరుల ప్రశంసల కోసమో, గొప్ప కోసమో ఈ పని చేయలేదు. అసలు గోదానం కొడుకులు చేయవలసిన పని అన్న స్పృహ కూడా నాకు లేదు. నా సమక్షంలో గోదానం గురించి చర్చ సాగుతున్నప్పుడు ‘నేను చూసుకుంటాను’ అని చెప్పి ఇందులోకి దిగాను. అంతకు తప్ప... పక్కనే ఉన్న నా భార్య ఈ మాటలు విన్నట్టుంది. గట్టిగా శోకాలు అందుకుంది. ఆమెను అక్కడ నుంచి పక్కకు తీసికెళ్లి ఓదార్చాక గాని తను మామూలు కాలేకపోయింది. భోజనాలు ముగిశాయి. ఆ తర్వాత ఆశీర్వచన కార్యక్రమం పూర్తయ్యింది.

‘‘ఎవరికీ వెళ్లొస్తామని చెప్పకూడదు. పొద్దుగూకక ముందే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలి’’

అక్కడున్న వాళ్లెవరో చెప్పారు. ఒక్కొక్కళ్లు లేవటం మొదలుపెట్టారు.

ఏ కర్మఫలం నన్ను ఇందుకు పురిగొల్పిందో? నా పుర్రెకు పుట్టిన బుద్ధి... నా భార్యతో సహా మిగిలిన వాళ్లందరినీ ఆశ్చర్యపరచి ఉండొచ్చు. నాకు మా అత్తగారి వైపు వాళ్లతో అంత సాన్నిహిత్యం లేదు. పండగలు, పెట్టుపోతలు లాంటి వాటికి దూరంగా ఉన్న వాడిని. ఇప్పుడిలా.. ఓ మంచి పని చేయటంలో ఉండే తృప్తిని మిగుల్చుకోవాలన్న తాపత్రయం తప్ప దీని వెనక నాకు ఎలాంటి స్వార్థం లేదు. ఈ మాటలు బయట పెట్టి నేను చేసిన పని విలువను దిగజార్చుకోదలచుకోలేదు.

‘‘మరణించిన పెద్దావిడకు భగవంతుడు సద్గతులు ప్రసాదించాలి’’ అనుకున్నాను.

రామశర్మ చెప్పినట్టు.. ‘‘ఆమె హాయిగా వైతరణి దాటాలి. దానం చేసిన ఈ గోవు ఆమెకు దీపధారిగా నిలవాలి’’ అని వేడుకున్నాను.

ఓ సత్కార్యం చేయటానికి అవకాశం ఇచ్చిన ఆ భగవంతుని మనసారా ధన్యవాదాలు చెప్పుకుని నిశ్శబ్దంగా అక్కడ నుంచి బయటపడ్డాం.

సూర్యుడు పడమటి కొండల్లోకి దిగుతున్నాడు.

## కథాకళి FEED ME A STORY

**2.8.2026 ఫన్‌డేలో ప్రచురించిన 'గుడ్డు' కథకి పాఠకులు సూచించిన టాప్ 5 పేర్లు.**

శై శవం!
ఏ. రవిచంద్రశేఖర రెడ్డి, విజయవాడ

నారు నువ్వే– నీరు నువ్వే
టి.సూర్యకుమారి, హైదరాబాద్

నా (నీ)కథ
మిన్నంరెడ్డి రమేష్ రెడ్డి, పీలేరు

ఆత్మ యానం
కుందూరు రుహిక యజ్ఞిత రెడ్డి, కోదాడ

అంతా నేనే
ఆర్. సదాశివన్, హైదరాబాద్

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

SUNDAY
విశాలాంధ్ర
ఆదివారం అనుబంధం
4 16 ఆదివారం, ఆగస్టు 2026



కాసేపు అందరినీ ప్రోత్సహించి విమర్శించిన తరువాత డ్రాయింగ్ రూమ్లో టీవీ చూస్తోన్న భార్య పిలుపు విన్నాడు.
ఆ ఎపుడూ పిలిచే పిలుపే కదా అని లైట్ తీసుకున్నాడు.
ఆ తరువాత తన వాట్సపుకు భార్య ఫోన్ నుంచి ఒక మెసేజి వచ్చింది.
'అరేయ్ కవిగా పెద్దల వెనకాల తిరిగితేనో, వాట్సప్ గ్రూపు పెట్టి అందరినీ ఏకితేనో నువు కవివి కావు, నీకు చీమ తలకాయంత పేరు కూడా రాదు, చదువు, పనిచేయి, జీవితాన్ని మనుషుల్ని ప్రేమించి చావు' అని వుందా మెసేజిలో.
వెంటనే తను అడ్మిన్‌గా వున్న పదిహేను గ్రూపుల్లోను ఈ మెసేజి కింద తన పేరు వేసుకుని ఫార్వర్డ్ చేసి 'హమ్మయ్యా ఎంతమంది మెచ్చుకుంటారో చూద్దాం' అని కళ్లు మూసుకున్నాడు.

కథ

# అబద్ధం



హరి వెంకట రమణ,
9866084124

అబద్ధం పొద్దున లేచేటప్పటికి గుడ్ మార్నింగ్ అని ముప్పై వాట్సప్ గ్రూపులలో మెసేజులు ఉన్నాయి, ఒక గ్రూపు గుడ్ మార్నింగ్, శుభోదయం మరో గ్రూపుకి తెలీకుండా పోస్టు చేసి హుందాగా ఛాతీ విరుచుకుని హాల్లో కొచ్చాడు.

భార్య టీ ఇచ్చేటపుడు, పిల్లలు స్కూలుకి వెళ్లేటప్పుడు వాట్సప్ చూస్తూనే వాళ్లకు టాటా, ఈవిడకు థాంక్స్ చెప్పేశాడు.

పెద్దగా పనేమీ లేని సంస్థలో పని కాబట్టి ఆఫీసుకి వెళ్లాక ఫ్యాన్ వేసుకుని 'చైనాలో ఉత్పత్తి పెంచడానికి జనం ఏం చేశారో చూడండి' అనే వీడియో అన్ని గ్రూపుల్లో పెట్టాడు. మన ఇండియా అభివృద్ధి చెందాలంటే మనం కూడా ఇలా కష్టపడి పనిచేయాలి మీ అబద్ధం వాట్సప్ గ్రూప్ అడ్మిన్ అని పోస్ట్ చేసి పడేశాడు.

తరువాత టీ తెప్పించుకుని తాగి తాను అడ్మిన్‌గా వున్న పదిహేను గ్రూపుల్లో ఎవరైనా గ్రూపు నిబంధనలకు విరుద్ధంగా పోస్టు చేశారా అంతా బాగానే ఉందా అని తెగ పరిశీలించాడు. గ్రూపులన్నీ తన అధీనంలో ఉన్నందుకు కొంచెం సంతోషించాడు. మధ్యాహ్నం భోజన సమయానికి శుభ్రంగా భోజనం చేసి 'జపాన్లో జనం భోజనం చేశాక పావుగంట ఎందుకు పడుకుంటారు?' 'వీడియో అన్ని వాట్సప్ గ్రూపులో పోస్టు చేసి తాను కూడా ఒక గంట తరువాత నిద్రలేచాడు.

మొఖం కడుక్కుని ఒకసారి ఆఫీసుపనిలో పడదాం అని పని మొదలు పెట్టాడు. 'డింగ్ డిడాంగ్' అని వాట్సప్ గ్రూపులో మెసేజులు, అంతే చేస్తున్న పనిని వదిలేసిన అబద్ధం ఆ గ్రూపుల పనిపట్టాడు. వికృతి ప్రేమికుల గ్రూపులో ఎవడో కోన్ కిస్కా మెంబరు ప్రకృతి గొప్పదనం గురించి మెసేజి పెట్టాడు.

'మన గ్రూపేంటి నువు పెట్టిన మెసేజి ఏంటిరా కోన్ కిస్కా?' అని ఒక పనీపాటాలేని మెంబరొకడు ఆ పెట్టినాడిని ఉతికి పారేశాడు. మిగతా సభ్యులంతా తలో వాట్సప్ దెబ్బ వేశారు.

ప్రకృతి గొప్పదనం గురించి మెసేజి పెట్టినాయన 'క్షమించండి అది నా వ్యక్తిగత అభిప్రాయం' అని మెసీజించాడు.

'వ్యక్తిగత అభిప్రాయాలు చెప్పడానికి నువ్వెవిడివి? నువ్వెంత నీ గ్నానం ఎంత?' అని ఇంకో సభ్యుడు అందుకున్నాడు..

వికృతి ప్రేమికుల గ్రూపు ప్రకృతి ప్రేమికుడిపై కన్నెర్ర జేసింది, ఎదిరించింది, బెదిరించింది, చేతుల్ని, బుర్రని అదుపులో పెట్టుకోమని వార్నింగ్ ఇచ్చింది.

గ్రూప్ అడ్మిన్గా ఇక రంగంలోకి దిగక తప్పదని అర్థమైంది అబద్దానికి. 'మీరు మెసేజి డిలీట్ చేయండి' అని ఆ సభ్యుడికి హుకుం జారీ చేశాడు.

అహం దెబ్బతిన్న ఆ సభ్యుడు 'నేను చేయను... కావాలంటే నన్ను మీ గ్రూపు నుంచి పీకి పారేయండి' అని మొండి పట్టు పట్టాడు.

'నేను వికృతి ప్రేమికుల గ్రూపు అడ్మిన్ అబద్ధంను మాట్లాడుతున్నాను. మీరు ఆ మెసేజి డిలీట్ చేసి గ్రూపు సభ్యులకు క్షమాపణ చెప్పండి' అని కోన్కిస్కాకు ఫోన్చేసి హుకుం జారీచేశాడు.

'నేను చేయను నీ దిక్కున్న చోట చెప్పుకోరా'

(మిగతా 5వ పేజీలో)



## ఓదార్పు గీతం

గమ్యంలేని గమనం సాగుతూనే వుంది
ఒంటరి మాటలన్నీ తోడైనిలుస్తున్నాయి
ఓదార్పు గీతమై జీవితస్వరాన్ని వినిపిస్తున్నాయి
నలుగురితో నడిచిన అడుగులన్నీ తెగిపడిపోయి
కరిగిపోయిన మేఘాల్లా కళలన్నీ కమరుగవుతున్నాయి
మంచుతెరల్లా ఒంటరితనం అంతా చుట్టుకుంటుంది

మనుషులకు మధ్య పొలంగట్లలా ఉన్న
బంధాలగుట్టలన్నీ ...
స్వార్థమనే నీటికోతలకు తెగిపడుతున్నాయి.
మౌనందాల్చిన వ్యక్తులమధ్య ఒంటరిబతుకు
కన్నీటికి కనురెప్పలకి మధ్యచిక్కిన బాధను...
ఎదలో దాచిన హృదయపు గదులనిండా..
నింపుకొని ఒంటరి బతుకుపాటను వినిపిస్తున్నాను

దిగులుతో సాగుతున్న నావకు అలలన్నీ
ఎగసిపడుతూ ఎదో ఓదార్పు మాటల్ని చెపుతున్నాయి
ఎందరోరుణం తీర్చుకోవాల్సిన సమయమిది
నలుగురు దూరమైనంతమాత్రాన...
జీవిత ప్రయాణం ఆగదు.
చివరిచూపువరకు పోరాటాన్ని సాగించాల్సిందే.

అశోక్ గోనె, 9441317361



## చిరునామా లేని ఉత్తరం

దేహం ముడతలు పడ్డాక
అక్షరాలు చెదిరిన కాగితంలా
చిరునామా లేని ఉత్తరమే
ఈ వృద్ధాప్యం!

మనసులు స్వార్థానికి వేలం పడ్డాక
బంధాల బిగువులు వదులయ్యాయి
ప్రేమ పేరుతో పిలిచే పెదవులు
లెక్కలు చూసుకుంటున్నాయి.

బతుకు వంతెన కూలిపోతుంటే
ఒంటరితనం ఒడిలో ఒదిగి
మృత్యువు ముంగిట్లో నిలబడినా
అక్కున చేర్చుకునే చేయి కరువే!

తలుపు చప్పుడుకు తడబడే గుండె
కిటికీలోంచి చూసే కళ్లు
'ఎవరైనా వస్తారేమో' అనే ఆశ
చివరిశ్వాస వరకు
ఊపిరాడకుండా చేస్తుంది

పద్మజా రామకృష్ణ. పి.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# అబద్ధం

(కథ-4వ పేజీ తరువాయి)



అన్నాడు అప్పటికే ఆ గొడవతో సగం పిచ్చెక్కిన సభ్యుడు.

నన్నే ధిక్కరిస్తావా అని ఒకరిద్దరు గ్రూపు సభ్యులతో ఫోన్ చేసి ముందా సభ్యుడ్ని తిట్టించి తర్వాత ఆ కోన్‌కిస్కాను పీకి పడేసి 'హమ్మయ్యా ఇప్పుడు సమ్మగా ఉంది' అని ఊపిరి పీల్చుకున్నాడు.

వాట్సప్ గ్రూపు గొడవల్లో పడి చూసుకోలేదు అబద్ధం ఆఫీసు టైమ్ అయిపోయి అప్పటికే రెండుగంటలు ఎక్కువయింది. అప్పుడే ఇంటికి వెళుతోన్న ఆఫీసర్ 'ఆహా ఎంత హార్డ్వర్కర్, కానీ పని కనపడదేం చెప్మా' అని అనుకున్నాడు.

ఇంటికొచ్చి స్నానం చేసి భార్య పెట్టింది వాట్సప్ చూస్తూ తిని, భార్య చెప్పింది కూడా వాట్సప్ చూస్తూ విని తన గదిలోకి వెళ్ళిపోయాడు.

రాత్రి భోజనాల తరువాత వాట్సప్ వీరులు చెలరేగిపోతారు. చీల్చి చెండాడతారు. ఆవేశపడతారు, ఆవేదన చెందుతారు. గొప్పలు చెబుతారు. గతం తవ్వుతారు, అమ్మాయిలను పొగుడుతారు మంచి రసవత్తరంగా ఉంటుంది ఆ సమయం.

అబద్ధం కవిత్వం కూడా రాస్తాడు తాను అడ్మిన్ కవిగా ఉన్న గ్రూపు ఓపెన్ చేశాడు. ఎవడో. కుర్రకవి 'నాకు పిచ్చెక్కింది' అని కవిత రాసి పెట్టాడు.

అబద్ధానికి పూనకం వచ్చేసింది అసలు కవిత అంటే ఏమిటి? ఎలా రాయాలి? నువు కవితలో ఇంప్రూవ్ చేయవలసినవి ఏమిటి అని ఒక లిస్టు రాసేడు.

'నిజంగా మీరు దేవుడుకవి సార్ నాలాంటి పిచ్చికవులను ప్రోత్సహించడానికి ఈ గ్రూపు ఏర్పాటు చేసి మీరు ప్రోత్సహిస్తున్న విధానం నభూతో నభవిష్యత్' అన్నాడు.

కాసేపు అందరినీ ప్రోత్సహించి విమర్శించిన తరువాత డ్రాయింగ్ రూమ్లో టీవీ చూస్తోన్న భార్య పిలుపు విన్నాడు. ఆ ఎపుడూ పిలిచే పిలుపే కదా అని లైట్ తీసుకున్నాడు.

ఆ తరువాత తన వాట్సపుకు భార్య ఫోన్ నుంచి ఒక మెసేజి వచ్చింది.

'అరేయ్ కవిగా పెద్దల వెనకాల తిరిగితేనో, వాట్సప్ గ్రూపు పెట్టి అందరినీ ఏకితేనో నువు కవివి కావు, నీకు చీమ తలకాయంత పేరు కూడా రాదు, చదువు, పనిచేయి, జీవితాన్ని మనుషుల్ని ప్రేమించి చావు' అని వుందా మెసేజిలో.

వెంటనే తను అడ్మిన్‌గా వున్న పదిహేను గ్రూపుల్లోను ఈ మెసేజి కింద తన పేరు వేసుకుని ఫార్వర్డ్ చేసి 'హమ్మయ్యా ఎంతమంది మెచ్చుకుంటారో చూద్దాం' అని కళ్లు మూసుకున్నాడు.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# స్వాభిమానం

కథ

ఎస్.ఉమామహేశ్వరి
63019 12215

'పావనీ... టీ...` అంటూ హాల్లో సోఫాపై కూర్చొని ఫోన్ చూసుకుంటూ శ్రీధర్ పిలుస్తున్నాడు.

'ఆ... తెస్తున్నానండీ...` అంటూ ... పావని టీని తెచ్చి శ్రీధర్ కిచ్చింది.

'అమ్మా, నాన్న టీ తాగారా ?` అని అడిగాడు శ్రీధర్

'ఆ.. తాగారండీ.. వాళ్ల గదిలో కూర్చొని వార్తలు చూస్తున్నారు` చెప్పింది పావని.

'ఓకే` అంటూ ... శ్రీధర్ మళ్లీ ఫోన్లో నిమగ్నమయ్యాడు.

'ఏవండీ` .. అంటూ నిదానంగా పిలిచింది పావని.

'హా చెప్పు పావని ఏంటి ? ` అడిగాడు శ్రీధర్.

'మన బాబీ, సంజూల స్కూల్ బ్యాగులు బాగా పాతబడిపోయి చిరిగిపోయాయి.. కొత్తవి కొనాలండీ` అని అడిగింది పావని.

'కొత్తవా? అన్నీ తెలిసి కూడా ఎలా అడుగుతావు పావనీ.. నా ఒక్కడి సంపాదనతో ఇల్లు గడవడమే కష్టం... అయినా ఆ బ్యాగులు మరీ చిరిగిపోలేదులే... సాయంత్రం నేను ఆఫీసు నుండి వచ్చిన తర్వాత వాటిని ఇవ్వు... కుట్లు వేయించుకొస్తాను..` అన్నాడు కాస్త చిరాగ్గా శ్రీధర్.

'ఏవండీ.. మీ సంపాదనతో ఇల్లు గడవడం కష్టంగా ఉంది కదా.. నేను కూడా ఉద్యోగం..` అని పావని నిదానంగా కాస్త బిడియంగా అంటుండగానే..

'ఆ.. బి.ఎ చదివాను. ఉద్యోగం వెలగబెడతాను. నువ్వు పిల్లలకి బ్యాగులు కూడా కొనివ్వలేవు.. అని నన్ను ఎగతాళి చేస్తున్నావా, అంతేనా ?` అని ఇంకాస్త గొంతు పెంచాడు శ్రీధర్.

'నా ఉద్దేశం అదికాదండీ` అని పావని అంటుండగానే..'ఆ.. ఆ.. నీ ఉద్దేశాలు వినే తీరుబాటు లేదులే గాని.. వెళ్లి ఇంట్లో పనిచూడు` అని కసురుకున్నాడు శ్రీధర్.

వంటగదిలోకెళ్లి కన్నీళ్లు పెట్టుకుంది పావని.. ఎవరూ చూడకముందే పైటకొంగుతో ఆ కన్నీళ్లను తుడిచేసుకుంది. ఇంతలో.. పిల్లలు ఇద్దరూ వచ్చి పావనీని అమ్మా అంటూ వాటేసుకున్నారు. 'అమ్మా! మేం రెడీ.. టిఫిన్` అంటూ ఇద్దరూ సందడి చేశారు.

'హాల్లోకి పదండమ్మా... మీకూ, మామ్మ, తాత, డాడీకి టిఫిన్ పెడతాను. సరేనా.` అంది పావని

'ఓకే అమ్మా...` అంటూ పిల్లలిద్దరూ పరుగెత్తుకుంటూ హాల్లోకి వెళ్లారు.

డైనింగ్ టేబుల్ పై అప్పుడే కూర్చున్న శ్రీధర్ ను చూసి... పిల్లలిద్దరూ డాడీ అనుకుంటూ ఒళ్లో వాలిపోయారు.

'డాడీ... స్కూల్ బ్యాగులు కొత్తవి కావాలి డాడీ` అని బాబీ బుంగమూతి పెట్టాడు.

'అవును డాడీ.. బ్యాగులు బాగా చిరిగిపోయాయి.. కొత్తవి కొను డాడీ` అని శ్రీధర్



చేతిని పట్టుకొని గారాబంగా అడిగింది సంజు.

'ఒకే.. ఒకే.. ముందు టిఫిన్.. తర్వాత బ్యాగులు గురించి.. డాడీ మాట వినాలి మరి..` అంటూ శ్రీధర్ ఇద్దరు పిల్లలను వాళ్ల కుర్చీల్లోకి పంపాడు.

డైనింగ్ టేబుల్ పై అందరూ కూర్చున్నారు. పావని అందరికీ వడ్డిస్తుంది. కానీ ఆమె ముఖం చిన్నబోయి ఉన్నట్లు గమనించాడు శ్రీధర్.

టిఫిన్ తిన్న తర్వాత వాషింగ్ బేషిన్ లో చేతులను కడుక్కుంటూ.. టవల్ అందిస్తున్న పావనితో 'చూడు పావనీ! ఇంట్లో ముసలివాళ్లయిన మా అమ్మానాన్నలు ఉన్నారు. ఇద్దరం ఉద్యోగాలకుపోతే వారిని ఎవరు చూసుకుంటారు. అనుకోకుండా వారికేమైనా అయితే ..! నలుగురికి నేను ఏం సమాధానం చెప్పుకోవాలి. ఎలాగో నా తంటాలు నేను పడుతున్నాను. అయినా నీకు ఇంటి పనే సరిపోతుంది.. ఉద్యోగం ఏం చేస్తావ్ చెప్పు..! వచ్చే జీతంలో పిల్లలకు బ్యాగులు కొంటానులే. నువ్వు కాస్త ముఖం మార్చు. చూడలేకపోతున్నా` అంటూ అక్కడి నుండి వెళ్లిపోయాడు.

• • •

పనంతా అయ్యి పావని టిఫిన్ తినేటప్పటికి ఉదయం 11 అయ్యింది.. అప్పటివరకు పనిలో పడి పచ్చిగంగ కూడా ముట్టలేదు. 'హమ్మయ్యా' అంటూ . అప్పుడే కాస్త ఊపిరి పీల్చుకుంది. టేబుల్ పై డిష్ లో మిగిలిన చల్లారిపోయిన కాస్త టిఫిన్ ను ప్లేట్లో పెట్టుకొని, అప్పుడే కుర్చీలో కూర్చుంది.

'అమ్మా... పావనీ.. ఓ సారి ఇటురామ్మా ... ` అంటూ అత్త విశాలాక్షి పిలుపు. టిఫిన్ ప్లేటును అక్కడే బల్లపై పెట్టేసి ... అత్తామామల గదిలోకి వెళ్లింది పావని.

'అమ్మా.. పావని.. కాస్త టివి ఛానల్ మార్చి పాత తెలుగు సినిమా పెట్టమ్మా.. నాకు చూపు సరిగ్గా కనబడటం లేదు.. నంబర్ తప్పుపడిపోతుంది..` అంది అత్త.

'సరే!' నంటూ పావని రిమోట్ తీసుకొని టివి ఛానల్ మార్చి, సినిమా పెట్టి, తిరిగి టేబుల్ వద్దకు వెళ్లింది. టిఫిన్ తింటుండగా... పావని ఆలోచనలు కాస్త వెనక్కు వెళ్లాయి.

చదువుకున్న రోజులు, చేసిన సందడి.. బిఏ పూర్తయ్యాక .. 4 సంవత్సరాలు ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం.. అప్పుడు ఏం కావాలంటే అవి వెంటనే కొనుక్కోవడం.. ఆ తర్వాత పెద్దలు కుదిర్చిన పెళ్లి సంబంధం చేసుకుంది. పెళ్లి తర్వాత ఇదిగో.. ఇలా..! 'అప్పుడు నాకు అవసరమైనవన్నీ చాలా తేలిగ్గా కొనుక్కున్నా.. ఇప్పుడు నా పిల్లలకు కనీసం బ్యాగులు కూడా కొనివ్వలేకపోతున్నా ..!` అంటూ బరువెక్కిన గుండెతో లోతైన నిట్టూర్పు విడిచింది పావని. సాయంత్రం అయ్యింది. చెంగుచెంగున పరుగెత్తుకొచ్చే పిల్లలు ఆ రోజు దిగాలుగా నిదానంగా నడుచుకుంటూ వచ్చి బ్యాగులను సోఫాలపై పడేసి కిమ్మనకుండా కూర్చున్నారు. వాళ్లిద్దరినీ చూసి ఆశ్చర్యపోయిన పావని.. 'ఏమ్మా ... స్కూల్ లో ఏమైనా జరిగిందా ? ఎవరైనా ఏమైనా అన్నారా?' అని ఆత్రంగా అడిగింది.

'నీ బ్యాగ్ చిరిగిపోయిందా.. అంటూ చింటూ, జానీ, బబ్లుగాడు కలిసి నా బ్యాగు చిరుగుల్లో చేతులుపెట్టి ఏడిపించారమ్మా` అంటూ కన్నీళ్లు తుడుచుకుంటూ బాబీ బాధగా చెప్పాడు.

'అవునమ్మా... బ్యాగుల కుట్లు చిరిగిపోతున్నాయి.. బుక్స్ జారిపోతున్నాయి. మా క్లాసులో కూడా నా ఫ్రెండ్స్ నవ్వుతున్నారమ్మా' అంటూ సంజూ కాస్త నిగ్రహంగా చెప్పింది. ఒక్కసారిగా పావని గుండె తల్లడిల్లిపోయింది. ఆ పరిస్థితిలో పిల్లలు ఎంత బాధపడి ఉంటారో తలుచుకొని కళ్లు చెమ్మగిల్లుతున్నా. కాస్త దిటవుగా ఉంటూ.. బాబీ, సంజూల మధ్య కూర్చుంది.

'చూడండి బాబీ, సంజూ .... ఇంకో 15 రోజుల్లో మీ డాడీకి జీతం వస్తుంది.. ముందు వెంటనే మీకు బ్యాగులు కొనిపిస్తాను.. ` అని పావని అంటుండగా...

పిల్లలిద్దరూ పావని ముఖాన్ని ప్రశ్నార్థకంగా చూశారు.

'ఏంటి ఇద్దరూ అలా చూస్తున్నారేంటీ .. అమ్మ మాట మీద నమ్మకం లేదా.. ఈసారి మీ డాడీతో ఫైట్ చేసైనా సరే మీకు కొత్త బ్యాగులు కొనిపిస్తా. ఓకేనా. అమ్మను కదా! నమ్మాలి. కాస్త నవ్వండ్రా..'అంటూ పావని ఇద్దరినీ

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సఅప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

దగ్గరకు తీసుకొని ముద్దులాడి కితకితలు పెట్టింది. అంతే ఆ ఇద్దరూ పిల్లల నవ్వులతో ఇల్లంతా వెలిగిపోయింది. అప్పటినుండి ఏ పని చేస్తున్నా పావని మెదడు తొలిచేస్తుంది. 'ఎలాగైనా పిల్లలకు బ్యాగులు కొనాలి. కానీ ఎలా?' అనుకుంది. ఇంతలో తన ఫ్రెండ్ రితిక గుర్తొచ్చింది. 'అది ఎన్నోసార్లు కాల్ చేసింది. నేను సరిగ్గా రెస్పాండ్ అవ్వలేదు. ఈ పనుల్లో ఫోన్ మాట్లాడాలన్న ఆలోచనే చచ్చిపోయింది. ఓసారి రితికను ఏదైనా హోం మేడ్ వర్క్ ఉందేమో అడిగితే ..!' అనుకుందే తడవు వెంటనే రితికకు పావని కాల్ చేసింది.

'ఏంటే పావనీ! అమ్మో ఈరోజు ఎవడో చచ్చాడే..! పావనీ ఫోన్ చేయడమా ?` అంటూ రితిక వెటకారంగా మాట్లాడింది.

'చాల్లేవే ... వెటకారానికేం తక్కువలేదులే` అంది పావని విసుగ్గా.

'ఊరికే అన్నాలేవే...ఏం మేడం ... తమరికి సడన్ గా మేం గుర్తొచ్చాం..` అని అడిగింది రితిక.

'అవునే... ఓ చిన్న హెల్ప్ కావాలి..` అంది పావని

'ఏయ్ హెల్ప్ ఏంటే ... ఆర్డర్ వెయ్యి. ఇక్కడ రితిక పావని ఫ్రెండ్..!` అంది నవ్వుతూ రితిక.

'ముందు నేను చెప్పేది వినవే..` అని కాస్త నవ్వింది పావని.

'ఏదైనా ఇంట్లో చేసే వర్క్ ఉంటుందా ?` అంది పావని

'ఏ వర్క్ ఉన్నా మీ హస్బెండ్ ఒప్పుకోడు. నువ్వేమో సంసారం చదరంగం అని పాట వినిపిస్తావు` అంది సరదాగా రితిక.

'కాస్త సీరియస్ గా మాట్లాడవే...` అంది పావని

'ఒకే.. ఏమైనా హెల్ప్ కావాలంటే ఈ రితిక ఉంది కదే.. చెప్పు కాస్త అమౌంట్ నీ అకౌంట్లో వేయమంటావా ? ` అడిగింది రితిక

'నిన్ను నేను డబ్బు అడిగానా ?` అంది కోపంగా పావని

'నేను నీ ఫ్రెండ్ నే.. నాకు ఆ చనువు లేదా? నన్ను బయటిదానిలా చూస్తున్నావ్ కదూ..` అంది రితిక

'లేదే.. అవసరం ఉంటే నేనే అడుగుతాను కదా.. నీ దగ్గర నాకు భయమేంటి? గట్టిగా కొట్టైనా లాక్కుంటా.సరే కానీ... ఇంట్లో ఉండి సంపాదించగలిగే ఏదైనా ఉద్యోగం ఉంటే చెప్పవే` అంది పావని.

'ఒకే... AI TOOL అని ఒక కోర్సు ఉందే.. చదువుతో సంబంధం లేదు.. కచ్చితంగా ఇంగ్లీషు రావాలనీ లేదు.. నీ టాలెంట్ తో ఏఐ టూల్స్ ను వాడాలి.. సంపాదించాలి... నీకు ఖాళీ ఉన్న టైంలోనే రోజులో కాస్త 3 గంటలు ఇచ్చావంటే చాలు.. అందరూ నిద్రపోయిన తర్వాతైనా సరే. నువ్వు బాగా మైండ్ పెట్టి ప్రాక్టీసు చేసి ఆ టూల్స్ ను నేర్చుకున్నావంటే ఈజీగా మనీ ఎర్నింగ్ చేస్తావే.. అన్నట్లు ఒక్క టూల్ నేర్చుకోవడానికి పెద్ద టైం పట్టదు.. ఓ 15 రోజుల్లో నేర్చుకోవచ్చు... ఇక పావనీలాంటోళ్లయితే ఇంకా తొందరగా నేర్చేసుకుంటారు.. ` అంది రితిక.

' హు... వివరణ బాగానే ఇచ్చావు కానీ... నేను బిఎ చదివాను... నాకు యూజ్ అవుతుందా?నేను చేయగలనా ? ` అంది పావని

' ఎందుకు చేయలేవే... పదో తరగతి చదువుకున్నవాళ్లు కూడా చేస్తున్నారు.. నువ్వు చేయలేవా? ఆల్ రెడీ మన ఫ్రెండ్ సుహాసిని ఇలాగే ఎర్న్ చేస్తుందే.. ఓసారి సుహాసిని కి కాల్ చేసి మాట్లాడు. నీకేమైనా అనుమానాలుంటే అవి కూడా పోతాయ్ ` అంది రితిక

'ఒకేనే... వెంటనే నాకు ఆ లింక్ సెండ్ చెయ్ ... ` అని అడిగింది పావని.

'ఓకే పావని బంగారం... ఆల్ ది బెస్ట్ ... మళ్లీ కాల్ చేస్తాను.. బై...` అని ఫోన్ పెట్టేసింది రితిక.

తన ఫ్రెండ్ సుహాసినికి కాల్ చేసి వివరాలన్నీ కనుక్కుంది పావని. ఇక ఆ రోజు నుండి

కాకపోతే ఏంటి ? హు..!` అనుకుంటూ చిరాగ్గా పడుకున్నాడు శ్రీధర్.

పావని మాత్రం నిద్రపోలేదు. పట్టువదలని విక్రమార్కుడిలా కోర్సు కంప్లీట్ చేసింది. 10 రోజుల్లో ఫోన్ లోనే కొన్ని టూల్స్ నేర్చుకొని.. ఓ మంచి బ్యానర్ ను డిజైన్ చేసి అవసరం ఉన్న ఓ కంపెనీకి సెండ్ చేసింది. అది చూసి నచ్చిన కంపెనీ ఓనర్ వెంటనే పావనీ అకౌంట్ కు రూ.2 వేలు అమౌంట్ వేశారు. పావని ఫోన్లో టెక్స్ట్ మెసేజ్ ..! వచ్చింది.

'రూ.2 వేలు నా అకౌంట్లోనా ?` నమ్మలేకపోయింది పావని. మళ్లీ కళ్లు నులుముకొని తీక్షణంగా మెసేజ్ ను చూసింది..

'అవును.. నిజమే నా అకౌంట్లో చాన్నాళ్లకి అమౌంట్ ..!` అనుకొని వెంటనే తన బ్యాలెన్స్ చెక్ చేసుకుంది. అక్షరాలా రూ.2 వేలు ..!

పావని కళ్లు ఆనంద బాష్పాలతో తడిసి ముద్దయ్యాయి. గుండె గంతులు వేసింది.. ఊపిరిలో నుండి ఏదో బాధ బయటకు బై బై



AI TOOLS Course పై శ్రద్ధ పెట్టింది. ఎప్పుడు ఖాళీ సమయం దొరికినా టూల్స్ నేర్చుకునేది.. రాత్రి చాలా సమయం నిద్రను సైతం లెక్కచేయకుండా టూల్స్ ను నేర్చుకోవడం ప్రారంభించింది. రోజూ ఫోన్ లో బిజీ అవుతున్న పావనిని చూసి ఓ రోజు శ్రీధర్ అడిగాడు.

'ఏంటి పావని ఈ మధ్య ఎప్పుడు చూసినా ఫోన్ లో బిజీ అవుతున్నావ్... నిద్రపోకుండా ఏం చేస్తున్నావ్ ` అని అడిగాడు కోపంగా.

విషయమంతా వివరించింది పావని.

' ఓహ్ ... AI TOOLS సరిపోయింది.. ఇవన్నీ జరిగే పనులేనా? అనవసరంగా నిద్ర పోకుండా నేర్చుకుంటున్నావ్ ... నువ్వు సిక్ అయ్యావనుకో... ఇంట్లో పనంతా ఎవడు చేస్తాడు ? చాలుచాల్లే ఇక నిద్రపో... ఇంకా ఏంటో అనుకున్నాను. పనికిమాలిన పనులు

అని చెప్పినట్టనిపించింది..!ఆ రూ.2 వేలు పావని కష్టార్జితం మాత్రమే కాదు.. కొన్ని ఏళ్ల తర్వాత ఆమెకు తిరిగి దొరికిన ఆత్మ విశ్వాసం..!

• • •

మరుసటి రోజునే బాబీ, సంజూలకు కొత్త బ్యాగులు, షూలు కొనేసింది పావని. బ్యాగులను, షూ లను చూసిన శ్రీధర్ ఆశ్చర్యపోయాడు.

'నేను పావనీకేం డబ్బివ్వలేదే..

ఇవెక్కడివి ?` అనుకుంటూ పావని దగ్గరకు వెళ్లాడు. పావనీని అని అడిగాడు అనుమానంగా శ్రీధర్.

'అవి నా సంపాదన.. నా స్వాభిమానం..` అని సగర్వంగా చెప్పింది పావని.

ఒక్క క్షణం శ్రీధర్ మిన్నకుండిపోయాడు..!' నీ పట్టుదల గురించి

తరువాయి 15 లో

# స్వాభిమానం

5వ పేజి నుంచి

మీ పేరెంట్స్ ఎక్కువగా చెబుతుండేవారు. ఇప్పుడు కళ్లారా చూశాను.. ఇక నుండి నా సపోర్ట్ నీకు ఎప్పుడూ ఉంటుంది. ఓకేనా!' అంటూ ... క్యారేజి తీసుకొని ఆఫీస్ కి వెళ్లాడు. ఆరోజు నుండి ఇంట్లో అందరూ పావనీని కొత్తగా చూడటం మొదలుపెట్టారు. అప్పటి నుండి ఆమెను గౌరవించడం ప్రారంభించారు. కానీ పావనీలో మాత్రం ఏమార్పూ రాలేదు. తనకు గౌరవాన్ని ఇచ్చిన పనిని ఆపలేదు. ఇంకా కొత్త కొత్త ప్రాజెక్టులను చేసి పంపడం ప్రారంభించింది. ఈసారి పావని అకౌంట్లో రూ.10 వేలు వచ్చాయి. ఆశ్చర్యపోయింది..! ఇకపై పిల్లల విషయంలో తనకు బెంగ లేదనుకుంది.. చెమ్మగిల్లిన కళ్లతో వెంటనే తన ఫ్రెండ్ రితికకు ఫోన్ చేసింది.

'రితిక... చాలా థాంక్సే..` అంది పావని

'ఏయ్... చంపుతా బిడ్డా ... ఏంటే కొత్తగా థాంక్స్ లు చెపుతున్నావ్ ...` అంది రితిక కోపంగా.

'ఆగవే ... నువ్వు చూపించిన మార్గంలో వెళ్లాను.. ఈరోజు నన్ను నేను మళ్లీ పొందాను` అంది పావని

'ఏమే పావని .. ఏం చెప్పావో ఒక్క మాట అర్థమైతే ఒట్టే.. కాస్త అర్థమయ్యేలా చెప్పవే ` అంది రితిక.

'ఒసేయ్ ... పిచ్చి... నువ్వు నాకు AI TOOLS Link ఇచ్చావుగా ...` అంది పావని

'ఆ ఇచ్చాను.. అయితే` ... అని రితిక అంటుండగానే..

'ఆ టూల్స్ ను నేర్చుకున్నానే.. కొన్ని డిజైన్లు చేశాను.. మొదట కాస్త భయం వేసినా ధైర్యం చేసి పంపాను.. అవి సక్సెస్ అయ్యి మొదట రూ.2 వేలు వచ్చాయి... ఆ సంగతి నీకు చెప్పే లోపే ... వెంటనే మరో డిజైన్ కి రూ.10 వేలు వచ్చాయే` అని ఆనందంగా చెప్పింది పావని.

'ఏహే... నువ్వు సక్సెస్ అవుతావని నాకెప్పుడో తెలుసే.. పావని టాలెంట్, పట్టుదల నాకు తెలియదా ?` అంది రితిక

పకపకా నవ్వింది పావని.

● ● ●

కొన్నాళ్లు గడిచాయి.. ఎఐ టూల్స్ నేర్చుకున్న పావని, తన ఫ్రెండ్స్ రితిక, సుహాసినిలతో కలిసి నిదానంగా ఓ అకాడమీని ప్రారంభించింది. తమలాంటి ఎంతోమంది మహిళలకు వారు స్ఫూర్తిగా నిలిచారు. ఇంట్లోనే ఉంటూ బయటకు వెళ్లి ఉద్యోగం చేయలేకపోతున్నామంటూ బాధపడుతున్న మహిళలందరికీ ఎఐ టూల్స్ ను నేర్పుతూ సొసైటీలో మంచి పేరు సంపాదించారు. ఓ రోజు ఓ మహిళా సమావేశానికి పావని, రితిక, సుహాసినిలకు ఆహ్వానం అందింది. ఆ రోజున స్టేజీ పై ఎక్కి మైకు అందుకున్న ఫ్రెండ్స్ తమ అనుభవాలను మహిళలందరితో పంచుకున్నారు. రితిక, సుహాసినిల తర్వాత పావని స్టేజ్ ఎక్కి మైక్ ను అందుకుంది. అందరికీ నమస్కరించింది.

' నేను పెద్ద వ్యాపారవేత్తను కాను.. ఒక సాధారణ గృహిణిని. ఒక మహిళ ఇంటి బాధ్యతల మధ్య తనను తాను కోల్పోకూడదు. తన విలువను తాను గుర్తించాలి. అప్పుడు ఆమె జీవితంలో అసాధ్యం అనే మాటకు చోటుండదు. ఓ మహిళ సంపాదిస్తుంది అంటే అది కేవలం డబ్బు మాత్రమే కాదు... ఆమె ఆత్మవిశ్వాసం.. స్వాభిమానం..! కూడా ` అంది పావని. ఆ మాటలకు సభలో ఉన్నవారంతా లేచి నిలబడి చప్పట్లు కొట్టారు. ముగ్గురు స్నేహితురాళ్లను అభినందించారు. అప్పుడు పావని మనసులో మెల్లగా ఓ స్వరం వినబడుతుంది... ' నేను గెలిచింది డబ్బును కాదు ... నన్ను నేను గెలుచుకున్నాను ` అని.

# నవ్వవే పాప

నవ్వవే పాప నవ్వు
ముందు నవ్వవే నువ్వు
విషాద ఛాయలు దరిచేరక ముందే
నవ్వవే నవ్వు



కళ్ళల్లో ఆనంద భాష్పాలు
కన్నీళ్లుగా మారకముందే
నవ్వవే నువ్వు

కల్మషం లేని నువ్వు
నీ నవ్వులో ఆనంద ఘడియలు
చెదిరిపోక ముందే
నవ్వవే నువ్వు నవ్వు

శరకడం మురళీకృష్ణ

# బోసి నవ్వులు



చిట్టి పాపాయి ఐదు నెలల పండుగ,
చిరునవ్వులతో నింపే ఆనందం.
బోసి నవ్వులు భలే ముద్దుగా,
బుడిబుడి మాటలు తియ్యగా.
చిట్టి చేతులు ఆడిస్తుంటే,
చూస్తూ మురిసే అమ్మానాన్నలే.
బుగ్గలు చూస్తే పువ్వుల్లా,
కళ్లు మెరిసే నక్షత్రాల్లా.
చిట్టి నవ్వే ఇంటికి వెలుగు,
నీ ఆటలే మాకు కనుల పండుగ.
నీ ముద్దు మురిపమే మా సంతోషం,
ఐదు నెలల పాపాయి నువ్వే మా ప్రపంచం!

-అన్నాబత్తుల పూజాస్వాప్నిక.
చంద్రాల, మైలవరం మండలం, ఎన్టీఆర్‌జిల్లా.

# కొమ్ము బూర

కవిత్వ కొయ్యకు కట్టిన తెప్ప
ఒడ్డు నీళ్ళ అలలపై తచ్చాడుతోంది
బహుదూరపు ప్రయాణం ఇప్పుడు
పురివిప్పిన ప్రకృతిలో
కొమ్ముబూర వోలే శబ్ధిస్తుంది

ఓ అక్షరం ఓ వాక్యం
ఆనపకాయ బుర్రలా
వెదురునార విల్లులా



రేలాపాటల స్వరధారలా
విప్పపూల చెట్టుమీద వాలిన పిట్టలా
ఎంత సహజంగా వుందో ...

తొలి సంజె కిరణాలు
నిగూఢ భావంలా..
మబ్బుల్లోనే దాక్కుంటున్నాయి
ఆగని అశ్రు వాక్యమొక్కటి
వ్యధార్థితో వణికిస్తోంది
మంచు దుప్పటిలా పద్యం
వర్షపు చినుకులా గద్యం
నన్ను ఆసాంతం ఆవహించి
లోలోన లయాన్విత దరువులతో
ససేమిరా వీడనంటోంది...!

- డా.కటుకోర్ద్వుల రమేష్,
సెల్:9949083327

కథ

# ఈసారి ఆపాలి..

- పండరినాథ్ ప్రభల
pandarinath2101@gmail.com

"టక్..."

ఆ శబ్దం చిన్నదే. కానీ ఆ రాత్రి అది ఐదుగురి గుండెలని ఒక్కసారిగా తాకి జీవితాలను రెండు ముక్కలుగా కోసింది. అంతకు ముందు.. సాయంత్రం.. కాస్త చీకటిలోకి జారుతోంది. ఆకాశం బూడిద రంగులోకి మారిపోయింది. వర్షం పడే ముందు వచ్చే మట్టి వాసన గాలిలో

తెలుతోంది. అర్జున్ తన సెల్‌ఫోన్ షాప్ ముందు నిలబడి ఉన్నాడు. షట్టర్ సగందిగింది.

"నాన్న.. ఇంకో కస్టమర్ వస్తాడు. ఐదు నిమిషాలు వెయిట్ చేద్దాం"

రామయ్య కొడుకుని ఎగాదిగా చూశాడు.

"ఐదు నిమిషాలు.. చాలా సార్లు జీవితాన్ని తిప్పేస్తాయిరా" అన్నాడు రామయ్య. "అంత పెద్దగా కాదు నాన్న.." అర్జున్ నవ్వాడు.



అంతలోనే ఒక పోలీస్ జీప్ వచ్చి షాప్ ముందు ఆగింది. రోడ్డుని చీల్చుకుంటూ కీచుమని బ్రేక్ వేసిన శబ్దం తండ్రి--కొడుకులిద్దరినీ ఒక్కసారిగా

ఉలిక్కిపడేలా చేసింది. జీప్ నుంచి ఎస్సై మధు దిగాడు. కళ్ళు ప్రశాంతంగా లేవు. కోపం మాత్రం ఉంది. ఇంట్లోంచి స్టేషన్‌కి బయలుదేరినప్పటి నుంచి ఫోన్ మాత్రం ఆగలేదు.

"ప్రతి కాల్‌లో అదే మాట.. 'మాటలు కాదు.. రిజల్ట్ కావాలి!" ఫోన్ సైలెంట్‌లో పెట్టినా ఆ గొంతులు అతని లోపల ఆగలేదు."

"యాక్షన్ తీసుకోండి.." ఎవరిమీదో ఎవరూ చెప్పరు. కానీ యాక్షన్ మాత్రం కావాలి. ఆ గందరగోళం, ఆ ఒత్తిడి.. ఎక్కడో ఒకచోట బయటకు రావాలి. ఆ క్షణంలో అతనికి దగ్గరగా ఉన్నవాళ్లు రామయ్య, అర్జున్. "ఇంకా ఓపెన్ ఎందుకు ఉంది?"

ఎస్సై మధు అడిగాడు.

అర్జున్ చెప్పాడు "సార్... మూసేస్తున్నాం ఇంకో 5 నిమిషాలు"

"రూల్ అంటే రూలే, టైమ్‌కి మూసేయాలి. ఇంకా ఐదు నిమిషాలు అంటే ఏంటి నీ ఉద్దేశ్యం ?" ఎస్సై గొంతు గట్టిగా పడింది.

"సార్.. చిన్న షాప్, కొంచెం లేటయ్యింది" రామయ్య చేతులు జోడించాడు. ఎస్సై మధు కళ్లలో ఒక్కసారిగా కోపం. "స్టేషన్‌కి పదండి, అక్కడ

మాట్లాడుకుందాం" అది ఎస్సై ఆహ్వానం కాదు, ఆజ్ఞ. ఎంత బతిమాలినా కానిస్టేబుళ్ల ఖాతరు కాలేదు. తండ్రి--కొడుకులిద్దరినీ జీపులోకి ఎక్కించారు. ఖాళీ రోడ్డు మీద జీప్ దూసుకుపోతోంది. సైరన్ ఆన్ చేయలేదు. అవసరం లేదన్నట్టుంది. రోడ్డు మీద ఎవరూ లేరు. జీప్ వెనుక సీట్లో రామయ్య, అర్జున్. ఎదురుగా ఇద్దరు పోలీసులు. భయం రామయ్య గొంతును బిగించి పట్టుకుంది. మాటలు ఉన్నాయి. కానీ బయటకు రావడం లేదు.

---

రన్నింగ్ జీప్‌లో ఎస్సై మధు వెనకే ఉన్న రామయ్య నెమ్మదిగా ముందుకు వంగాడు. "సర్.. మమ్మల్ని వదిలేయండి, చిన్న విషయం సర్.. షాప్

మూసేయడానికి ఆలస్యం అయింది అంతే" బతిమాలుతున్నాడు. ఎస్సై మధు వెనక్కి తిరిగి చూడలేదు. కొంచెం సేపు గ్యాప్ "చెప్పాను కదా.. స్టేషన్‌కి వెళ్లి మాట్లాడుకుందాం" ఎస్సై చిరాగ్గా అన్నాడు.

వినడానికి నార్మల్‌గా ఉన్నా ఆ మాట ఏమంత మంచిగా లేదు. ఆ శబ్దంలో ఓదార్పుకంటే వార్నింగ్ మోతాదు ఎక్కువ ఉంది. తండ్రిని ఎస్సై చిరాకుపడ్డంతో అర్జున్ ఆగలేకపోయాడు 'చీకటి పడింది, ఇంట్లో అమ్మ ఎదురు చూస్తుంది, మమ్మల్ని విడిచిపెట్టండి సర్".

ఫ్రంట్ సీట్లో డ్రైవర్ పక్కన ఉన్న ఎస్సై బ్యాక్ మిర్రర్‌లోకి చూసి "అయితే నువ్వు తప్పు చేయలేదంటావ్ అంతేగా' గట్టిగా అరిచాడు. "అంటే నిన్ను నేను సరదాగా పోలీస్ స్టేషన్ తీసుకెళ్తున్నానా నీ ఉద్దేశ్యం?" ఎస్సై మధు టోన్ ఈసారి ఇంకా గట్టిగా పడింది. అర్జున్ సైలెంటైపోయాడు, కానీ అతడి కళ్లలో ఆ ప్రశ్న ఇంకా తిరుగుతూనే ఉంది. తను తప్పు చేయలేదు, మరి పోలీస్ స్టేషన్‌కి ఎందుకు తీసుకెళ్తున్నారు.

రామయ్య వెంటనే ఆ మాట పట్టుకున్నాడు "చిన్నోడు సర్, ఏమీ తెలీదు.. తమరు పెద్దవారు క్షమించాలి సర్.." బతిమాలుతున్నాడు.

జీప్‌లో కూర్చున్న కానిస్టేబుళ్ళలో ఒకడు గట్టిగా నవ్వాడు "తప్పు చేయలేదు మరి స్టేషన్‌కి వెళదామంటే ఎందుకురా అంత భయం?".

"ఏమీ చేయలేదన్నది ఉన్న మాటే కదా సార్.." రామయ్య గొంతు సన్నగా వణికింది.

జీప్ స్పీడ్ పెరిగింది. రోడ్డు మీద లైట్లు వరుసగా వెనక్కి పారిపోతున్నాయి. అర్జున్ కళ్ళలో ఆ లైట్లు మెరుస్తున్నాయి, ఆరిపోతున్నాయి.

"నాన్నా.." అర్జున్ నెమ్మదిగా పిలిచాడు. రామయ్య అతని చేతిని పట్టుకున్నాడు. "ఏమీ అవ్వదు రా.." రామయ్య. అతని మాటల్లో నమ్మకం కంటే

ప్రార్థన ఎక్కువగా ఉంది.

"షాప్ దగ్గర ఏం మాట్లాడావ్, చాలా తెలివిగా మాట్లాడుతున్నానని అనుకుంటున్నావా? ఇప్పుడు ఎందుకు సైలెంటయ్యావ్ ?" ఎస్సై మధు, అర్జున్‌తో మళ్ళీ మాట కలిపాడు. అర్జున్ ఓ క్షణం ఆలోచించాడు, తర్వాత నెమ్మదిగా "సార్.. నిజమే చెప్పాను అంతే.." ఆ మాట జీప్‌లో ఉన్న పోలీసులందరికీ గట్టిగా తగిలింది. ఎస్సై వెనక్కి తిరిగాడు "నిజం...? మాకు నువ్వు నిజం నేర్పించాలా?" అతని కళ్ళలో ఇగో హర్ట్ అయిన కోపం స్పష్టంగా కనిపిస్తోంది.

కంగారుగా రామయ్య "సార్.. ప్లీజ్ సార్.. చిన్నోడు.. ఏమీ తెలియదు.. తప్పయ్యింది సార్.." తండ్రి తన కొడుకుని

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కాపాడుకోవడానికి ఇచ్చిన సంజాయిషీ. జీప్ కొంచెం స్పీడ్ పెరిగింది. అర్జున్ బయటకి చూశాడు. ఇంటి దారులు కనిపించట్లేదు. తెలిసిన ప్రపంచం దూరమవుతోంది.

"సార్.. ఇంటికి ఒక్క కాల్ చేయొచ్చా?" నెమ్మదిగా అడిగాడు అర్జున్. ఎవరూ స్పందించలేదు, మరోసారి అడిగాడు. "సార్.. అమ్మకి చెప్పాలి" అర్జున్. "స్టేషన్‌కి వెళ్ళాక చూసుకుందామన్నాకదా! సైలెంట్‌గా కూర్చో!" అర్జున్ ముందున్న కానిస్టేబుల్ గట్టిగా అన్నాడు. జీప్‌లో మళ్లీ నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలో భయం ఉంది, అనుమానం ఉంది, కనిపించని ప్రమాదం ఉంది.

రామయ్య కళ్ళు మూసుకున్నాడు. మెల్లగా తనలో తను "ఏదైనా బాగానే ముగియాలి.." అది దేవుడికి కాదు, అప్పుడున్న పరిస్థితికి రామయ్య చేసిన విన్నపం.

---

"నాన్నా.. మనం తిరిగి వెళతామా?" నెమ్మదిగా అడిగాడు. రామయ్య దగ్గర నుంచి రిప్లై లేదు. కొడుకు చేతిని గట్టిగా పట్టుకున్నాడు. జీప్ స్టేషన్ చేరగానే కానిస్టేబుల్స్ అర్జున్, రామయ్యలని కిందికి దింపి రైటర్‌కి అప్పగించి సివిల్లోకి మారిపోయారు. వెళ్తూ అర్జున్, రామయ్యలని చూపించి ఎస్సై సార్‌ని అడిగి ఎలా చెబితే అలా చేయమని డ్యూటీ దిగిపోయారు. అర్జున్, రామయ్య అక్కడే రాతి శిల్పాల్లా చేతులు కట్టుకుని మౌనంగా రైటర్ మొహం చూస్తున్నారు. క్షణాలు, నిమిషాలు గడిచి దాదాపు గంటైంది. అప్పటిదాకా కంప్యూటర్లో ఏదో సీరియస్‌గా టైపుచేసే పనిలోఉన్న రైటర్ పని అయిపోయినట్లు తలెత్తి "ఏరా ఏంటి కేసు, ఏమ్ చేశారేంటి?" ఆ మాటలో దురహంకారం తప్ప మనుషులతో మాట్లాడినట్లు ఇసుమంత కూడా లేదు.


"అయ్యా ! మాది సెల్ ఫోన్ రిపేరింగ్ షాపయ్యా" రామయ్య భయంగా... "అయితే ఏంటి దొంగ సెల్‌ఫోన్లు కొన్న కేసా?' వెంటనే రైటర్ జడ్జిమెంట్ ఇచ్చి పారేసాడు. "అయ్యా! అదికాదు, మేము మా షాపు ఐదు నిమిషాల ఆలస్యంగా క్లోజ్ చేసి.." ఇంకా రామయ్య మాట పూర్తికానేలేదు, అంతలోపే ఫోన్లో ఏదో మాట్లాడుతూ రైటర్ పక్కకొచ్చి నిలబడ్డాడు ఎస్సై. కాల్ మ్యూట్ చేసి "ఏరా షాపు దగ్గర చెప్పిన నిజాలే మళ్లీ, మళ్లీ చెబుతున్నావా... తప్పులేకుండానే నేను నిన్ను పట్టుకొచ్చానంటావ్ అంతేగా" బూతుల్ని రంగరించి గట్టిగా అరిచేసాడు.

"ముందు వీళ్ళిద్దరిని ఇద్దరినీ లోపలేయండిరా" రైటర్‌కి ఆర్డర్ వేసాడు.

ఈ ఇద్దరూ ఎవరో తెలియదు, ఏ కేసులో తీసుకొచ్చారో తెలీదు ఎస్సై దొరగారు చెప్పిందే ఆలస్యం రైటర్ కానిస్టేబుల్ రవి, రేవతిలని కేకేశాడు. వెంటనే ఇద్దరినీ లోపలేసి లాకప్ తలుపు మూసేసారు.

"టక్" ఆ శబ్దం బయటకి వెళ్లే దారి మూసింది. లోపలికి చిక్కుకునే గాలి మొదలైంది.

---



రవి ఈ మధ్యనే ట్రైనింగ్ కంప్లీట్ చేసి కొత్తగా వచ్చిన కానిస్టేబుల్. రవికి రేవతి వన్ ఇయర్ సీనియర్. ఈ స్టేషన్‌కి వచ్చి ఆర్నెళ్ళయ్యింది.

"పోలీస్ అంటే భరోసా" అని ట్రైనింగ్‌లో నేర్పించారు. కానీ రవికి ఈ పోలీస్ డ్యూటీలో ఎక్కడా భరోసా కనిపించట్లేదు.

"సార్.. చిన్న విషయం అనుకుంటా.." ఆ నిశ్శబ్దంలో కూడా రవి ఎస్సైకి చెప్పేసాడు. ఎస్సై రవిని ఒక్క చూపు చూశాడు, ఆ చూపులో ఒకే మాట. "నువ్వింకా ఏమీ నేర్చుకోలేదు". రవి మౌనమయ్యాడు. కానీ ఆ మౌనం రవికి ఎందుకో జీవితానికి సరిపడా శిక్ష అవుతుందనిపించింది.

స్టేషన్లో ఫైళ్ళ దగ్గర కూర్చుని ఇదంతా సైలెంట్‌గా చూస్తోంది రేవతి. ఆమె సంపాదనే కుటుంబానికి ఆధారం. ఏదో చేయాలని కసిగా పోలీసు ఉద్యోగంలోకి వచ్చింది. సంపాదన అవసరమే కానీ అది చట్టబద్ధంగా ఉండాలని రేవతి ఉద్దేశ్యం. చేసే పోలీసు ఉద్యోగం మీద ఎనలేని గౌరవం. అయినాసరే "మనమేం స్పెషల్ కాదు అందరిలానే, ప్రజల్లో భాగమే.." అనే నిబద్ధతని మాత్రం ఎన్నడూ ఆమె దాటలేదు. పోలీసు ఉద్యోగానికి రాకముందు ఊహించుకున్నదానికికి, ట్రైనింగ్‌లో నేర్పినదానికి వాస్తవం చాలాదూరంలో ఉందని రేవతికి అర్థమవుతోంది.

---

మూసిన లాకప్‌లో చీకటి త్వరగా దిగింది. రామయ్య గోడకి ఆనుకుని కూర్చున్నాడు. అర్జున్ నిలబడి ఉన్నాడు. "నాన్నా.. ఏమీ అవ్వదు" అర్జున్. "ఏమీ అవ్వదు అని పదేపదే అనకురా, అప్పుడు ఏదో అవుతుంది" నెమ్మదిగా అన్నాడు రామయ్య.

"అసలు మనల్ని ఎందుకు తీసుకొచ్చారు, మనమేం తప్పు చేసాం నాన్నా?" అర్జున్.

"వాళ్ళు పెద్ద వాళ్ళు... వాళ్ళమాటకి ఎదురెళ్ళద్దురా.." రామయ్య ఇంకా ఏదో చెప్పబోతున్నాడు...

"ఆపు నాన్న ! పెద్దా చిన్నా ఎవరు చెప్పారు నీకు ఇవన్నీ..." నిలదీసినట్లే గట్టిగా అరుస్తున్నాడు అర్జున్.

సరిగ్గా అప్పుడొచ్చాడు ఎస్సై సెల్‌లోకి. "నీకు రూల్స్ తెలుసా?" అర్జున్ కళ్లలోకి నేరుగా చూసి అడిగాడు.

"సార్.. మేము ఏ తప్పూ చేయలేదు" అర్జున్ ఎంత బలంగా చెప్పినా లాకప్ గదిలో ఆ గొంతు బలహీనంగా వినబడుతోంది

"అది నేను చెప్పాలి" దబాయించాడు ఎస్సై.

అంతలోనే అర్జున్ మీద మొదటి దెబ్బ, శబ్దం చిన్నదే. ఆ తర్వాత రెండు, మూడు... ప్రతి దెబ్బ తర్వాత లోపల శబ్దాలు పెరిగాయి. అడ్డొచ్చిన రామయ్య మీద పడ్డాయి వరుసగా..."నాన్నను వదిలేయండి సార్!" అర్జున్ కేక. ఎస్సై ఇంకా రెచ్చిపోయాడు. రామయ్య గొంతు మరింత తగ్గిపోయింది. "సార్.. ప్లీజ్.." రామయ్య బతిమాలుతున్నాడు. దెబ్బలు ఆగలేదు. వెంట వెంటనే ఇంకో దెబ్బ... ఇంకో కేక.... లాకప్ బయట కానిస్టేబుల్ రవి నిలబడి ఉన్నాడు. మొదటి కేక రవికి వినిపించినపుడు రవి గుండె గట్టిగా కొట్టుకుంది. "లోపలికి వెళ్లాలా?" అతని మనసు అడిగింది. "వద్దు.." భయం జవాబు చెప్పింది.

రవి కళ్ళు మూసుకున్నాడు. "ఇది నా పని కాదు.." రవి లోపల మరో గొంతు మాట్లాడుతోంది "అయితే నీ పని ఏమిటి?" రవి దగ్గర జవాబు లేదు. రేవతి కాళ్లు కదిలాయి. తలుపు వైపు నడిచింది. "ఇది తప్పు.." ఆమె మనసు అరిచింది. అప్పుడే లోపల నుంచి ఎస్సై గట్టిగా "ఎవరూ లోపలికి రాకూడదు!". అంతే, రేవతి ఆగిపోయింది. ఆ క్షణానికైతే ఆమెని ఆపింది భయమే. కొద్దీ సేపటికి ఎస్సై లాకప్‌లోంచి విసురుగా తన రూమ్‌లోకి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత కొద్దిగా ధైర్యం తెచ్చుకుని లాకప్

దగ్గరకి నడిచింది రేవతి.

"అమ్మా.. నీళ్లు.." అన్నాడు రామయ్య. ఆ ఒక్క మాట ఆమె గుండెని తాకింది. నీళ్ల గ్లాస్ ఇచ్చింది. "థాంక్స్ అక్క" అన్నాడు అర్జున్. ఒక్కసారిగా కంపించిపోయింది రేవతి. అప్పటికి రాత్రి బాగా పొద్దుపోయింది. బయట రామయ్య భార్య సీత నిలబడి ఉంది. చేతిలో భోజనం ప్యాకెట్. "అక్కా.. ఒక్కసారి చూపిస్తారా?" రేవతి, సీత కళ్లలోకి చూసింది. ఆ కళ్లలో భయం ఉంది. ఆశ ఉంది. "ఏమీ లేదు.. రేపు రండి" రేవతి.

ఆ మాట అబద్ధం, అయినా సీత నమ్మింది. నమ్మడం తప్ప సీత దగ్గర వేరేదారి లేదు. కొన్ని గంటల్లోనే పరిస్థితి మారిపోయింది. రాత్రి వినిపించిన కేకలు.. పొద్దుటికి నిశ్శబ్దంగా మారిపోయాయి.

హడావుడిగా తండ్రీకొడుకులను జీప్‌లోకి ఎక్కించారు. ఈసారి రవి డ్రైవ్ చేస్తున్నాడు. నిన్న వాళ్ళని స్టేషన్‌కి తీసుకువచ్చిన జీప్ అదే. ఇప్పుడు అదే జీప్ వాళ్ళని హాస్పిటల్‌కి మోసుకెళ్తోంది. తేడా ఒక్కటే అప్పుడు వాళ్లు మాట్లాడుతున్నారు.. ఇప్పుడు మాంసపు ముద్దగా మారి ఉన్నారు. కానిస్టేబుల్ రవి చేతులు స్టీరింగ్ మీద వణుకుతున్నాయి. రియర్ వ్యూ మిర్రర్‌లో చూసాడు. నిన్న రాత్రి కళ్లలో భయం కనిపించిన చోట ఇప్పుడు కదలిక లేదు.

"ఇంకా బతికే ఉంటారు.." రవి తనను తాను నమ్మించుకున్నాడు. కానీ అతని గుండె మాత్రం నిజం తెలుసుకుంది. జీప్ హాస్పిటల్ రీచ్ కాగానే స్ట్రెచర్‌లు పరుగెత్తాయి. డాక్టర్లు వచ్చారు. కొన్ని క్షణాలే, చాలా పెద్ద సమయంలా అనిపించాయి. తర్వాత డాక్టర్ ఫైల్ మూసేశాడు. "బ్రాట్ డెడ్" ఆ మాట గదిలో పడలేదు. మనుషుల మీద పడింది. అంతా ముగిసిన తర్వాత కానీ సీతకి పిలుపు వెళ్ళలేదు. ఆమెకు ఇంకా ఏమీ తెలియదు. సీత స్టేషన్ నుంచి పిలుస్తున్నారని, "వదిలేస్తారుగా?" కానిస్టేబుల్ రేవతిని ఆశగా అడిగింది. రేవతి ఓ క్షణం సీత కళ్లలోకి చూసింది. ఆ కళ్లలో నమ్మకం ఉంది. తాను చెప్పాల్సిన నిజం మాత్రం, ఆ నమ్మకాన్ని బద్దలుకొట్టేదే. రేవతి నిశ్శబ్దంగా తల తిప్పి "వెళ్దాం.." అంది. అది సమాధానం కాదు, దాచిన నిజం. హాస్పిటల్‌కి బయలుదేరేలోపే సీత ఒక్కసారిగా ఆగింది. "తినడానికి ఏమైనా ఇవ్వొచ్చా?" అంది.

ఆ పరిస్థితిలో కూడా ఆమెకు గుర్తొచ్చింది భర్త, కొడుకు ఆకలి. హడావుడిగా దగ్గరలోని హోటల్‌కి వెళ్లి వేడివేడి అన్నం పార్సిల్ కట్టుకుంది. ఆమెకు తెలియదు ఆ అన్నం ఎప్పటికీ వాళ్లకు చేరదని. హాస్పిటల్ ముందు పోలీసుల హడావుడి. పోస్ట్‌మార్టం మాటలు. రేవతి, సీతని లోపలికి తీసుకెళ్లింది. అది ఎమర్జెన్సీ వార్డు. అక్కడ అన్నీ అయిపోయి, రామయ్య, అర్జున్ శరీరాలు మాత్రమే ఉన్నాయి.

సీత ఒక్కసారి కానిస్టేబుల్ రేవతిని చూసింది. ఆమె కళ్లలో షాక్ లేదు. నమ్మకం ఇంకా ఉంది.

"అదేంటి..?" ఆమె నవ్వే ప్రయత్నం చేసింది. "లేస్తారు కదా.." ఆ మాట గదిలో చెల్లాచెదురైంది.

ఎవరూ సమాధానం చెప్పలేదు. ఎందుకంటే సమాధానం అంటే నిజం. ఆ నిజం చెప్పడానికి అక్కడ ఎవరికీ ధైర్యం లేదు. సీత చేతిలోని భోజనం ప్యాకెట్ జారిపోయింది. ఆమె స్తంభించిపోయింది. ఏడుపు రాలేదు. అరుపు రాలేదు. కేవలం ఒక శూన్యం. ఎందుకంటే కొన్ని నష్టాలు కన్నీళ్లకీ అందవు.

---

రామయ్య, అర్జున్ లాకప్ డెత్ ప్రకంపనలు రేపింది. ప్రజల ఆగ్రహం కట్టలు తెగింది. న్యాయంకోసం ఉద్యమాలు జరిగాయి, ఆ తర్వాత ఎంక్వైరీలు వచ్చాయి. ఫైళ్లు తెరుచుకున్నాయి. మీడియా కెమెరాలు వెలిగాయి. ప్రశ్నలు వరుసగా నిలబడ్డాయి.

"మీరు ఏం చూశారు?" కానిస్టేబుల్ రవి కాసేపు కళ్ళు మూసుకున్నాడు. ఆ రాత్రి మళ్లీ అతని చెవుల్లో వినిపించింది దెబ్బల శబ్దం.. కేకలు.. ఆ తర్వాత వచ్చిన భారమైన నిశ్శబ్దం.

"నేను.. విన్నాను అంతే..." రవి ఏదో చెబుతున్నాడు. ఒక్క క్షణం ఆగాడు. ఆ గ్యాప్‌లో అతని భయం, నిస్సహాయత, పశ్చాత్తాపం అన్నీ నిలిచిపోయాయి.

"నేను ఆపలేదు" ఆ మాట కోర్టులో కాదు. రవి మనసులో మార్మోగింది.

కానిస్టేబుల్ రేవతి వంతు వచ్చింది. ఆమె కళ్ళలో కన్నీళ్లు లేవు. కానీ నిద్రలేని రాత్రులు కనిపిస్తున్నాయి.

"నేను ఆపగలిగేదాన్ని.." రేవతి అంది. ఒక క్షణం ఆమె గొంతు బరువైంది "కానీ.. ఆపలేదు"

అది సాక్ష్యం కాదు. ఒక మనసు వేసుకున్న శిక్ష. తీర్పు వచ్చింది. దోషులకు శిక్ష పడింది. సీత మాత్రం అదే చోట కూర్చుంది. చాలాసేపటి తర్వాత నెమ్మదిగా అడిగింది.. "వాళ్లు తిరిగి వస్తారా?" ఎవరూ సమాధానం చెప్పలేదు.

తర్వాత కొన్ని రోజులకి మళ్లీ రోజులాగానే రాత్రి వచ్చింది. మళ్లీ అదే స్టేషన్... లేదా మరో స్టేషన్. మళ్లీ అదే లాకప్ గోడలు, అదే తలుపు. కాలం మారింది. మనుషులు మారారు. కానీ ఆ తలుపు మారలేదు. లాకప్ దగ్గర ఎవరో నిలబడ్డాడు. కొత్తగా రవి స్థానంలో వచ్చిన కానిస్టేబుల్. కొత్త భయం. "ఈ రోజు నేను తలుపు తెరవాలి.." అని తనలో తాను అన్నాడు. పక్కనే మరో మహిళ నిలబడి ఉంది. రేవతి స్థానంలో వచ్చిన కానిస్టేబుల్. కళ్ళలో అదే సందేహం, అదే బాధ్యత. బయట మళ్లీ జీప్ ఆగింది, మరో అరెస్ట్. మళ్లీ కథ మొదలు.

"ముందు మాట్లాడుకుందాం.." ఆమె గొంతు మృదువుగా ఉంది. ఈసారి ఆ మాటలో ఓదార్పు ఉంది. తలుపు దగ్గర ఉన్న ఆ వ్యక్తి చేయి ఈ సారి లాకప్ తాళం మీద కాదు.. హ్యాండిల్ మీద ఉంది. ఆ పోలీసు ఒక్కసారి వెనక్కి చూసాడు. ఆ కళ్లలో ఒక నిర్ణయం "ఈసారి ఆపాలి."

◆◆

## నవ్వుల్ పువ్వుల్

### టాపిక్ డైవర్ట్

'నాకోసం నువ్వేమైనా చేస్తావా'
'చేస్తాను'
'నేను తాగొస్తే గొడవ పడవ్ కదా?'
'గొడవ పడను'
'మీ పుట్టింటికి వెళ్లవు కదా?'
'వెళ్లను'
'షాపింగ్ కోసమని చీటికిమాటికి డబ్బులు అడగవు కదా?'
'అడగను'
'తిండి సరిగా పెట్టడం లేదని నన్ను తిట్టుకోవు కదా?'
'తిట్టను'
'కట్టుకోవడానికి మంచి చీర కూడా లేదని కోపగించుకోవు కదా?' 'లేదు'
'అదే పనిగా సీరియల్స్ చూడ్డం మానేస్తావు కదా?'
'బాగా అలసిపోయి వచ్చారు.. తిని పడుకోండి'

### ఇంకో ఆప్షన్


**భార్య :** ఏమండీ... డాక్టర్ గారు నన్ను ఓ నెల విశ్రాంతి తీసుకోడానికి స్విట్జర్లాండ్ కానీ, స్పెయిన్‌కానీ టూర్‌కి వెళ్ళమని సలహా ఇచ్చాడు. ఎక్కడికి, ఎప్పుడు వెళ్దామో చెప్పండి.

**భర్త :** రేపే ఇంకో డాక్టర్ దగ్గరికి వెళ్దాం.

### ఓవర్‌టైమ్

**పోలీస్ :** ఇలా పగటి పూట కూడా కన్నాలేసి దొరికిపోయేవాడిని నిన్నే చూస్తున్నా.

**దొంగ :** మరేం చెయ్యమంటారు సార్... రాత్రి పూట దొంగతనం చేస్తే వచ్చిన డబ్బు సరిపోవట్లేదు. అందుకే ఓవర్‌టైమ్ చేస్తున్నా.



కథ

# వదిలేస్తే పోలా.

డా॥ సన్నిహిత్

బారెడు పొద్దెక్కాక ఒళ్లు విరుచుకుంటూ నెమ్మదిగా నిద్రలేచింది హరిత. నిన్న రాత్రి పుట్టింటికి వచ్చింది ఆమె. మొగుడితో గొడవ పడి బ్యాగ్ తీసుకుని వచ్చేసింది.

ఆమె బెడ్ రూంలో నుండి హాల్లోకి వచ్చేటప్పటికి "గుడ్ మాణింగ్ అమ్మా..." అంటూ విష్ చేసాడు తండ్రి పరశురాం.

"గుడ్ మాణింగ్ డాడీ .." అంటూ తండ్రి ఇచ్చిన కాఫీ కప్ అందుకుని బాల్కనీలోకి వెళ్ళి కూర్చుంది.

సూరీడు పైకి రావడంతో ఎండ చుర్రున కొడుతోంది.

"మమ్మీ ఇంకా లేవలేదా డాడీ?" అడిగింది .

"లేదమ్మా...ఒంట్లో కొంచెం నలతగా ఉందట... పడుకుంది" చెప్పాడు పరశురాం.

"ఆ...! ఎప్పుడూ ఉన్నదేగా" అనుకుంటూ కాఫీ సిప్ చెయ్యసాగింది.

ఇంట్లో అందరికంటే ముందే లేచే అలవాటు ఉంది పరశురాంకి. భార్య సుమతి కొంచెం లేట్‌గా నిద్ర లేస్తుంది. ఆమెకు మోర్నింగ్ సిక్‌నెస్. ఆమె లేచేటప్పటికే వంట అవీ పూర్తి చేసేస్తాడు.

ఇక సెలవు రోజుల్లో అయితే సుమతి మరింత తీరిగ్గా లేచి చిన్న చిన్న పనులు చేస్తుంది. మెజారిటీ పనులన్నీ పరశురాం కానిచ్చేస్తాడు. అంట్లు బట్టలు చెయ్యడానికి పనివాళ్ళు ఉన్నారు. ఆ విధంగా ఆ ఇల్లు హాయిగా సాగిపోతోంది.

పరశురాం కూడా కాఫీ కప్పుతో వచ్చి కూతురి పక్కన కూర్చున్నాడు.

"చెప్పమ్మా...! ఎందుకు సడన్‌గా వచ్చావు?" అని ప్రేమగా అడిగాడు.

"నాకు రాహుల్ ప్రవర్తన నచ్చడం లేదు డాడీ, అందుకే వచ్చేసాను" అంది

"పెళ్ళయి సంవత్సరం కూడా కాలేదు. చీటికీ మాటికీ గొడవ పడి ఇలా వచ్చేస్తే ఎలా?" సముదాయింపుగా అన్నాడు.

"నాకు అతను నచ్చినప్పుడు అతనితో ఎలా కలిసి ఉంటాను డాడీ?" అని చెప్పి లేచి వెళ్ళిపోయింది.

నిట్టూరుస్తూ మిగిలిపోయాడు పరశురాం !!!

........................

పాతికేళ్ళ క్రితం...

సుమతి, పరశురాంల పెళ్ళైన తర్వాత, ఒక రోజు పరశురాం తల్లి కాంతమ్మ వాళ్ళ కాపురం ఎలా ఉందో చూసిపోదామని సిటీకి వచ్చింది.

తల్లిని ఎంతో ప్రేమగా రిసీవ్ చేసుకున్నాడు పరశురాం. రైల్వే స్టేషన్ నుండి పొద్దున్నే తల్లిని తీసుకుని ఇంటికి వచ్చాడు.

అప్పటికి సుమతి ఇంకా నిద్ర లేవలేదు. తల్లిని ఫ్రెష్ అవమని చెప్పి ఈలోగా బ్రేక్ ఫాస్ట్ రడీ చేసేసాడు. అప్పటికి నెమ్మదిగా లేచింది సుమతి.

హాల్లో ఉన్న కాంతమ్మను చూసి " బాగున్నారా అత్తయ్యా" అని ప్రేమగా పలకరించింది.

"బాగున్నానమ్మా... నా సంగతి సరే కానీ ఇంత పొద్దెక్కేదాకా నిద్ర లేవకపోతే ఎలా?" అని గద్దించింది

"నాకు కొంచెం ఒంట్లో నలతగా ఉంది అత్తయ్యా" అని చెప్పి వాష్ రూంలోకి వెళ్ళిపోయింది, సుమతి.

"బాగుంది సంబడం" అని గొణుక్కుంది కాంతమ్మ.

ఇదంతా గమనిస్తున్న పరశురాంకి గుండెల్లో రాయి పడింది. తల్లి సంగతి అతనికి బాగా తెలుసు. ఏదీ వదిలిపెట్టే రకం కాదు.

కాసేపటి తర్వాత "అమ్మా, నువ్వు టిఫిన్ తిను. లంచ్ కూడా చేసి పెట్టాను. సాయంత్రం వస్తాము" అని చెప్పాడు.

సుమతి కూడా ఆఫీసుకు రడీ అయి సిద్ధంగా ఉన్న తన లంచ్ బాక్స్ బ్యాగ్‌లో పెట్టుకుంది.

ఇద్దరూ బైక్ మీద ఆఫీసుకు వెళ్లిపోయారు.

సాయంత్రం ఇంటికి వచ్చాక కూడా వంట సంగతి పరశురామే చూసుకున్నాడు. డిన్నర్ తిన్నాక బెడ్ రూంలో సెటిల్ అయింది సుమతి.

కాంతమ్మకు పరిస్థితి అర్థం అయింది. సుమతి ఇంట్లో ఏ పనీ చెయ్యదు. ఇటు పుల్ల తీసి అటు పెట్టదు. అన్ని పనులు కొడుకే చేస్తున్నాడు. ఆమె తల్లి మనసు తల్లడిల్లిపోయింది. ఆమెలోని పాతకాలపు స్త్రీ మనసు "ఇదెక్కడి చోద్యం అమ్మా.." అని బుగ్గలు నొక్కుకుంది.

అందుకే ఒక రోజు సుమతిని అడిగింది "ఏమ్మా... ఇంట్లో పనులన్నీ వాడే

చేస్తున్నాడు. నువ్వు చెయ్యవా? అని.

“నాకూ చెయ్యాలనే ఉంటుంది అత్తయ్యా...కానీ ఒంట్లో ఓపిక ఉండటం లేదు..ఏం చేస్తాను” నెమ్మదిగా సమాధానం చెప్పింది సుమతి.

“అవునా... బాగానే ఉంది.. వాడు ఆఫీసుకు వెళ్ళి అక్కడ పని చేసి వచ్చి ఇక్కడ కూడా ఇంటి పనీ వంటపనీ చెయ్యాలా? వాడికి మాత్రం ఓపిక సరిపోతుందా?” అంటూ లీగల్ పోయింట్ ఎత్తుకుంది కాంతమ్మ.

“నేను కూడా ఆఫీసుకు వెళ్ళి పని చేస్తున్నాను కదా...సమానంగా సంపాదిస్తున్నాను కదా అందుకే ఓపిక ఉండటం లేదు. అయినా ఆడవాళ్ళ సమస్యలు మీకు తెలీవా? అన్నీ చెప్పాలా?” అని తెలివిగా సమాధానం ఇచ్చి కాంతమ్మ నోరు మూయించింది సుమతి.

తర్వాత కాంతమ్మ ఊరు వెళుతూ “ఒరేయ్ పరసూ ...ఇలా తయారయ్యావేంట్రా?” ఆడంగి వెధవ. కొంచెం మగాడిలా ఉండు” అని తిట్టి రైలెక్కేసింది.

“హమ్మయ్యా... గాలివాన వెలిసింది” అని ఊపిరి పీల్చుకున్నాడు పరశురాం.

కొన్ని రోజులకి సుమతి ప్రెగ్నెంట్ అవడం, ఒక పండంటి ఆడబిడ్డకు జన్మనివ్వడం జరిగింది.

సుమతి నెలతప్పిన దగ్గర్నుండి ఆమెను హాస్పిటల్‌కు, ఆఫీసుకు తీసుకువెళ్ళడం, ఇంటి పని, వంట పని ఇలా అన్నీ దగ్గరుండి చూసుకున్నాడు పరశురాం.

డెలివరీ హాస్పిటల్‌లో అయింది. అప్పుడు కూడా సుమతి పక్కన అతనే ఉన్నాడు. అత్త మామలు రెండు రోజులకి వచ్చి వెళ్ళిపోయారు. కాంతమ్మ కూడా వచ్చి మనవరాలిని చూసి వెళ్ళిపోయింది.

అందరూ తమకు సంబంధం లేదని తప్పుకున్నారు. తర్వాత హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయింది సుమతి. తల్లీ బిడ్డను తీసుకుని ఇంటికి వచ్చాడు పరశురాం. ఇక అతనే వాళ్ళిద్దరికీ అన్నీ అయ్యాడు.

సుమతి ఆఫీసుకు సెలవు పెట్టింది కాబట్టి ఇంట్లోనే ఉండేది. పరశురాం మాత్రం తల్లీ బిడ్డకు అన్ని ఏర్పాట్లు చేసి ఆఫీసుకు వెళ్ళేవాడు.

అప్పుడే ఇక కుదరక అంట్లు తోమడానికి, బట్టలు పిండటానికి ఒక పనిమనిషిని పెట్టుకున్నాడు. అలా కిందా మీదా పడి ఆ బాలారిష్టాలన్నీ దాటేసారు ఇద్దరూ.

ఏదైనా ఫంక్షన్ జరిగితే చుట్టాలు వచ్చేవారు. వెంటనే వెళ్ళిపోయేవారు. తర్వాత ఇక మామూలే. హరితను జాగ్రత్తగా పెంచడమే అతనికి జీవితం అయిపోయింది. కాలం గిర్రున తిరిగి హరిత పెరిగి పెద్దయ్యాక ఆమె ఇష్టపడిన రాహుల్‌తో పెళ్ళి జరిపించి పంపించారు.

ఇన్నేళ్ళలో ఏనాడూ “ఇంటిపని చేయడం తనకు చితన్నతనం అని, తాను ఆడంగివాడిని” అని అనుకోలేదు పరశురాం.

“తన కుటుంబం కోసమే ప్రేమతో ఇవన్నీ చేస్తున్నా” అని అనుకునేవాడు. అందుకే ఇప్పటికీ అలానే ఉన్నాడు. సుమతి కూడా ఏమాత్రం మారకుండా భర్త చేత సేవలు చేయించుకుంటూనే ఉంది.

......................

నిన్న సాయంత్రం ...

రాహుల్ ఆఫీసు నుండి ఇంటికి వచ్చేటప్పటికి హరిత ఇంకా రాలేదు. ఫ్రెష్ అయి సెల్‌ఫోన్ చూసుకోవడంలో మునిగిపోయాడు రాహుల్.

> **“నేను కూడా ఆఫీసుకు వెళ్ళి పని చేస్తున్నాను కదా.. సమానంగా సంపాదిస్తున్నాను కదా! అందుకే ఓపిక ఉండటం లేదు. అయినా ఆడవాళ్ళ సమస్యలు మీకు తెలీవా? అన్నీ చెప్పాలా ?” అని తెలివిగా సమాధానం ఇచ్చి కాంతమ్మ నోరు మూయించింది సుమతి.**

కాసేపటి తర్వాత అలసిన మొహంతో ఇంటికి వచ్చింది హరిత. రాహుల్ ఆమె రావడం చూసి “హరీ! కొంచెం టీ పెట్టి ఇవ్వు” అని అడిగాడు.

చిర్రెత్తుకొచ్చింది హరితకు.

“ఇప్పుడేగా వచ్చాను. నువ్వు పెట్టొచ్చు కదా!” అని చెప్పింది సౌమ్యంగా.

“నేను ఇవ్వను ...నువ్వే పెట్టి ఇవ్వు” అని మొండికేసాడు రాహుల్.

ఒళ్ళు మండిపోయింది హరితకు.

“నేనే ఎందుకు పెట్టి ఇవ్వాలి?” కోపంగా అడిగింది.

“ఎందుకంటే నువ్వు ఆడదానివి కాబట్టి. ఇంటి పనీ, వంట పనీ నువ్వు చెయ్యాలి కాబట్టి” పొగరుగా అన్నాడు రాహుల్.

“ఓహో...ఆడవాళ్ళయితే ఈ పనులన్నీ చెయ్యాలి అని రూల్ ఉందా? మరి నేను కూడా నీతో సమానంగా వర్క్ చేస్తున్నాను కదా. సంపాదిస్తున్నాను కదా”

“అవును.. అందుకే కదా నిన్ను పెళ్ళి చేసుకున్నది” కేర్‌లెస్‌గా అన్నాడు, రాహుల్

“అంటే నేను నీకు సంపాదించి పెట్టాలి. అదీకాక ఇంటి పనులన్నీ చేసి పెట్టాలి. నువ్వు మాత్రం ఇంటిపని ఏమీ చెయ్యకుండా మహారాజులా కూర్చోవాలి. అంతేనా?” గట్టిగా అంది హరిత.

“అవును...! మగాడు సంపాదించాలి. ఆడది ఇంటి పని చెయ్యాలి. అంతే!”

“మరి నా సంపాదన ఎందుకు కావాలి నీకు?”

“మనం బాగా బతకాలి అంటే ఇద్దరం జాబ్ చెయ్యాలి కాబట్టి. బాగా సంపాదించాలి కాబట్టి. అయినా ఈ రోజుల్లో ఇవన్నీ మామూలే.

నువ్వేదో జాబ్ చేస్తున్నాను కదా అని ఇంటి పనులు చెయ్యనంటే మాత్రం కుదరదు” స్థిరంగా చెప్పాడు రాహుల్.

“ఎందుకు కుదరదు? ఏం మా నాన్న గారు కూడా జాబ్ చేస్తున్నారు. అలాగే ఇంటి పనులు కూడా చూసుకుంటారు” గర్వంగా చెప్పింది

“అవును...! అందుకే ఆయన్ని అందరూ ఆడంగి వెధవ అంటారు” అని నోరు జారాడు రాహుల్.

దెబ్బ తిన్న పక్షిలా విలవిల్లాడి పోయింది హరిత. తండ్రిని అంత మాట అనేసరికి పిచ్చి కోపంతో అతని చెంప ఛెళ్ళుమనిపించింది.

నిశ్చేష్టుడయ్యాడు రాహుల్. ఆమె జుట్టు పట్టుకుని “నన్నే కొడతావా నువ్వు. ఎంత ధైర్యం నీకు? పో.. బయటకి ఎందుకూ పనికిరాని నువ్వు నాకు అక్కర్లేదు” అని ఆవేశంతో అరవసాగాడు.

కన్నీళ్ళు పెట్టుకుంటూ వ్వు కూడా నాకు అక్కర్లేదు” అని చెప్పి అక్కడి నుండి పుట్టింటికి వచ్చేసింది హరిత.

......................

“హరితా!” తల్లి పిలుపుతో తలెత్తి

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

చూసి సెల్‌ఫోన్ పక్కన పెట్టింది.

"చెప్పమ్మా" అంది నెమ్మదిగా .

"జరిగింది నాకు అర్థం అయింది. నువ్వు తొందరపడ్డావు అమ్మా"

"అవును.. నేనే తొందరపడ్డాను. నోటికొచ్చినట్టు అతను నాన్నని ఆడంగి వాడు అంటే పడి ఉండాలా? అన్ని పనులు నన్నే చెయ్యమని బలవంతం చేస్తుంటే చూస్తూ ఊరుకోవాలా?" కోపంగా అంది హరిత.

"కోపం తగ్గించుకో! సంసారం అన్నాక సర్దుకుపోవాలి. అసలు మీ నాన్నగారు ఇప్పుడు ఇన్ని పనులు చేస్తున్నారని మీరంతా అంటున్నారు. మా పెళ్ళయిన తొలిరోజుల్లో ఆయన ఎలా ఉండేవారో మీకు తెలీదు" అని ఆగి మళ్ళీ చెప్పసాగింది సుమతి.

"పెళ్ళయిన కొత్తలో సుమతి ఒకసారి "ఏమండీ స్టౌవ్ మీద రైస్ పెట్టండి" అని చెప్పింది.

ఆ మాట విని పరశురాం కిచెన్‌లోకి వెళ్ళి స్టౌ మీద రైస్ పెట్టి వచ్చాడు. పావు గంట తర్వాత "పదండీ.. అన్నం తిందాం" అంది సుమతి.

"అదేంటి అన్నం ఇంకా అవలేదు కదా!" ఆశ్చర్యపోతూ అన్నాడు పరశురాం.

"ఇందాక మీరు కిచెన్‌లోకి వెళ్ళారు కదా. రైస్ పెట్టలేదా?" అంటూ కిచెన్‌లోకి వెళ్ళి నోరు వెళ్ళబెట్టింది సుమతి.

ఒక గిన్నెలో రైస్ పోసి స్టౌవ్ మీద పెట్టాడు పరశురాం. సుమతి వచ్చి అన్నం వండుతుంది అని అనుకున్నాడు. అందులో నీళ్ళు పోసి స్టౌవ్ వెలిగించాలి అన్న మినిమం సంగతి కూడా అతనికి తెలీదు. అతనికి వంట అసలు రాదు. చిన్నప్పటి నుండీ హాస్టల్స్‌లో చదువుకోవడం వల్ల వంటగదిలోకి వెళ్ళాల్సిన అవసరం రాలేదు ఎప్పుడూ.

హాస్టల్ మెస్‌లో తింటూ గడిపేసాడు. అతని తల్లి కాంతమ్మ కూడా మగపిల్లాడు కదా అని ఎప్పుడూ వంట పనులు చెప్పలేదు. నిజానికి ఆ అవసరం ఎప్పుడూ రాలేదు. ఇంకోసారి సుమతి "స్టౌ మీద కడాయిలో దొండకాయ వేపుడు ఉంది. కొంచెం వేడి చెయ్యండి" అని చెప్పింది తను స్నానానికి వెళుతూ.

ఆమె స్నానం నుండి తిరిగి వచ్చేటప్పటికి మాడు వాసన

వస్తోంది ఇల్లంతా. గబ గబా కిచెన్‌లోకి పరుగెత్తి స్టౌ ఆపేసింది. స్టౌ ఫ్లేమ్ 'హై'లో పెట్టి అలా చూస్తున్నాడు పరశురాం. ఆ తర్వాత అతనికి వంటగది పనులు చెప్పలేదు సుమతి.

కానీ ఒక దురదృష్ట క్షణాన, బండి మీద ఆఫీసుకు వెళ్తున్న సుమతికి ఏక్సిడెంట్ అయింది. కాలు ఫ్రాక్చర్ అయి బెడ్ మీద ఉండాల్సిన పరిస్థితి. సహాయానికి ఎవరూ రాలేదు. ఆ రోజుల్లో బయట నుండి ఫుడ్ తెప్పించుకునే అవకాశం లేదు కదా. అందుకే ఇక తప్పనిసరి పరిస్థితిలో గరిట పట్టాల్సిన అవసరం వచ్చింది పరశురాంకి.

**"ఇందాక మీరు కిచెన్‌లోకి వెళ్ళారు కదా. రైస్ పెట్టలేదా ?" అంటూ కిచెన్‌లోకి వెళ్ళి నోరు వెళ్ళబెట్టింది సుమతి.**

సుమతి చెబుతుంటే నెమ్మదిగా వంట నేర్చుకున్నాడు. అప్పటి నుండి ఆమెకు కమ్మగా వండి పెట్టేవాడు. కొన్ని రోజుల్లో సుమతి కోలుకుంది. కానీ పరశురాం వంట అలవాటు మానలేదు. సుమతికి కూడా అది సుఖంగా అనిపించడంతో అలాగే కంటిన్యూ చేసారు.

సుమతికి కాళ్ళ నొప్పుల సమస్య వచ్చింది. ఆమెకు నిద్ర పట్టేది కాదు. అందుకే రాత్రిళ్ళు నిద్రపోయే ముందు సుమతికి కాళ్ళు నొక్కేవాడు పరశురాం. అలా ఆమె ఎప్పటికో నిద్రలోకి జారుకునేది. దానివల్ల పొద్దున్న తొందరగా లేవడం కష్టం అయ్యేది సుమతికి.

ఇవన్నీ అర్థం చేసుకున్నాడు పరశురాం. ఇలాంటివన్నీ చూసి చుట్టాలు పరశురాం మీద 'ఆడంగి మొగుడు'ని ముద్ర వేసారు.

ఇవేవీ పట్టించుకునేవాడు కాదు పరశురాం. అయితే ఈ సంగతి ఎలా ఉన్నా మిగతా ఇంటి విషయాల్లో మాత్రం సుమతి ఏక్టివ్‌గా ఉండేది. ఇంటిని ఆర్థికంగా నడిపించడం, కూతురిని బాగా చదివించడం లాంటి బాధ్యతలు తనే తీసుకుంది. ఈ విధమైన ఎడ్జస్ట్‌మెంట్‌తో సంసార రథాన్ని లాగించేసారు ఇద్దరూ".

తల్లి చెప్పింది విని ఆశ్చర్యపోయింది హరిత. తండ్రి తన భార్య కోసం మారిన విధానం ఆమెకు నచ్చింది. తను ఇప్పుడు చూస్తున్నది పెళ్ళి తర్వాత మారిన తండ్రి అని తెలుసుకుని కొత్తగా ఫీల్ అయింది.

"భర్తను తనకు అనుగుణంగా మార్చుకునే బాధ్యత భార్య మీదే ఉంటుంది. ఏ మగాడూ సంసారానికి పూర్తిగా సిద్ధపడి పెళ్ళి చేసుకోడు. పొందబోయే సుఖాన్ని ఊహించుకుని చేసుకుంటాడు. కానీ బాధ్యత అనే వాస్తవం ఎదురయ్యేసరికి కోపంతో ఊగిపోతాడు. మనమే నెమ్మదిగా చెప్పి ఓపిగ్గా అతన్ని మార్చుకోవాలి. నేనే గొప్ప అన్న అహాన్ని వదులుకుని ఒకరికొకరు సాయం చేసుకుంటే సంసార నౌక హాయిగా సాగిపోతుంది. అర్థం చేసుకో!" అని చెప్పింది

సుమతి. సాలోచనగా తల పంకించింది హరిత.

.................

సాయంత్రం వర్క్ పూర్తి చేసుకుని ఆఫీసు బయటకు వచ్చిన రాహుల్, పార్కింగ్ ప్లేస్‌లో వెయిట్ చేస్తున్న మామగారిని చూసి కంగారు పడ్డాడు.

"నమస్కారమండీ" అని విష్ చేసాడు.

"నమస్కారం.... రా... అలా కేంటీన్‌కి వెళ్ళి మాట్లాడుకుందాం" అని రాహుల్ భుజం మీద చెయ్య వేసి తీసుకువెళ్ళాడు పరశురాం.

టీ ఆర్డరిచ్చి కూర్చున్నాక "ఎందుకు బాబూ అంత తొందరపడ్డావు?" అని అడిగాడు.

"సారీ అండీ! కోపాన్ని కంట్రోల్ చేసుకోలేకపోయాను" నెమ్మదిగా చెప్పాడు రాహుల్.

"ఓకే ..అది మానవ సహజం. పైగా వయసులో ఉన్న కుర్రాడివి. ఆవేశం ఎక్కువ ఉంటుంది కదా!" అని నవ్వాడు పరశురాం.

ఈ సంభాషణతో ఇద్దరి మధ్య ఉన్న ఇనప తెర తొలగిపోయింది. టీ సిప్ చెయ్యసాగారు.

పరశురాం చెప్పాడు.. "చూడు బాబూ...పెళ్ళికి ముందు నేను కూడా నీలాగే ఉండేవాడిని. కానీ పెళ్ళయ్యాక మారక తప్పలేదు. ఎందుకంటే నేను నా భార్యతో సంసార జీవితాన్ని కోరుకున్నాను కాబట్టి. వివాహ బంధానికి విలువ ఇచ్చాను కాబట్టి. విడిపోవడం ఎంతసేపు? చిటికెలో పని. కలిసి ఉండటమే కష్టం కదా. దానికి చాలా సహనం కావాలి. జీవిత భాగస్వామిని అర్థం చేసుకోవాలి" అని చెప్పాడు.

ఎంత ప్రయత్నించినా మీ అమ్మాయిలో మార్పు రాలేదండీ. అందుకే కొంచెం బేలెన్స్ అవుట్ అయ్యాను" అని ఒప్పుకున్నాడు రాహుల్.

"అవును బాబూ! హరిత చిన్నప్పటి నుండీ గారాబంగా పెరిగింది. ఏ పనీ చేసేది కాదు. చదువు మీదే దృష్టి

పెట్టింది. పైగా ఇంట్లో నన్ను చూసి భర్తలందరూ అలాగే ఉంటారని ఊహించుకుంది. కానీ అది నిజం కాదు కదా. ఒక్కొక్కరి ఇంట్లో ఒక్కోలా ఉంటుంది పరిస్థితి. ఆ విషయం తెలీక నీ మీద తిరగబడింది. దయచేసి అర్థం చేసుకో" అని బేలగా చూసాడు పరశురాం.

"అయ్యో... అలా అనకండి. తనకి ఎలా నచ్చజెప్పాలో తెలీక బరస్ట్ అయ్యాను" చెప్పాడు రాహుల్.

"ఓకే..! అదేమీ పెద్ద బ్రహ్మ విద్య కాదులే. మీరిద్దరూ అన్ని పనుల్లో ఒకరికి ఒకరు సాయం చేసుకోవాలి. ముఖ్యంగా నేను గొప్ప అనే అహాన్ని వదిలేయాలి. అప్పుడే మీ లైఫ్ హేపీగా ఉంటుంది. అంతకు మించి సీక్రెట్ ఏమీ లేదు" అని ముగించాడు పరశురాం.

రిలీఫ్‌గా నవ్వాడు రాహుల్ !!!

.....................

తండ్రితో వస్తున్న భర్త రాహుల్‌ని చూడగానే మదిలో కోటి వీణలు మోగాయి హారితకు. విరహ వేదనతో అల్లాడిన ఆమెకు రాహుల్ రాక మలయ మారుతంలా చల్లగా తగిలింది. ఆమె మది పులకించింది. అయినా బయటపడకుండా బెడ్ రూంలోనే ఉండిపోయింది.

అల్లుడి రాకతో సంతోషపడింది సుమతి.

"హరి ఎక్కడ అండీ?" అంటూ బెడ్ రూం వైపు వెళ్ళాడు రాహుల్ అలవాటుగా. తర్వాత ఆ బెడ్ రూం డోర్ మూసుకుపోయింది. మూసుకున్న ఆ తలుపుల వెనక వారి కౌగిలిలో గాలి సిగ్గుతో నలిగిపోయింది. వారి మధ్య ఎన్నో మౌన ఊసులు నిశ్శబ్దంగా అల్లరి చేయసాగాయి.

బయట హాల్లో కూర్చున్న పరశురాం, సుమతి గుంభనంగా నవ్వుకున్నారు.

"ఈ రోజుల్లో అమ్మాయిలూ, అబ్బాయిలూ పెళ్ళికి ముందు ఎంతో కాలం వెయిట్ చేసి, ఎదుటి వారిలో అందం చందం, ఉద్యోగం సజ్జోగం అన్నీ బాగా నచ్చినాకే పెళ్ళికి ఒప్పుకుంటున్నారు.

కానీ తీరా పెళ్ళయ్యాక ఏ చిన్న గొడవ వచ్చినా "మేమెందుకు కలిసి ఉండాలి. మాకేం తక్కువ? పార్ట్‌నర్‌ని వదిలేస్తే పోలా!" అని తేలిగ్గా అనుకుంటున్నారు. పచ్చటి వివాహ జీవితాన్ని భగ్గుమని మండిస్తున్నారు. కానీ తాము వదలాలినసంది తమలోని అహాన్ని అని తెలుసుకోలేకపోతున్నారు. అందుకే "వదిలేస్తే పోలా" అని అనుకోకండి. అయితే అలా వదిలేది అహాన్ని మాత్రమే అని తెలుసుకోండి!!"

పరశురాం, సుమతిల గుంభనపు నవ్వుకు అర్థం ఇదే మరి!!!!

---

## వయసు చెప్పకూడదా?

**"స్త్రీ తన నిజమైన వయస్సు చెప్పవచ్చా? చెప్పకూడదా" అని నలుగురు బ్రిటీష్ ప్రముఖులను ఓ ప్రముఖ పత్రిక అడిగింది.**

"నిజం వయస్సే చెప్పా" లని ముగ్గురు మహిళలు చెప్తే ఒకరు మాత్రం "చెప్పక్కర్లే"దన్నారు. అలా చెప్పిన ఆ మహిళ మరెవరో కాదు... ప్రముఖ రచయిత్రి బార్బరా కార్ట్ లాండ్.

"ఓ మహిళ తన నిజమైన వయస్సుని చెప్పడం మహా తప్పు. వందల సంవత్సరాలుగా మహిళలు తమ అసలు వయస్సు కన్నా తక్కువ వయస్సునే చెప్తూ వస్తున్నారు. నిజమైన వయస్సు చెప్పినా ప్రపంచం దానినెట్లాగూ నమ్మదు. మీరు ముప్పై అని చెప్పినా దానికి మరో అయిదేళ్ళు కలిపి ముప్పై అయిదు అనే అనుకుంటుంది లోకం. కనుక నిజమైన వయస్సులోంచి ఓ అయిదేళ్ళు తగ్గించి చెప్పడం తప్పేమీ కాదు" అని ఆమె అన్నారు.

బార్బరా కార్ట్ లాండ్ 1901 జులై తొమ్మిదో తేదీన జన్మించారు. ఆమె తల్లిదండ్రులకు ఆమె ఒక్కతే సంతానం. ఆమె పూర్తి పేరు డేమ్ మేరీ బార్బరా హామిల్టన్ కార్ట్ లాండ్. ఆమె 98 యేళ్ళు జీవించారు.

ఆమె మొత్తం మీద 723 నవలలు రాశారు. ఆమె రాసిన పుస్తకాలన్నీ

> **నిజమైన వయస్సు చెప్పినా ప్రపంచం దానినెట్లాగూ నమ్మదు. మీరు ముప్పై అని చెప్పినా దానికి మరో అయిదేళ్ళు కలిపి ముప్పై అయిదు అనే అనుకుంటుంది లోకం. కనుక నిజమైన వయస్సులోంచి ఓ అయిదేళ్ళు తగ్గించి చెప్పడం తప్పేమీ కాదు"**

కలిపి మొత్తం మీద 750 మిలియన్ కాపీలకు పైగా అమ్ముడుపోయాయి. ఆమె ఎక్కువగా రొమాంటిక్ నవలలే రాశారు. ఒక్క ఏడాదిలో ఎక్కువ పుస్తకాలు అచ్చయిన రచయిత్రిగా ఆమె పేరు గిన్నిస్ రికార్డు పుటలకెక్కింది. 1977లో ఆమె రాసిన పుస్తకాలలో ఏకంగా 191 పుస్తకాలు అచ్చయ్యాయి. ఆమె రాసిన నవలల్లో చాలా వరకు సినిమాలుగా తీసి బుల్లితెరపై ప్రసారం చేశారు. వాటిలో A Hazard of Hearts and Duel of Hearts అనే దానికి విశేష ఆదరణ లభించింది.

ఆమె రోమాంటిక్ నవలలే కాకుండా జీవితచరిత్రలు, నాటకాలు, సంగీతం, ఆరోగ్యం, వంటల పుస్తకాలు కూడా రాశారు. ఆమె రాసిన వ్యాసాలనేక వివిధ పత్రికలలో వచ్చాయి. తన తల్లి గురించి ఇయాన్ మాట్లాడుతూ రోజుకు ఎనిమిది వేల పదాలు రాస్తుండే వారన్నాడు.

ఆమె తండ్రి బ్రిటీష్ ఆర్మీ అధికారి. ఆయన మొదటి ప్రపంచ యుద్ధంలో మరణించారు. ఆమె తల్లి కుటుంబ అవసరాల కోసం ఒక దుకాణాన్ని నడిపారు. బార్బరా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత సొసైటీ రిపోర్టర్, రొమాంటిక్ నవలల రచయిత్రిగా మారారు. డైలీ ఎక్స్‌ప్రెస్‌లో గాసిప్ కాలమిస్ట్‌గా పని చేసిన తర్వాత, ఆమె మొదటి నవల 1923లో ప్రచురితమైంది.

రచనతో పాటు ఆమె అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనేవారు. ఆమె వృద్ధుల కోసం స్వచ్ఛందంగా కొన్ని సేవా కార్యక్రమాలు చేయడం విశేషం. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో, ఆమె వేలాదిమందికి అండగా నిలిచారు.


1960వ దశకంలో, జిప్సీల హక్కుల కోసం ప్రచారం చేసిన ఆమె కృషితో పార్లమెంటులో ఒక చట్టం ఆమోదించడం విశేషం. ఆమె జిప్సీలకోసం ప్రత్యేకించి ఓ శిబిరాన్ని తన సొంత ఇంటి సమీపంలో నిర్వహించారు. కొంతకాలం అనారోగ్యంతో బాధపడి 2000 మే 21 మరణించారు.

16.8.2026 ఆదివారం అనుబంధం

సూర్య

## ఈ వారం కథ

# నాన్న చెప్పిన గీత



గో[illegible] ా
వ[illegible] టి
గంటన్నర య్యింది. ఇదంతా గమనిస్తూన ఉన్న భార్య రుక్మిణి
" ఏమిటి? ఆలోచిస్తున్నారు? వేడిగా ఏమైనా తాగుతారా? "
వద్దు.ఏమీ ఆలోచించడం లేదు. ఎందుకో నాలుగైదు రోజులు నుండి నిద్ర పట్టడంలేదు. ఏ తెల్లవారుజాము నో పడుతోంది రుక్కూ! నువ్వు పడుకో"! అంటూ మంచం దిగి ,వాలుకుర్చీలో నడుంవాల్చాడు.చూస్తూ ఉండగానే ,ఐదైయినట్టుంది.ప్రక్కవీధిలోని రామాల యం నుండి సుప్రభాతసేవ మైకులో వినపడు తోంది.దాదాపు వారం పది రోజుల నుండి జరుగుతున్న ఈ విషయం అత్త రుక్కు, కోడలు విష్ణుప్రియ చెవిని ఏ మాటలమధ్యలో వేసిందో ఏమో ,ఓ రోజు ఆఫీస్ నుండి వచ్చిన గోపాలంగారబ్బాయి ,తండ్రి ప్రక్కన కూర్చొని " ఏంటి?! నాన్నా నీకు నిద్ర ఎందుకు పట్టడం లేదు? ఏవిషయాలనుగురించి ఆలోచించకు.అయినా నీకు ఏ బర్నింగ్ ప్రోబ్లమ్స్ ఉన్నాయి?

కనుక. లేక పోతే రేపు శనివారం డాక్టర్ మాధవి ని కలుద్దామా? అడగ్గానే ," అదేంలేదు. డాక్టర్ మన ఇంట్లోనే ఉందిగా.ఆ మాత్రం వైద్యం విష్ణు హెమియో లో ఇవ్వగలదుకదా! " ప్చ్! అవును కదా.అంటే నువ్వు ఇంగ్లీషు వైద్యం కావాలని అనుకొం టున్నావేమోనని. విష్ణూ!అంటూ భార్యను పిలచి ,మానాన్న కు నిద్ర పట్టడానికి మందు ఇయ్యి!" అంటూ చెప్పి ,కుశలం ,మిగిలిన విషయాలు ,మాట్లాడి స్నానానికి వెడతాను అంటూ ,లేచాడు.రాత్రికి కోడలు ఇచ్చిన మందు వేసుకోవడం మొద లెట్టారు. ఇలా కొద్దిరోజులు జరిగినా ,ఓ ఆదివారం మధ్యాహ్నం భోజనాలు సమయం లో " నాన్నా! నువ్వు బామ్మను ఓ సారి చూసి వస్తే నీకు, బామ్మకు మనసు కుదుట పడుతుంది సుమా! " అదేంలేదు కాని ,వీలుంటే మనమంతా వెళ్ళి వద్దాం ఓ సారి."

* * * * * *

అనుకన్నట్టుగానే ,అందరూ కలసి గోపాలం గారి ఊరొచ్చారు. వాళ్ళమ్మగారు కాంతమ్మ వాళ్ళాయన కట్టిన ఇంట్లోనే ఒక వాటాలో ఉంటూ కాలక్షేపం చేస్తోంది. మరోవాటాలో తెలుసున్న వారే ఉంటున్నారు. వీళ్ళం దరూ రాగానే సంతోషించింది.ఎక్కడా లేని హుషారు వచ్చింది. సాయంత్రం ఇక బయ లుదేరే ముందు –గోపాలంగారు " అమ్మా! ఈ వయస్సు లో.నువ్వు ఒక్కదానివే ఉ ండడం సమస్యలు వస్తాయి.ఇల్లు కట్టిన నాన్నే లేనప్పుడు ,ఈ ఇల్లు ఏం చేస్తుంది? ఎక్కడ ఉంటే వద్దంటుంది? అనగానే ,కాంతమ్మ గారు మాట్లాడుతూ " నేనూ వచ్చేస్తే ఇల్లు పాడైపోతుంది.నాకు చీటికీ మాటికీ సహాయం ప్రక్క వాళ్ళు చేస్తూనేఉన్నారు. మీరేంకంగారు పడకండి. అలా కాదమ్మా!మా బాధ కూడా నువ్వు ఆలోచించాలి.మన బంధువు లు ,తెలుసున్న మిత్రులు ,అందరూ ఏమనుకుంటు న్నారో తెలుసా? ముసలిదాన్ని ఒక్కత్తినే వదిలేశారు.అని అనుకొంటున్నారు. ప్చ్! అలాగని మేమూ అక్కడా ఏమీ ఆనందంగా ఉండలేము.నీ ధ్యాస ఉంటుంది కదా! " అనగానే " మీరేమీ కంగారు పడకం డి. అస్తమానువచ్చి చూస్తూనే ఉన్నారు. " అని ధైర్య వచనాలు చెప్పింది . ఇక బయలు దేరే ముందు నీ
గురించి రాఘవ తోటి ,పల్లవితోటి మాట్లాడి ఒక మంచి నిర్ణయం తీసుకొంటాను. అన్నాడు.
ప్రొద్దుపోతోందని ,మళ్ళీ తొందరగా వస్తామని చెప్పి వెళ్ళిపోయారు.

*** *** ***

గోపాలం గారు తమ్ముడు రాఘవ తోటి ,చెల్లెలు పల్లవి తో మాట్లాడి ,అమ్మను ఇక ఆ ఇంట్లో ఒక్కదాన్నే ఉంచడం మంచిది కాదని ,ఒకసారి స్నానం చేసి వస్తుంటే జారి పడిందని ,ఏమీ దెబ్బలుతగల్లేదని ,ఇంట్లో ప్రక్క వాటాలో ఉంటున్న వారు చెప్పిన విషయాన్ని, చెప్పాడు. ఏదో నాన్న కట్టిన ఇంట్లోనే ఉండాలనే మూర్ఖత్వం వదలాలని చెప్పినట్లు తెలిపాడు. గోపాలం దగ్గర కొన్నాళ్లు ఉంచుకొని ,తర్వాత రాఘవ తీసుకు వెడతానన్నాడు. ఆ వయస్సు ల్లో వైద్య సదుపాయాలు ముఖ్యం కూడాను అంటూ ఒక నిర్ణయానికి వచ్చి ,వచ్చే ఆదివారం ఏకాదశి రోజు న తీసుకు వెళ్ళడానికి ,అం దుకు.రాఘవ కూడా వస్తే బాగుంటుందని తన అన్న సలహా మేరకు వస్తాననితెలిపాడు.

ఆ ఆదివారం అందరూ వచ్చారు. వాళ్ళమ్మ కాంతమ్మ గారూ బట్టలు సర్దుకొంది సాయంత్రం బయలుదేరి కారు ఎక్కిన కాంతమ్మ గారు , ఇప్పుడే వస్తాను ,అంటూ దిగి, ఇంటి్లోకి వెళ్ళబోయింది. ఇంటి కి తాళంవేస్తు న్న గోపాలం ," ఎందుకు ? మళ్ళీ లోపలికి?అంటే ,బదులు ఇవ్వకుండానే ,లోపలికి వెళ్ళి ,బీరువా తెరచి ,ఏదో ఒక కవరు బట్టలక్రింద నుండి తీసి,లేవబోతుంటేపడిపోయింది. అందరూ కంగా రు పడి ,ఆమెను దగ్గర్లోని హాస్పిటల్ కు తీసుకెళ్ళారు. కాసేపటికి డాక్టరు వచ్చి ,బ్రెయిన్ హెమరేజ్ వచ్చింది. ఆమె ఇక లేరని తెలిపారు. ఒక్కసారిగా వాతావరణం లో ఎంతమార్పు. అందరూ విచారంతో ఉన్నారు.

తల్లికి ఇష్టమైన ఆ ఇంట్లోనే ఉండి కర్మకాండలు పూర్తి చేసారు. ఇక రేపు అందరూ బయలుదేరి ఎవరి ఊరు వాళ్ళు వెళ్ళడానికి సిద్ధపడుతున్నారు. ఆ సమయంలో ," రాఘవా! ఆరోజు అమ్మ చేతిలో కవర్లు నీకు ఇచ్చాను కదా ! ఎక్కడ పెట్టావు?పట్టుకురా.ఆ కవరు ఏమిటో చూద్దాం! అన్న అన్న గారి మాటలకు " ఇక్కడే కప్ బోర్డు లో పెట్టానని చెప్పి తీసి ఇచ్చాడు.

గోపాలంగారు కవరులోని కాగితాలు బయటకు తీసి చూసి ,"ఇది నాన్న స్వహస్తాలతో రాసిన దర్రా ! దీనికో హెడ్డింగ్ పెట్టారు. అదే "నాన్న చెప్పిన గీత." గోపాలం పైకి చదవడం మొదలుపెట్టారు..

" ఇదొక వీలునామా అనుకొంటారేమో? ఆస్థిపాస్థులు ఉన్న వాళ్ళైయితే ,పిల్లలలో అపార్ధాలకు ,అనర్ధాలకు దారితీయకుండా ,వీలునామా రాస్తారు. మనిషికి ఆస్థిపాస్థులు కంటె నైతికవిలువలు పిల్లలుకు ఇవ్వగలిగితే ,బందాలను నిలుపుకొంటూ, ఆనందదాయకమైన ,సుఖసంతోషాలతో జీవించగలుగుతారనేది నావిశ్వాసం. నా అభిమతం. అందుకే మేము బిడ్డలకు నైతికవిలువలు నేర్పాము. ఒకవేళ పెద్దవాళ్ళు అయిన తదుపరి ఏదైనా సందర్భంలో " మా నాన్న మాకు ఆస్థి ఏమీ ఇవ్వలేదు. ఇదంతా నా రెక్కల కష్టంమీదే సంపాదించుకొన్నదే! " అనే భావన వస్తుంది. వచ్చితీరుతుంది కూడా . అప్పుడు నీ ఆంతరాత్మ ను నీవు ప్రశ్నించుకో " నేను ఇదంతా ధర్మంగా సంపాదించుకొన్నదేనా? నేను ఎలా జీవించగలుగుతున్నాను? బంధువులు ,స్నేహితులు ,అందరితో ఏవిధంగా మన గలుగుతున్నానని ". అపుడు నీ అంతరాత్మ నువ్వు అడిగిన వాటికన్నిటికీ " పోజిటివ్ " గానే స్పందిస్తుంది. ఎందువల్లో ఆలోచించే సమయం ఇదే.నీలో నాటు కొన్న నైతిక విలువల వల్లనే అని అర్థమవుతుంది.

మేము మా పిల్లలకు నేర్పిన నైతికవిలువలు నే ,వాళ్ళు వారి పిల్లలకు నేర్పాలనే ,ఆకాంక్షతో రాస్తున్నా ఈ నా సందేశం అనండి.మరో గీతోపదేశం అనండి

మగ పిల్లలిద్దరూ ఉద్యోగరీత్యా దూరంగా ఉంటున్నా రు. అమ్మాయి కి వివాహంచేసి అత్తారింటికి పంపినా ఆమెకూడా తన పిల్లలు కు మోరల్ వాల్యూస్ తెలపాలనే ఉద్దేశ్యం. మన సంస్కృతి కి ధర్మానికి ఆదర్శప్రాయంగా ఇతిహాసాలే అన్న నగ్న సత్యం మీకు తెలుసు.

కాని , వృత్తి ధర్మం లోను , కాలానుగుణంగా వచ్చే మార్పులుతోను,మీలో కూడా మార్పు చేసుకోవచ్చు. అపుడు క్రమక్రమేపి ,మన లక్ష్య సాధప మరచి , అనైతికంగా నడవడం, బంధాలు దూరం చేసుకోవడం జరుగుతాయి.

మీరు జీవించేది నగరాల్లో. అప్పుడు అక్కడ సంస్కృతికి, గ్రామీణ ప్రాంత సంస్కృతి కి వ్యత్యాసం ఉంటుంది. అయిన మన కట్టుబాట్లు , సంస్కృతి ని వదవకుండా పిల్లలు ను నడిపించాలి. ముందు మనం మన ప్రవర్తన మంచి గా ఉండేటట్లు చూసుకొంటే , పిల్లలు అనుసరిస్తారు.ధర్మ బద్ధమైన జీవితాన్ని గడపండి. పాండవులు కు ఎన్ని కష్టాలు వచ్చినా ,ధర్మరాజు నియమంగా ధర్మం అనుసరించడం వల్లనే ప్రశంసించ బడుతున్నాడు.

కురుక్షేత్ర యుద్ధం లో జయం పొందాడు. వేదం చెపుతున్నది కూడా " ధర్మో రక్షిత రక్షితః " అని. మనం ధర్మాన్ని కాపాడగలిగితే ,ఆ ధర్మమే మనలను రక్షింస్తుందని. ధర్మం వల్ల సత్యవచనమే పలుకుతారు. ఆ సత్యవచనం వల్ల ,సంపద ,కీర్తి ,వస్తాయి. మనసుకు నిర్మలత్వం వస్తుంది. మానవత్వం వికసిస్తుంది. మంచి –చెడు తెలుస్తుంది. మనిషి లో ఔన్నత్యం వస్తుంది. మీరు అనుకోవచ్చు" మా పిల్లలను ఎలా పెంచాలో? ఆ మాత్రం ఎవరికి తెలియదు" అని.మొక్కను పెంచాలంటే ,ఎంతో జాగ్రత్తలు తీసుకోవాలి రక్షణ ఏర్పాటు, నీటి ఒనరులు ఏర్పాటు చేస్తూ ఉంటే వృక్షమై ఫలాలను అందిస్తుంది. మొక్కగా ఉన్నప్ప టి నుండి పెంచిన వ్యక్తి ఆ ఫలాలు చూస్తే వచ్చిన ఆనందం ఎవరికీ వర్ణించ సాధ్యంకాదు. అలాగే నైతికత తో పెరిగిన పిల్లలు అభివృద్ధి లోకి వస్తే తల్లిదండ్రులు కు ,గురువులకు, అంతకంటే సంతో షం ఏమి ఉం టుంది? అదే సంతోషం, ఆనందం మేము అంటే ముఖ్యంగా మీ అమ్మ ,నేను, అనుభవించాము. మిమ్మల్ని ఎప్పుడూ పొగడలేదు. కారణం మీకు తెలుసు. ఎందుకంటే మీ అమ్మ, బామ్మ చెప్పిన కథలు వల్ల . మీరు మీ పిల్లలకు ఆస్తి పాస్తులు కంటే ముందుగా నైతిక విలువలు నేర్పండి. తరువాత సంపదను వాళ్ళే సంపాదిస్తారు. అయినా నా ఉద్దేశ్యం లో మనిషి కీ మంచి నడత కంటే సంపద ఏమిటి? మీరు ఆలోచించి ,భవిష్యత్తు ఆనందంగా, సంతోషంగా ఉం డే టట్లు తీర్చిదిద్దుకొంటారని ఆశిస్తున్నాను.

కురుక్షేత్రంలో శ్రీ కృష్ణ పరమాత్మ అర్జునునికి జ్ఞానబోధ కర్తవ్యం గురించి తెలియచేసిన విధంగా ,ఒక మధ్య తరగతి తండ్రి గా ,నేను మీకు ఇచ్చే గీత ఇదే. మీ అమ్మ ను జాగ్రత్తగా చూసుకొంటారని తెలుసు. కానీ, నలభై సం.రాలు పైబడి నాతో కలిసి కష్టసుఖాలు లో పాలు పంచుకొన్న ఆమె గురించి నేను మిమ్మల్ని జాగ్రత్తగా చూసుకోండి అని చెప్పడం నా కర్తవ్యం. నా ధర్మం.

మీ నాన్న.తండ్రి రాసిన గీత ప్రతిని తిరిగి కవర్లో పెట్టే " రాఘవా!ఇందులో విషయం చాలా చిన్నది గా కనిపిస్తుంది. కానీ, బాగా లోతుగా ఆలోచిస్తే ఒక తండ్రి ఆవేదన తండ్రి సంతోషం, కనపడతాయి. దానికి బీజాలు వారి పిల్లలే. అందరికీ ఉపయోగ పడే ఈ ప్రతిని నాన్న కర్మ కాండ పూర్తి అయినతదుపరి , వచ్చిన వారంద రికీ పంచాలి. ఆఏర్పాటు చేయి. అంతేకాదు ఈ గీతా సందేశాన్ని లామినేషను చేయించు.అని చెప్పారు గోపాలం గారు.

**అనంతాత్మకుల రంగారావు. 7989462679.**

### కనిపించకుండా పోయిన వస్తువుల్ని చిటికెలో పట్టేస్తుంది..

# గూగుల్ కొత్త డివైజ్ వచ్చేసింది!



యాపిల్ ఎయిర్‌ట్యాగ్‌కి గట్టి పోటీనిస్తూ.. గూగుల్ తమ కొత్త 'పిక్సెల్ ట్యాగ్'ను భారత మార్కెట్లోకి తీసుకొచ్చింది. వస్తువులను సులభంగా వెతుక్కునేందుకు వీలుగా గూగుల్ తయారుచేసిన మొదటి బ్లూటూత్ ట్రాకర్ ఇది. పిక్సెల్ లేదా ఇతర ఆండ్రాయిడ్ ఫోన్లను ఉపయోగించే వారికి ఇదొక మంచి ఆప్షన్‌గా నిలుస్తుంది.

ఈ పిక్సెల్ ట్యాగ్ మనదేశంలో లభించే ఏకైక కలర్ ఫాగ్ వేరియంట్‌లో రానుంది. సింగిల్ ట్యాగ్ ధర రూ.3,799 కాగా.. నాలుగు ట్యాగ్‌ల ప్యాక్ ధర రూ.12,900గా ఉంది. నవంబర్ నుంచి గూగుల్ ఇండియా ఆన్‌లైన్ స్టోర్‌లో ఇవి అమ్మకానికి అందుబాటులోకి వస్తాయి. గుండ్రటి రాయి లాంటి చిన్న డిజైన్, లైట్ వెయిట్‌తో వచ్చే ఈ ట్యాగ్‌పై గూగుల్ లోగోతో పాటు ఒక చిన్న ఎల్‌ఈడీ లైట్ కూడా ఉంటుంది.

గూగుల్ పిక్సెల్ టాగ్ ఫైండ్ హబ్ నెట్‌వర్క్‌పై పనిచేస్తుంది. దీనిలో ఉన్న బ్లూటూత్ ఛానల్ సౌండింగ్, అల్ట్రావైడ్ బ్యాండ్ సాంకేతికత ద్వారా వస్తువులు ఎక్కడున్నాయో కచ్చితంగా లొకేషన్ చూపిస్తుంది. ట్యాగ్‌లో చిన్న స్పీకర్ కూడా ఉంటుంది. వస్తువు కనిపించనప్పుడు ఫైండ్ హబ్ యాప్ ద్వారా సౌండ్ చేసి కూడా దాన్ని వెతకవచ్చు. ఆండ్రాయిడ్ 9 లేదా ఆపై వెర్షన్‌తో పనిచేసే ఏ డివైజ్‌కైనా ఇది సపోర్ట్ చేస్తుంది.

దీనిలోని ఒక ప్రత్యేకమైన ఫీచర్ ఏమిటంటే.. ఒకవేళ మన ఫోన్ ఎక్కడైనా పడిపోయి సైలెంట్‌లో ఉన్నా సరే.. ఈ ట్యాగ్‌పై ఉన్న బటన్ నొక్కితే ఫోన్ రింగ్ అవుతుంది. అలాగే మన దగ్గర కంపాటిబుల్ పిక్సెల్ ఫోన్ ఉంటే.. జెమిని వాయిస్ అసిస్టెంట్‌ని అడిగి కూడా ఈ ట్యాగ్ ద్వారా సౌండ్ చేయించవచ్చు. దీని బరువు కేవలం 11.8 గ్రాములు మాత్రమే ఉంటుంది.

ఈ గూగుల్ పిక్సెల్ టాగ్ లో సులభంగా మార్చుకోగలిగే సి ఏర 2032 కాయిన్ బ్యాటరీని ఇచ్చారు. ఇది ఒక ఏడాది కంటే ఎక్కువ కాలం పని చేస్తుం ది. ఛార్జింగ్ అయిపోగానే కొత్త బ్యాటరీ వేసుకుంటే సరిపోతుంది. ఇది ఐపీ67 వాటర్, డస్ట్ రెసిస్టెన్స్‌తో వస్తుంది కాబట్టి.. ఒక మీటర్ లోతు నీటిలో అరగంట సేపు ఉన్నా ఏమీ కాదు. దీనిపై గూగుల్ ఏడాది వారంటీని అందిస్తోంది.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

సాక్షి

# కథాకళి

FEED ME A STORY

● మల్లాది వెంకట కృష్ణమూర్తి

డిటెక్టివ్‌లు ఇద్దరూ ఇన్‌స్పెక్టర్ బుల్లెబ్బాయ్ చెప్పిన అడ్రస్‌కి చేరుకున్నారు.

హతుడి శవం బెడ్‌రూమ్‌లో మంచంమీద ఉంది. 'ఆయన వయసు అరవై ఐదు, డెబ్బై మధ్య ఉండచ్చ'ని డిటెక్టివ్ పెద్దబ్బాయి అనుకున్నాడు.

''ఈయన పేరు ఐలయ్య. కోటీశ్వరుడు. ఉదయం బట్లర్ నిద్ర లేచేసరికి ఇలా కనిపించాడు. డాక్టర్ ప్రాథమిక పరీక్ష ప్రకారం ఎనిమిది గంటల క్రితం గొంతు పిసికి చంపబడ్డాడు. తెల్లవారుజామున. ఈయన ఆస్తికి ఇద్దరు వారసులు. కొడుకు వయసు ముప్పై ఎనిమిది, కూతురి వయసు ముప్పై రెండు. రాత్రిళ్ళు ఇంట్లో పనివాడు మాత్రమే ఉంటాడు.'' ఇన్‌స్పెక్టర్ వివరించాడు.

పెద్దబ్బాయి ఆ గదిని పరిశీలనగా చూసి తల ఊపాడు. మంచం చుట్టూ తిరిగి, దాని వెనుక నేల మీద పడివున్న టూత్‌పిక్ తీసి పరిశీలించాడు.

''దాని మీద వేలిముద్రలు దొరకవు.'' ఇన్‌స్పెక్టర్ చెప్పాడు.

''కాని పళ్ళముద్రలు, డీఎన్ఏ దొరుకుతాయి. హంతకుడితో హతుడు పెనుగులాడినప్పుడు హంతకుడి నోట్లోంచి ఇది నేల మీదికి పడి ఉంటుంది.''

''అది హంతకుడిదే అని ఎలా చెప్పగలరు? హతుడిదీ అయి ఉండొచ్చుగా?'' ఇన్‌స్పెక్టర్ బుల్లెబ్బాయి ప్రశ్నించాడు.

''పరిశీలన. ఊహ. ఈ రెండింటినీ ఉపయోగించాను. శవం పళ్ళని పరిశీలిస్తే ఆయనవి కట్టుడు పళ్ళని తెలిసింది. వాళ్ళకి టూత్‌పిక్ అవసరం ఉండదు. రాత్రిళ్ళు నక్షత్రాల్లా డెంచర్లు కూడా బయటికి వస్తాయి. రాత్రి వాటిని నీళ్ళల్లో ఉంచి, ఉదయం శుభ్రం చేసి పెట్టుకుంటారు. మీ సార్ టూత్‌పిక్స్ వాడుతారా?'' పెద్దబ్బాయి పనివాడి వైపు చూసి అడిగాడు.

అతను తల అడ్డంగా ఊపాడు.

''నిన్న రాత్రి మీ అయ్యగారిని ఆఖరిసారి ఎప్పుడు చూశావు?''

''రాత్రి పదిన్నరకి పాలగ్లాస్ ఇచ్చి గుడ్ నైట్ చెప్పి, రెండో అంతస్తులోని నా గదికి వెళ్ళాను. ఉదయం ఆరున్నరకి కిందికి వచ్చాక చూశాను. వెంటనే పోలీసులకి ఫోన్ చేశాను.''

''దొంగతనంగా ఇంట్లోకి ఎవరూ వచ్చిన దాఖలాలు లేవు సార్.'' అసిస్టెంట్ చిన్నబ్బాయి ఇల్లంతా తిరిగి చూసి వచ్చి చెప్పాడు.

''ఈ ఇంటి డూప్లికేట్ తాళంచెవులు ఎవరి దగ్గర ఉన్నాయి?''

''వీరి పిల్లలు... కూతురు, కొడుకుల దగ్గర.'' పనివాడు జవాబు చెప్పాడు.

''వాళ్ళు నిన్న వచ్చారా?''

''ఇవాళ ఆయన విల్లు రాయాలని అనుకున్నారు. నిన్న మధ్యాహ్నం కొడుకు వచ్చి ఆస్తిని ఆయన ఇంటి పేరుగల వారికే, అంటే తనకే రాయాలని కోరాడు. ఆయన కూతురు సాయంత్రం వచ్చి, తన తల్లి తన అన్నని ఎలా కష్టపడి కన్నదో తనని కూడా అలాగే కన్నదని, తనకి సగం ఆస్తి రాయడం న్యాయమని కోరింది.''



> "నిన్న రాత్రి మీ అయ్యగారిని ఆఖరిసారి ఎప్పుడు చూశావు?"
> "రాత్రి పదిన్నరకి పాల గ్లాస్ ఇచ్చి గుడ్ నైట్ చెప్పి, రెండో అంతస్తులోని నా గదికి వెళ్ళాను. ఉదయం ఆరున్నరకి కిందికి వచ్చాక చూశాను. వెంటనే పోలీసులకి ఫోన్ చేశాను."

''వాళ్ళిద్దరిలో ఎవరికి టూత్‌పిక్ అలవాటు ఉంది?''

''కొడుక్కి ఉంది. నాకు అదే ఆశ్చర్యం. సినిమాల్లో విలన్లు టూత్‌పిక్‌లు నోట్లో పెట్టుకుని అటూ ఇటూ తిప్పుతుంటారు కదా! అతను అచ్చం అలా తిప్పుతాడు.''

''నువ్వు ఇల్లు సరిగ్గా ఊడుస్తావా?''

''ఊడుస్తాను సార్.''

''మరి ఈ టూత్‌పిక్ ఊడవలేదే?''

''అది నిన్న రాత్రి ఏడు తర్వాత పడి ఉంటుంది. నేను ప్రతి సాయంత్రం చీకటి పడకముందే వాక్యూమ్ చేస్తాను.''

కబురు అందుకుని ఆయన కొడుకు, కోడలు, కూతురు, అల్లుడు వచ్చారు. కొడుకు, అల్లుడి నోళ్ళల్లో టూత్‌పిక్‌లు ఉన్నాయి. ఆ నలుగురి కళ్ళ వెంటా నీళ్ళు కారుతున్నాయి.

''మీరు మీ నోట్లోని టూత్‌పిక్‌ని ఇస్తారా?'' పెద్దబ్బాయి తనని పరిచయం చేసుకుని అడిగాడు.

''దేనికి?'' ఇద్దరూ ఇచ్చి ఆశ్చర్యంగా అడిగారు.

''హంతకుడిని కనుక్కోడానికి.''

పెద్దబ్బాయి టూత్‌పిక్‌లని పరిశీలించి, ఇన్‌స్పెక్టర్ వైపు తిరిగాడు.

''మిస్టర్ ఇన్‌స్పెక్టర్. దయచేసి హంతకుడిని అరెస్టు చేయండి. అల్లుడిదే ఈ గిల్లుడు.''

''ఎలా చెప్పగలరు?'' అల్లుడు అదిరిపడి అడిగాడు.

''మీ మామగారి గొంతు పిసికినప్పుడు కిందపడ్డ మీ టూత్‌పిక్ చెప్పింది.''

''అది నాదేనని ఏమిటి? నా బావమరిదిదై ఉండొచ్చుగా?'' సీరియస్‌గా అడిగాడు.

''మిస్టర్ అల్లుడు. టూత్‌పిక్స్ రెండు రకాలు ఉన్నాయి. పిసినారి వాళ్ళ కోసం చేసే వాటికి అటూ ఇటూ సూది మొనలు ఉంటాయి. కాని మామూలు వాళ్ళు వాడే వాటికి వాడి మొన ఒకవైపు మాత్రమే ఉంటుంది. అది మీ బావమరిదిదైతే రెండో వైపు మొన ఉండేది కాదు. ఇల్లు ఊడ్చాక తెల్లారజామున మీరీ హత్య చేయడంతో నా పని తేలికైంది. మీరు ఇది మీ పని కాదనడం సహజం. అది ప్రతి నేరస్థుడి వాదనే. కాని డీఎన్ఏ క్లూని ఎవరూ కాదనలేరు.''

అల్లుడు బయటకి వేగంగా నడుస్తుంటే కానిస్టేబుల్స్ ఆపారు.

లోపలకి వస్తున్న ఓ ఏభై ఏళ్ళ వ్యక్తిని చూసి పెద్దబ్బాయి చెప్పాడు.

''మీరు లాయరైతే ఇక మీకు ఇక్కడ పని లేదు.''

**'ఫన్‌డే'లో ప్రచురితమయ్యే**
**ఈ శీర్షికలో మల్లాది కథలు రాయడమే కాదు, మిమ్మల్ని కూడా భాగస్వాములను చేస్తున్నారు. మీరైతే ఈ కథకు ఏ పేరు పెడతారో ఈ కింది మెయిల్‌కు పంపండి.**
**kathakalisakshi@gmail.com**

14 వ పేజీలో..
2-8-2026 సంచిక
'కథాకళి'కి పేరు సూచించిన
పాఠకుల పేర్లు



16/08/2026 | Funday | Page : 6
Source : https://epaper.sakshi.com/

# శ్రీమతి... ఒక బహుమతి

కె.వి. లక్ష్మణ రావు
9014659041

నిన్న సాయంత్రం రిటైర్మెంట్ ఫంక్షన్ అయ్యాక ఆలస్యంగా ఇంటికొచ్చి పడుకున్నాడు ఆనంద్.

ఈరోజు నుంచి ఆఫీసు కు వెళ్ళక్కర్లేదు. ఆఫీసు అటెండర్, డ్రైవర్ అతనింటికి రారు. గడియారం కూడా నెమ్మదిగా తిరుగుతున్నట్లుగా ఉంది.

నీరజ కాఫీ కప్పు తెచ్చి టీపాయ్ మీద పెట్టింది.

ఎదురుగ్గా ఉన్న టేబుల్ మీద ఎప్పటిలా ఫైళ్ళు లేవు. .ఆనంద్ అంతరంగ మస్తిష్కం లో మాత్రం పుస్తకంలో పేజీల్లాగా జ్ఞాపకాల దొంతరులు తెరుచుకుంటున్నాయి.

కాఫీకప్పును చేతిలో పట్టుకుని బాల్కనీలోకి వచ్చి కూర్చున్నాడు.

తన ముందు కూర్చున్న నీరజను గమనించాడు.

ఆమె జుట్టు అక్కడక్కడా నెరిసింది.ఆమె కళ్ళల్లో మాత్రం ప్రశాంతత కనిపిస్తోంది.

"నీరజా!"పిలిచాడు.

అతని పిలుపులో సంవత్సరాల తపన దాగి ఉందనిపించింది.

నీరజ నవ్వుతూ చూసింది ' ఎందుక' న్నట్లుగా?

నీరజకు దగ్గరగా జరిగాడు.

ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు.

"ఇన్నాళ్లూ నిన్ను పట్టించుకోలేకపోయాన"న్నాడు నెమ్మదిగా.

ఆనంద్ కళ్ళు పశ్చాత్తాపం తో నిండిపోయాయి.

"గెజిటెడ్ ఆఫీసర్ గా ఇన్నాళ్లూ 'రాణిం'చానంటే ఆ వెనుక వెన్నుముకలా నీ కృషి ఉంది. ఇప్పుడు తెలుస్తోంది.నువ్వున్నావ్ కనుకనే నేను 'రాజు'లా వెలిగాను." అన్నాడు.

నీరజ మృదువుగా నవ్వింది. "మీకిప్పుడే తెలిసిందా నా ప్రేమ? ఈ క్షణమే అర్థమైందా నా హృదయం?" అంది.

"అవును, నీ డైరీ చదివాకే తెలిసింది".

"పరాయి వారి డైరీ చదవడం తప్పు కదా?" అంది మెల్లగా.

"నిజమే.కానీ నువ్వు పరాయిదానివి కాదు. నాలో సగం. ఆ సగం అర్థమైంది" నీరజ కళ్ళలోకి కళ్ళు పెట్టి చూశాడు.

ఆనంద్ మాటలతో, నీరజ కు

కాలం వెనక్కు వెళ్లినట్లనిపించింది. డైరీలో ఒక్కొక్క పేజీ గతం గుర్తు చేస్తూ కళ్ళ ముందు సినిమా రీళ్లలా కదలాడింది.

● ● ●

ఆనంద్ ఒక మామూలు సాదా సీదా ప్రభుత్వ గుమస్తాగా ఉద్యోగం చేస్తున్నాడు. తాను ఉంటున్న ఇంటిని, నెలలో వచ్చే జీతాన్ని చూసి నిట్టూర్చేవాడు.

సగటు జీవి(తం).పైకి ఎగురలేదు. కిందకు దిగనూ లేదు.

పేరు చివర పేరు మోసిన డిగ్రీలు ఎన్నిచదివినా, అర్హతకు తగిన ఉద్యోగం రాలేదన్న అసంతృప్తి ఏ మూలనో ఉండి పోయింది.అయితే, ప్రేమించి



పెళ్లాడిన నీరజను, ప్రేమకు ప్రతిఫలం అయిన అరుణ్ ని చూసి, ఆ అసంతృప్తిని పక్కనపెట్టేసేవాడు.

ఇల్లు చిన్నది. జీతం ఇంకా చిన్నది. అయితే అతని హృదయం విశాలం.మమత అనంతం. ప్రేమ ఆకాశం.

భార్యా, బిడ్డలతో హాయిగా గడిపేవాడు.

సాయంత్రం సైకిల్ బెల్ వినబడటం తోనే నీరజ కళ్ళు గుమ్మం వైపు చూసేవి.నీరజ వీధి గుమ్మం చేరుకునేసరికి కళ్ళు వాకిట్లో ఉండేవి.

"అమ్మా!...'నాన్న!' వచ్చారంటూ ఐదేళ్ల అరుణ్ తండ్రి తెచ్చే చాక్లెట్ల కోసం సైకిల్ దగ్గరకు చేరిపోయేవాడు.

చాక్లెట్లు తీసుకోగానే అరుణ్ ముద్దిచ్చేవాడు.

"మా మంచి నాన్న" అంటూ చాక్లెట్లు పట్టుకుని ఆటలకు వెళ్లిపోయేవాడు.

"నీరూ!మన వాటా" అంటూ మూర మల్లెపూల దండను చేతిలో పెట్టేవాడు.నీరజ మురిపెంగా తీసుకునేది.

"అరుణ్ చాక్లెట్స్ తీసుకోగానే ముద్దిచ్చాడు.మరి నువ్వు?" కొంటెగా అనేవాడు.

"చాల్లెండి...సంబడం" అంటూ కవ్వించేది.

ఆరోజు ఆనంద్ నీరజ ల పెళ్ళిరోజు.

రాత్రయ్యింది.పున్నమి వెన్నెల పడకగది కిటికీ లోంచి గదిలోకి ప్రసరిస్తోంది.

ఆనంద్ పడుకోబోతూ కిటికీ వేయడానికి లేచాడు.

"ఎందుకో?" అంది కవ్వింపుగా.

"చందమామ చూస్తాడు" అన్నాడు అంతే కవ్వింపుతో.

"మెల్లగా వేయండి!"

"దేనికో?"

"బాబు లేస్తాడు".

"గడుసరివే"

"సొగసరిని కానా?"

"కాదన్నానా? కబుర్లతోనే వెన్నెల రాత్రిని కరిగించేస్తావా?" అంటూ నీరజను దగ్గరకు తీసుకున్నాడు.

తమకంతో ఆనంద్ ను అల్లుకు పోయింది.

ఆనంద్ తపనతో నీరజకు మరింత చేరువ అయ్యాడు.

కొంత సేపటి తరువాత

ఆనంద్, అరుణ్ తో సమానంగా ఆదమరిచి నిద్ర పోతున్నాడు.

నీరజ ముందు గదిలోకి వచ్చి తన డైరీ తీసుకుంది.

"ఈ పున్నమి రాత్రి ఎంతో అందంగా, ఆనందంగా గడిచింది.ఈ ఆనందం పదిలం కావాలి.ఆనంద్ ఎప్పుడూ, నాతో ప్రేమగా ఉండాలి." అని రాసింది.

తెల తెల్లగా తెల్లారింది.

ఆరోజు ఆదివారం.

ఆనంద్ అరుణ్ ను సైకిల్ సీటు మీద కూర్చోపెట్టి, సైకిల్ ను పట్టుకున్నాడు. ముందుకు నడిపిస్తున్నాడు.

"కాలు అందడం లేదు.పడి పోతా,నాన్నా!"

"నన్ను దాటి ఎదగాలి.నేను చూడాలి.నీ బాధ్యత నాది." అన్నాడు.

"సైకిల్ పై విన్యాసమా?"

తండ్రీ కొడుకుల కేసి ఆప్యాయంగా చూస్తూ అంది.

"కాదు... విహారం" అన్నాడు.

"అమ్మా! నేను ముందు కూర్చుంటాను.నువ్వు వెనుక సీటు మీద కూర్చో. నాన్న సైకిల్ తొక్కుతారు" అన్నాడు అరుణ్.

"అమ్మో! నాకు భయం కన్నా!" అని నీరజ.

"ఆనంద్ ఉండగా నీకుచింత ఇంకేల ఆ చింత?" నవ్వుతూ అన్నాడు సైకిల్ సీటు మీద కూర్చుంటూ.

"శ్రీవారు ప్రాసలో బాగా చెప్పారే"

" పడి పోకుండా సైకిల్ నడిపిస్తా"అంటూ నీరజ ను సైకిల్ వెనుక సీటు పై కూర్చోబెట్టాడు.మెల్లగా ముందుకు సైకిల్ తొక్కాడు.

ఆమె చేతులు ఆనందును వెనుక నుండి

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

పట్టుకున్నపుడు

సైకిల్ కదిలిందా, ఆమె గుండె కదిలిందా?' నీరజకు తెలియలేదు.ఆమె శ్వాస తాకిడికి అతడి మనసు ఎగిరినంత ఆనందంగా ఉంది.

దారిలో ఫోటో స్టూడియో దగ్గర ఆపాడు. ఆనంద్ ను చూడగానే ఫోటో స్టూడియో అప్పారావు బయటకు వచ్చాడు.

" అప్పారావ్ !మా ముగ్గురికి ఈ సైకిల్ మీద ఉండగా ఓ ఫోటో తియ్యి" అన్నాడు.

అప్పారావు వెంటనే ఇన్ స్టెంటు కెమెరా తో ఫోటో

తీసిచ్చాడు. మళ్ళీ ఇంటికి బయల్దేరారు.

భార్యా, బిడ్డలను సైకిల్ పై బాధ్యతగా ముందుకు నడిపిస్తున్న భర్త మీద అమితమైన ప్రేమ కలిగింది.ఆ ప్రేమనే, అక్షరాలలో వ్యక్త పరచాలనుకుంది.

డైరీ తీసింది.పేజీలు తిప్పింది.

"ఈ నాటి ఈ సంతోషం విలువ , కలం తో రాయలేనంత.కాలం తో కొలవలేనంత.నా ఆనందం అంబరాన్ని తాకింది.సంబరాలు జరుపుకోవడానికి పండుగే అవసరం లేదు.మనకంటూ మనసు, ఆ మనసును అర్థం చేసుకునే తోడూ ఉంటే చాలును .మా ఇల్లు ఇరుకే..కానీ ఆయన హృదయం విశాలం.

జీతం తక్కువే.కానీ జీవితం ఆనందమయం...ఆనందం మా సొంతం" అని రాసింది.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# పరశురాముడు చేసిన హితబోధ



మహాభారతం ఉద్యోగపర్వంలో శ్రీకృష్ణ రాయబారం అయిన తరువాత పరశురాముడు దుర్యోధనుడికి హితబోధ చేశాడు. చాలారోజుల క్రితం దంభోద్భవుడు అనే రాజు ఉండేవాడు. ఆయన ఈ మొత్తం భూమండలాన్ని పాలించేవాడు. అతడు మహాయోధుడు. ఆ రాజు రోజూ ఉదయం కాలకృత్యాలు పూర్తికాగానే బాగా అలంకరించుకొని, రత్న కిరీటం ధరించి, కరవాలం తీసుకుని, సభా భవనానికి వచ్చి బంగారు సింహాసనం మీద కూర్చునేవాడు. వందిమాగధులు ఆయన బలపరాక్రమాలను గానం చేస్తుంటే, గర్వంగా ఆనందించేవాడు. అనంతరం తన కొలువులో ఉన్న వారందరినీ చూస్తూ - 'ఈ భూలోకంలో నన్ను ఎదుర్కోగల వీరుడుంటే చెప్పండి. వాడిని క్షణంలో కడతేరుస్తాను' అని గర్వంగా నవ్వుతూ భుజాలు ఎగరేసేవాడు. ఆయన బలపరాక్రమాలు తెలిసినవారెవరూ యుద్ధానికి దిగేవారు కారు. అందువల్ల ఆయన అహంకారం పెరిగి పెరిగి, 'నా అంతవారు లేదు' అనే గర్వంతో విర్రవీగుతున్నాడు. అటువంటి అహంకారం ఉన్న రాజుకి అనుచరులు కూడా అటువంటి అవివేకులే దొరుకుతారు కదా! వారు రోజూ ఆయన బలపరాక్రమాలను పొగుడుతూ ఉండేవారు. ఇలా ఉండగా ఒకనాడు ఆయనను చూడడానికి దూరదేశీయులైన విప్రులు వచ్చారు. వారు 'మహారాజా! మీరు నిజంగా మహావీరులే అయితే - గంధమాదన పర్వతం మీద నరనారాయణులని ఇద్దరు తీవ్ర నిష్ఠతో తపస్సు చేస్తున్నారు. వారిని జయించగల వీరులు మూడు లోకాలలో లేరని విన్నాము. తమకు కోరిక వుంటే వారితో యుద్ధం చేయవచ్చు' అన్నారు. 'నన్ను మించిన యోధులా వారు' అంటూ సేనలను సన్నద్ధం చేసి ధనుర్బాణాలు తీసుకుని గంధమాదన పర్వతం చేరాడు. ప్రశాంతంగా తపస్సు చేసుకుంటున్న వారిని చూస్తూనే తొడగొట్టి యుద్ధానికి పిలిచాడు. తమ ఆశ్రమానికి వచ్చిన మహారాజుకి అతిథి సత్కారాలు జరపబోగా -

'ఇవన్నీ అనవసరం - యుద్ధం.. యుద్ధం..' అని అట్టహాసం చేశాడు. అప్పుడు వారు -

ఈ ప్రశాంత ప్రదేశంలో తపస్సు చేసుకునే మునులమైన మాతో యుద్ధం చేయాలనే కోరిక ఎందుకు కలిగింది' అన్నాడు. వాడు మాట వినకుండా బాణం తొడుగుతుంటే చూసిన నరుడు నవ్వుతూ ఒక దర్భ పుల్ల తీసి -

'ఈ గడ్డిపరక నీ సేనను నిలబెడుతుంది' అని వదిలాడు. ఆ రాజు బాణవర్షం కురిపించాడు. ఆ గడ్డి పరక అన్ని బాణాలను ముక్కలు ముక్కలు చేసింది. రాజుకి తల తిరిగిపోయింది. సేనలు పలాయనం చేస్తున్నాయి. అంతే.. రాజు తన ఆయుధాలన్నీ క్రింద పెట్టి, నరనారాయణుల పాదాల మీద వ్రాలి... 'ఆర్యా! నన్ను క్షమించి అనుగ్రహించండి. నా గర్వానికి ప్రాయశ్చిత్తం అయింది' అని దీనంగా ప్రార్థించాడు. అప్పుడు వారు నవ్వుతూ -

'మహారాజా! సిరిసంపదలు కలవారు పేదసాదలకు దానధర్మాలు చేసి గొప్పవారు కావాలి. అలాగే బలపరాక్రమాలు ఉన్నవారు దుర్మార్గుల బారినుండి సజ్జనులను రక్షించడానికి తమ శక్తిని వినియోగించాలి. అంతేకాని అహంకారంతో తిరగరాదు. ఇరుగుపొరుగులకు ఉపకారం చేయనివాడి జన్మ వ్యర్థం' అన్నారు.

మహారాజు వారి బోధనలు విని ఆనాటి నుంచీ అహంకారం విడిచాడు. అందరి శ్రేయస్సూ దృష్టిలో ఉంచుకున్నాడు. సంపదలను బీదలకు దానం చేయసాగాడు. తన బలంతో దుర్మార్గులనూ, క్రూరులనూ శిక్షించాడు. న్యాయమార్గాన సజ్జన సేవ చేసి పేరు ప్రఖ్యాతులు పొందాడు.

'కనుక దుర్యోధనా అహంకారం, బలగర్వం ఎప్పుడూ పనికిరావు. అవి ఎవరికి ఉంటాయో వారినే నాశనం చేస్తాయి' అన్నాడు పరశురాముడు.

సాక్షాత్తు పరశురాముడంతటి వాడు ఇన్ని మంచి విషయాలను ఉదాహరణలతో బోధించినప్పటికీ దుర్యోధనుడిలో ఎటువంటి మార్పు రాలేదు. తన చుట్టూ ఉన్న కర్ణుని వంటి వారి పొగడ్తలతో మరింత అహంకారాన్ని పెంచుకున్నాడు. తన బలాన్ని, శక్తిని అన్యాయ మార్గం కోసం ఉపయోగించాడు. కనుకనే కురుక్షేత్ర యుద్ధంలో ఓటమిపాలయ్యాడు. కర్ణుడు, భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, శల్యుడు వంటి ఎందరో యోధాగ్రేసరులతో పాటు పదకొండు అక్షౌహిణీల సేన దుర్యోధనుని పక్షాన ఉంది. అయినప్పటికీ వారు ఓడిపోయారు. అన్యాయంగా, అధర్మంగా సజ్జనులైన పాండవుల మీద యుద్ధం చేయడమే ఇందుకు కారణం. అహంకారంతో ఉండేవారిలో విచక్షణ ఉండదు. బుద్ధిబలం ఉండదు. ఆవేశమే కాని ఆలోచన ఉండదు. ఆ కారణంగానే వారు ఓటమిపాలవుతారని మహాభారతం చెప్తోంది.

(ఉషశ్రీ రచించిన 'భారతంలో నీతికథలు' పుస్తకం ఆధారంగా)

- డా. పురాణపండ వైజయంతి

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# అసూయ


రామయ్య, సుంకరయ్య అని ఇద్దరు బాల్య స్నేహితులు ఉండేవారు. వాళ్ళిద్దరు కుమ్మరి వృత్తిని నమ్ముకుని జీవనం సాగించేవారు.

ఇద్దరూ బాల్య స్నేహితులు కావడం వల్ల పక్కపక్కన మట్టి పాత్రలు అమ్మే దుకాణాలు పెట్టుకున్నారు. రామయ్య దగ్గరకు ఎక్కువ మంది వచ్చేవారు. అది చూసి సుంకరయ్య లోలోపల అసూయతో రగిలిపోతూ ఉండేవాడు. అంతే కాకుండా రామయ్య లేనప్పుడు కొన్ని పాత్రలను పట్టుకుపోతుండేవాడు.

ఒకరోజు రామయ్య కొడుకు పదేళ్ల మహేష్ చూసి, తండ్రికి చెప్పాడు. కానీ రామయ్య నమ్మలేదు. "వాడు అటువంటివాడు కాదురా" అనేవాడు. ఎలాగైనా సుంకరయ్య మోసాన్ని తండ్రికి తెలియజేయాలనుకున్నాడు మహేష్. విషయాన్ని టీచర్‌కి చెప్పి సలహా తీసుకుని సమయం కోసం వేచి ఉన్నాడు.

ఒకరోజు చలివేంద్రాల కోసమని ఒక సేవా సంస్థవారు ఎక్కువ సంఖ్యలో మంచి నీటి కుండలు కావాలని రామయ్య దగ్గరకు వచ్చారు.

వారం రోజుల పాటు పగలు, రాత్రి తేడా లేకుండా కుండలు తయారుచేశాడు రామయ్య. మరుసటి రోజు సేవా సంస్థకు కబురుపెట్టాడు. వాళ్ల కుండలు తీసుకెళ్దామని వచ్చారు. కానీ రామయ్య దుకాణంలో ఒక్క మంచినీటి కుండ కూడా లేదు. రామయ్యకు ఏం చేయాలో అర్థం కాలేదు. అదే సమయంలో సుంకరయ్య వచ్చి "మీకు ఎన్ని కుండలు కావాలి? నా దగ్గర చాలా కుండలు చేసి సిద్ధంగా



ఉన్నాయి" అంటూ తన దగ్గర ఉన్న కుండలన్నీ ఆ సేవా సంస్థ వారికి ఇచ్చాడు.

ఎలాగైనా సుంకరయ్య బుద్ధిని నలుగురికి తెలియజేయాలని సమయం కోసం వేచి ఉన్న మహేష్ గ్రామపెద్ద దగ్గరకు తీసుకెళ్లాడు.

మహేష్ గ్రామ పెద్ద దగ్గరికి వెళ్లి తన జేబులో ఉన్న ఒక గుర్తును గ్రామ పెద్దకిచ్చి, చెవిలో ఏదో చెప్పాడు. తరువాత గ్రామ పెద్ద వచ్చి కుండలన్నీ పరిశీలించగా అన్నీ కూడా మహేష్ చెప్పినట్టే ఉన్నాయి. దాంతో "ఈ కుండలన్నీ రామయ్య చేసినవి. సుంకరయ్య చేసినవి కావు" అని తీర్పు చెప్పాడు.

"చూడు సుంకరయ్యా! మహేష్ చిన్నపిల్లవాడైనా నీ బుద్ధిని బయట పెట్టడానికి చక్కగా ఆలోచన చేశాడు. నువ్వు కుండలు దొంగతనం చేస్తున్న విషయం మహేష్ వాళ్ళ నాన్నకి చెప్పినా... నీ మీద ఉన్న స్నేహభావంతో రామయ్య నమ్మట్లేదు. అందుకే మహేష్ వాళ్ల టీచర్ సలహాతో చక్కగా ప్రతీ కుండకి బయటికి కనబడకుండా లోపల వైపు రామయ్య అనే ముద్ర వేశాడు. దాంతో అడ్డంగా దొరికిపోయావు" అన్నాడు గ్రామ పెద్ద.

ఆ మాటలకు సుంకరయ్య పశ్చాత్తాపంతో రామయ్య వద్దకు వెళ్లి 'ఇకపై తప్పు చేయనని, మన్నించమని' క్షమాపణ అడిగాడు. మహేష్ తెలివిని, సమయస్ఫూర్తిని అందరూ మెచ్చుకున్నారు.

- శ్రీదేవి సురేష్ కుసుమంచి, విజయనగరం

## రంగులు వేయండి



## దారి చూపండి



## పదాల పజిల్

కూరగాయల పేర్లు పజిల్‌లో ఎక్కడున్నాయో వెతకండి.

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| A | I | B | T | B | J | O | C | P | U | M |
| V | O | R | O | E | E | T | U | O | U | P |
| O | D | O | M | O | L | L | C | A | G | K |
| C | A | C | A | T | L | Y | U | P | I | I |
| A | D | C | O | L | I | F | M | T | N | N |
| G | A | R | L | I | C | R | B | E | R | E |
| E | P | U | M | P | K | Z | U | C | C | H |
| G | H | A | T | B | I | I | B | A | R | I |
| G | T | R | U | F | N | P | R | E | E | N |
| P | C | A | U | L | I | F | L | O | W | I |
| L | A | N | T | E | E | N | T | T | S | B |



## చుక్కలు కలపండి



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# బంగారు మామిడి

అనగనగా ఒక అందమైన పల్లెటూరు. ఆ ఊరి మధ్యలో ఒక పెద్ద మామిడి తోట ఉండేది. ఆ తోటలో ఎన్నో రకాల మామిడి చెట్లు ఉండేవి రుచికరమైన రసాలు, తీపి బంగినపల్లిలు, పుల్లని పుల్లమామిడికాయలు. ఆ తోట యజమాని తాతయ్య చాలా మంచివాడు. ఆయన ఆ తోటను తన కన్నబిడ్డల్లా చూసుకునేవాడు.

ఆ ఊరిలో మల్లేష్, నరేష్ అనే ఇద్దరు స్నేహితులు ఉండేవారు. వాళ్లు రోజూ బడినుంచి వచ్చే దారిలో ఆ తోట పక్కనే ఆడుకునేవారు. ఒకరోజు వాళ్లకి ఆ తోట మధ్యలో ఉన్న ఒక ప్రత్యేకమైన చెట్టుమీద, సూర్యరశ్మికి బంగారంలో మెరుస్తున్న ఒక పెద్ద మామిడి పండు కనిపించింది.

"అబ్బ! అది ఎంత పెద్దగా ఉందో! అది తింటే ఎంత రుచిగా ఉంటుందో కదా!" అని నరేష్ ఆశ్చర్యంగా అన్నాడు.

వాళ్లిద్దరూ కష్టపడి ఆ పండును కోసి, తోటలో ఉన్న తాతయ్య దగ్గరకు వెళ్లారు.

తాతయ్య ఆ పండును చూసి నవ్వి, "పిల్లలూ, ఇది మామూలు పండు కాదు, ఇది 'జ్ఞానపు మామిడి'. దీన్ని ఎవరైతే అందరితో పంచుకుని తింటారో, వారికే దీని అసలైన తీపి తెలుస్తుంది" అని ఒక రహస్యాన్ని చెప్పాడు.

మల్లేష్, నరేష్ ఆ పండును ఇంటికి తీసుకెళ్లారు. అది చూడటానికి చాలా ఆకర్షణీయంగా ఉంది. వాళ్లకి దాన్ని ఒక్కరే తినాలని అనిపించింది. కానీ తాతయ్య చెప్పిన మాటలు గుర్తుకువచ్చాయి. వెంటనే



వాళ్లు ఒక నిర్ణయానికి వచ్చారు. ఊరి చివర ఉన్న అనాథాశ్రమానికి వెళ్లి, అక్కడ ఉన్న చిన్న పిల్లలందరినీ పిలిచారు.

వాళ్లు ఆ మామిడి పండును చిన్న చిన్న ముక్కలుగా కోసి, ఆశ్రమంలోని ప్రతి ఒక్కరికీ పంచారు. ఆ పండు ముక్కలను తిన్న పిల్లలందరి ముఖాల్లో ఒక వెలుగు కనిపించింది. ఎంతో సంతోషంగా నవ్వుకుంటూ, ఆ పండు రుచిని ఆస్వాదించారు. మల్లేష్, నరేష్‌లకు ఆ పండు రుచి కంటే, పక్కవారి ముఖంలో కనిపించిన సంతోషమే ఎంతో తీయగా అనిపించింది.

మరుసటి రోజు, ఆ తోటలోకి వెళ్లిన మల్లేష్, నరేష్‌లకు ఆశ్చర్యం కలిగింది. నిన్న కోసిన ఆ చెట్టు స్థానంలో మళ్లీ రెండు పెద్ద మామిడి పండ్లు కాచి ఉన్నాయి!


తాతయ్య అక్కడికి వచ్చి, "చూశారా పిల్లలూ! మీరు పంచుకోవడం అనే మంచి గుణాన్ని చూపించారు కాబట్టే, ఈ తోట మీకు మరింత ఫలాన్ని ఇచ్చింది. మామిడి పండు కేవలం రుచికే కాదు, అది మనలోని దయను, ప్రేమను బయటకు తీస్తుంది. అందుకే మామిడిని 'ఫలరాజు' అని పిలుస్తారు" అని వివరించారు.

అప్పటినుంచి మల్లేష్, నరేష్ ఊరిలో ఎవరికి ఏ సాయం కావాలన్నా, దేనిని పంచాలన్నా ముందుండేవారు. ఆ మామిడి తోట ఆ ఊరికి ఒక పాఠశాలలా మారింది. మనుషుల మధ్య విభేదాలు లేనప్పుడే, ప్రకృతి కూడా తన వనరులను అందరికీ సమృద్ధిగా ఇస్తుందని ఆ గ్రామం తెలుసుకుంది.

\- ఉప్పరి తిరుమలేష్

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి





పిల్లల కథ

# వెండి తాళంచెవి

• యు.విజయశేఖర రెడ్డి

చంద్రయ్య సీతాపురం గ్రామం నుంచి సంతకు బయలుదేరాడు. తోవలో వెళుతుండగా, అతడికి ఒక వెండి తాళంచెవి దొరికింది. దానిని తీసుకువెళుతుండగా, ఒక వ్యక్తి ఎదురయ్యాడు. ''నా పేరు భూషయ్య. నేను ఈ ఊరికి కొత్త. సంతకు ఎలా వెళ్లాలి?'' అని అడిగాడు.

''నాతో పాటు రా చూపిస్తాను'' అన్నాడు చంద్రయ్య.

కలిసి నడుస్తూ, ''నీ పేరెంటి?'' అని అడిగాడు భూషయ్య.

''నా పేరు చంద్రయ్య'' అన్నాడు.

''అబ్బో!.. నీ చేతిలో వెండి తాళంచెవి ఉంది. అంటే ఇంటికి వెండి తాళం వేసి వచ్చావన్నమాట'' అన్నాడు భూషయ్య.

''అదేం కాదు ఇది నాకు దారిలో దొరికింది. ఏం చేద్దామా? అని ఆలోచిస్తున్నాను'' అన్నాడు చంద్రయ్య. ''ఇందులో ఆలోచించడానికేముంది? ఈ తాళం చెవితో ఆ ఇంటి తాళం తెరవచ్చు'' అన్నాడు భూషయ్య.

''అంటే దొంగతనం చేద్దామంటావా?'' అన్నాడు చంద్రయ్య.

''అవును ఇది చాలా సులువైన పని. ఎందుకంటే తాళం చెవి ఉంది కదా! వెండి తాళం వేసి ఉన్న ఇల్లు గుర్తించడం చాలా సులువు'' అన్నాడు భూషయ్య.

''సరే పద... ఆ ఇల్లు ఏ వీధిలో ఉందో వెదుకుదాము'' అన్నాడు చంద్రయ్య.

దారిలో భూషయ్యకు ఒక లావుపాటి దారం దొరికింది. అది తీసుకుని చంద్రయ్య వద్ద తాళంచెవి తీసుకుని, దానిని దారానికి మధ్యలో ముడి వేసి ''ఈ దారాన్ని ఇద్దరం చెరో వైపు పట్టుకుందాం'' అన్నాడు భూషయ్య.

''అలాగే'' అన్నాడు చంద్రయ్య.

ఇద్దరూ వెళుతుండగా ఒక లావుపాటి మనిషి ఎదురై, ''ఏంటి తాళం చెవిని చెరో వైపు పట్టుకున్నారు?'' అని అడిగాడు. వాళ్ళు విషయం చెప్పారు.

''అలాగా నా పేరు భీమయ్య నాకు బాగా బలం ఉంది. నేను కూడా దొంగతనానికి సిద్ధం!. నేను కూడా వస్తాను'' అన్నాడు.

''సరే పద'' అన్నారు ఇద్దరూ.

వీధిలో వెండితాళం వేసి ఉన్న ఇల్లు కనిపించింది. ముగ్గురూ ఆ ఇంటి వద్దకు వెళ్ళి ఆ తాళంచెవితో తాళాన్ని తెరిచి, ఇంటి గడియ తీసి లోపలకు వెళ్లారు.

''అబ్బో..! ఇల్లు చాలా బాగుంది. మనం అలసిపోయి ఉన్నాం. ముందుగా ఏమైనా తిందాము'' అన్నాడు భీమయ్య.

''అలాగే'' అన్నారు చంద్రయ్య, భూషయ్యలు.

బల్ల మీద కొన్ని రకాల పండ్లు కనిపించాయి వారికి. వాటిని ముగ్గురూ సమంగా పంచుకుని తింటుండగా బయట నుండి గడియ పెట్టిన చప్పుడు అయ్యింది.

''ఎవరో గడియ పెట్టినట్టున్నారు. ఇప్పుడెలాగ?'' అన్నాడు చంద్రయ్య.

''ఆ... ఏం భయం లేదు నేనున్నాగా!'' అన్నాడు భీమయ్య.

కాసేపటికి గడియ తీసిన చప్పుడయ్యింది నలుగురు భటులతో ఒకతను వచ్చి ''ఊ... ఈ దొంగలను బంధించండి'' అన్నాడు. భటులు ఆ ముగ్గురునీ బంధించి కోటకు తీసుకెళ్లారు.

రాజు కొలువుతీరి ఉన్నాడు. ''మహారాజా! నేను నా ఇంటి తాళం చెవిని పోగొట్టుకున్నాను. అది వీరికి దొరికినట్టుంది నా ఇంటి తాళం తీసి దర్జాగా కూర్చుని పండ్లు ఆరగిస్తుండగా పక్క వీధిలో మంత్రిగారి ఇంటి వద్ద ఉన్న భటులను పిలిచి బంధించి తెచ్చాను'' అన్నాడు విదూషకుడు.

''మహారాజా! మేము దొంగలం కాదు. మాకు వెండి తాళంచెవి దొరికింది. దానితో దొంగతనం చేయాలనే ఆలోచన వచ్చింది'' అన్నారు ముగ్గురూ. న్యాయాధికారి సలహా అడిగాడు రాజు.

''మీ ఇంట్లో వస్తువులు ఏమైనా పోయాయా?'' అని విదూషకుణ్ణి అడిగాడు న్యాయాధికారి.

''ఏమీ పోలేదు.'' అన్నాడు విదూషకుడు.

''నీవు కోటలో పని చేస్తున్నావని అందరికీ తెలియాలని ఇంటికి వెండి తాళం వేశావా?'' అన్నాడు న్యాయాధికారి.

''తప్పయ్యింది'' అన్నాడు విదూషకుడు.

''మన రాజ్యంలో దొంగతనాలకు తావు లేదు. వేసి ఉన్న ఇంటి తాళం తెరవడం నేరం. ఆకలి తీరాక ఈ ముగ్గురూ కచ్చితంగా దొంగతనం చేసేవారు. మహారాజా! వీరికి మూడు మాసాలు చెరసాల శిక్షతో పాటు చేతివృత్తులలో శిక్షణ ఇప్పించి జీవనోపాధి కల్పించగలరు. అలాగే దొంగతనానికి ప్రేరణ కలిగించింది వెండితాళం. అందుకు కారణం మన విదూషకుడు ఇతనికి కూడా పది రోజుల పాటు చెరసాల శిక్ష విధించండి మహారాజా!'' అని అన్నాడు న్యాయాధికారి.

మహారాజు అలాగే ఉత్తరువులు జారీ చేశాడు.

## హితవచనం

అనర్హేధిక్కృతి శోచ్యా యథార్హస్య పదచ్యుతిః
దుష్టేషు కరుణా దూష్యా సాధుష్వపకృతిర్యథా

అర్హుడికి అధికారం పోతే ఎంత విచారించాలో,
అనర్హుడికి అధికారం దక్కినప్పుడు అంతే విచారించాలి.
సజ్జనులకు అపకారం జరిగితే ఎంత బాధపడాలో,
దుష్టుల పట్ల జాలి చూపినా అంతే బాధపడాలి.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# అల్లరి

ALLARI



## చెప్పుకోండి

- నల్లని చేనులో..
తెల్లని దారి?
  - పాపిడ
- హంస.. ముక్కుకు
ముత్యం కట్టుకొని,
తోకతో నీళ్లు తాగు
తుంది?
  - ప్రమిద
- గోడమీద బొమ్మ, గొలు
సుల బొమ్మ, వచ్చే
పోయే వారికి వడ్డించు
బొమ్మ?
  - తేలు

## పెద్దల మాట



చివరిగా నీకంటూ మిగిలేది..
జీవితంలో గడిచిన సంవత్సరాలు
కాదు. ఆ సంవత్సరాలలో
నువ్వు ఆస్వాదించిన జీవితం.


**- అబ్రహం లింకన్**

## టంగ్ ట్విస్టర్స్



Thin sticks, thick bricks


## తేడాలు కనిపెట్టండి



**ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో 6 తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి.**

## జతచేయండి

**కింది బొమ్మలను వాటి సరైన నీడలతో జతచేయండి**



# స్నేహం

ఒక చిన్న తోటలో ఒక జామ చెట్టు ఉంది. దాని మీద రెండు చిలుకలు, రెండు పిచ్చుకలు, ఒక ఉడుత ఎంతో స్నేహంగా ఉండేవి. ఒకరోజు ఓ కాకి ఆ చెట్టు మీద వాలి.. 'నేను కూడా మీతో స్నేహం చేస్తాను' అని వాటితో అంది. అందుకు ఉడుత ఒప్పుకొన్నది. కానీ చిలుకలు, పిచ్చుకలు ఒప్పుకోక.. ఉడుతతో గొడవకు దిగాయి. అప్పుడు కాకి.. 'సరే.. నా గురించి మీరు గొడవ పడొద్దు!' అని చెప్పి, అటు పక్కగా ఉన్న వేప చెట్టు మీద సేద తీరింది. ఒకరోజు ఒక పాము ఆ జామ చెట్టు మీదికి పాకడం కాకి చూసింది. అప్పుడు చెట్టు మీద ఒక పిచ్చుక, పై కొమ్మ మీదజామ పండు తింటూ ఉడుత ఉన్నాయి. కాకి మెల్లగా ఎగురుతూ వెళ్లి తన కాళ్లతో ఆ పామును పట్టుకుని దూరంగా వెళ్లడాన్ని ఉడుత చూసింది. కాసేపటికి కాకి వేప చెట్టు కొమ్మ మీదకు చేరింది. కొంత సమయం తరువాత రెండు చిలుకలు, పిచ్చుక కొమ్మల మీద వాలాయి. ఉడుత వాటికి విషయం చెప్పి.. 'కాకి నలుపైనా, దాని మనసు మాత్రం తెలుపు' అని అంది. చిలుకలు, పిచ్చుకలు.. 'నీ మాట వింటాం!' అని చెప్పి, ఉడుతతో కలిసి వేప చెట్టు మీద ఉన్న కాకి వద్దకు చేరుకున్నాయి. కాకికి కృతజ్ఞతలు చెప్పి.. 'మాతో స్నేహం చేయడానికి అంగీకరిస్తావా?' అని అడిగాయి. 'ఓ అలాగే!' అంటూ, కాకి ఎంతో సంతోషించింది.

...యు. విజయశేఖర రెడ్డి



## పూరించండి



so_k_


_-sh_rt

**బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి.**

## పద్యం - భావం

**తనకుగల్గు పెక్కు తప్పులు నుండగా
ఓగు నేర మెంచు నొరులగాంచి
చక్కిలంబుగాంచి జంతిక నగినట్లు
విశ్వదాభిరామ! వినుర వేమ!**

**తాత్పర్యం:** చెడ్డవాని దగ్గర అనేక తప్పులు ఉండగా, వాడు ఇతరుల తప్పులను లెక్కిస్తూ ఉంటాడు. ఎలాగంటే.. చక్కిలాన్ని చూసి జంతిక నవ్వినట్లు ఉంటుంది అని భావం.



# కనికరం

బాలకథ

సంగనభట్ల చిన్న రామకిష్టయ్య
9908554535

నరసింహపురంలో ధర్మయ్య అనే ఒక వృద్ధుడు పెద్ద కూరగాయల మూటను నెత్తిన పెట్టుకొని సంతకు బయలుదేరాడు. ఇంతలో వెనుక నుండి ఒక ఆంబోతు పరిగెత్తుకొని వస్తోంది. ఎవరో వెనుక నుండి "జరగం-డి..జరగండి "అని కేకలు వేయడంతో ఆ వృద్ధుడు కంగారుపడి తత్తర పాటుతో పక్కన ఉన్న ఒక అరటి తొక్క పై కాలు వేశాడు. అంతే వెంటనే జర్రున జారి కింద నేలపై పడి-పోయాడు. ఆ ఆంబోతు అతని ముందు నుండే వేగంగా పరిగెత్తుతూ వెళ్లిపోయింది. ఆ వృద్ధునికి దెబ్బలు ఏమీ తగలలేదు. కానీ ఆ మూట చిరిగి అందులోని కూరగాయలన్నీ కింద చెల్లాచెదురుగా పడిపోయాయి. వెంట-నే అక్కడ ఉన్న దయాశాలి రామయ్య వచ్చి, అతనిని పైకి లేపి, ఒకచోట కూర్చుండబెట్టి అతనికి కొన్ని నీళ్లను తాగించాడు. అతని కూరగాయలన్నీ ఒక బుట్టలో ఎత్తుదామని అక్కడే బుట్టతో నిలుచున్న యువకుడైన శర-భయ్య వద్దకు వెళ్లి అతనిని బుట్టను ఇమ్మని అడిగాడు. ఆ శరభయ్య కూడా రోజూ సంత-కు వెళ్లి, తన కూరగాయలను అమ్ముతాడు. శరభయ్య కరాకండిగా తన బుట్టను ఇవ్వనని చెప్పాడు. రామయ్య ఆశ్చర్యపోయాడు. తర్వాత రామయ్య మరొక వ్యక్తి దగ్గర నుండి బుట్ట తీసుకొని వచ్చి, ఆ కూరగాయలను అందులో ఎత్తి పెట్టాడు.

ఇంతలో శరభయ్య కొడుకు అక్కడికి వచ్చి 'నాన్నా! నాన్నా ఈ రోజు నేను అదృ-ష్టవశాత్తు పెద్ద ప్రమాదం నుండి బయటప-డ్డాను తెలుసా! నేను ఈరోజు బతికేవాడినే కాదు' అని అన్నాడు. అది విన్న శరభ-య్య 'అయ్యో ఏమైంది బాబూ?' అని ప్రశ్నించాడు. 'నేను నా మిత్రులతో ఆడుకొనడానికి ఊరవతలికి వెళ్లాను. అక్కడ దాహం వేసి ఒక ఏటిలో దిగాను. ఇంతలో ఆకస్మికంగా ఆ ప్రవాహ వేగం పెరిగి, నేను ఏటిలో కొట్టుకొని పోతుంటే నా మిత్రులు ''కాపాడండి.. కాపాడండి '' అని గట్టిగా అరిచారు. కొంత దూరంలో కూరగాయల తోటలో పని చేసుకుంటున్న ఒక వృద్ధుడు నన్ను వెంటనే ఆ ఏటిలోకి దూకి కాపాడాడు ' అని చెప్పాడు. 'అయ్యో అలాగా! ఆ వృద్ధుడు ఎవరో నీకు ప్రాణభిక్ష పెట్టాడు రా! అతడు ఎవరో చెప్పు. ఇప్పుడే అతని ఋణం తీర్చు-కుంటాను' అని అన్నాడు శరభయ్య.

అది విన్న రామయ్య 'అతడు ఎవరో చెప్పు బాబూ' అని అన్నాడు. 'అతడు ఎవరో కాదు నాన్నా! ఇదిగో ఇక్కడ కూరగాయల మూటతో కిందపడిన ఈ వృద్ధుడే! ఈయన ఆ తర్వాత ఇక్కడ సంతకు బయలుదేరాడు. నేను ఈ సంగతి నీకు చెబితే నీవు తిడతావని ఆలస్యంగా వచ్చాను' అని అన్నాడు.

అది విన్న రామయ్య 'చూశా-వా శరభయ్యా! ఆ వృద్ధుడు కిందపడితే నీవు చూసి కూడా సాయం చేయలేదు. సరికదా బుట్టని ఇమ్మంటే కూడా ఇవ్వలేదు. అతడు నీ కొడుకు ప్రాణా-న్ని ఆ వయసులో కూడా కాపాడాడు. నీవు వృద్ధుల పట్ల కనికరం చూపడం నేర్చుకో!' అని అన్నాడు.

అది విన్న శరభయ్య 'తాతా! నన్ను మన్నించు. నాకు సాయం చేసే శక్తి ఉండి కూడా నేను నీకు చేయలే-దు. నా బిడ్డను మాత్రం నీవు కాపా-డావు. నీ కూరగాయలను నేను ఈరోజు అమ్మి పెడతాను' అంటూ అతనికి డబ్బుని ఇవ్వబోయాడు.

తాత ఆ డబ్బును నిరాకరించి 'బాబూ! నా స్థానంలో ఎవరున్నా అదే పని చేస్తారు. నీవు బుట్టను యివ్వనంత మాత్రాన నాకు నీ పైన కోపం లేదు. కానీ సాటి మనిషిని ఆదు-కునే మానవత్వం అందరికీ ఉండాలి. నేను నీ కొడుకుకు సాయం చేసినందువల్లనే కాబోలు నాకు దెబ్బలేమీ తగులకుండా క్షేమంగా ఆ ఆంబోతు నుండి బయటపడ్డాను' అని అన్నా-డు.

అప్పుడు రామయ్య 'తాతా! ఈ కూర-గాయలు ఈరోజు ఇతనికి అప్పగించు. వాటి-ని ఇతడు రోజూ అమ్మి నీకు డబ్బును ఇస్తాడు తీసుకో! అంతేకాదు. నీవు విశ్రాంతి తీసుకో' అని అన్నాడు. శరభయ్య సంతోషంతో 'తా-తా! ఇలాగైనా నా ఋణం తీర్చుకునే అవకా-శాన్ని నాకు కల్పించు' అని వేడుకున్నాడు. సరేనన్నాడు తాత.

# కోడి దొంగ

చిరుమువ్వలు

అమ్మిన వెంకట అమ్మిరాజు
94407 08656

అక్బర్ దగ్గరికి కాంతమ్మనే ముసలావిడ వచ్చి, 'నాకు-న్న ఓ కోడిని దొంగలెత్తుకు పోయారు ప్రభు! న్యాయం చేయండి' అని బోరుమంది.

'కాంతమ్మ నీకు ఎవరి మీదైనా అనుమానం గాని ఉందా?' అని అడి-గారు అక్బర్. ' సూరయ్య, నారయ్య మా ఇరుగుపొరుగు వాల్లే'అంది కాంతమ్మ.

వెంటనే సూరయ్య, నారయ్యలను పిలిపించి, 'కాంతమ్మ కోడిని మీరు దొంగిలించారా?' అని గట్టిగా అడిగారు అక్బర్. 'నేను చేయలేదండి, నేను చేయలేదు' అని సూరయ్య, నారయ్యలు వినయంగా బదులిచ్చారు.

'సర్లే సూరయ్య మీది ఏమి కూర?'

'పప్పు తోటకూర ప్రభు' అని వెంటనే చెప్పాడు సూరయ్య. 'మరి నారయ్య మీదేం కూర?' 'ఆ ..ఆ.. రాత్రి అసలు అన్నమే తినలేదండి చెకోడి కాదు..కాదు, పకోడీ పొట్లం తిని, నీళ్లు తాగాను ప్రభు' అని అన్నాడు నారయ్య.

'బీర్బల్! రేపు తెల్లారే సరికి కోడిదొంగ దొరకాలి. అందాక వీళ్ళని ఇక్కడే చెరసాలలో ఉంచండి' అని ఆదేశించారు అక్బర్.

'చిత్తం ప్రభు'అంటూ అభివాదం చేశాడు బీర్బల్.


మరుసటి రోజు 'కోడి-దొంగ దొరికాడా బీర్బ-ల్?' అడిగారు అక్బర్.

'ఆ దొరికాడు జహాప-నా!' అన్నాడు బీర్బల్.

'అయితే ఆ దొంగను ప్రవేశ పెట్టమ'ని ఆదేశించారు అక్బర్ చక్రవర్తి.

'ఆ కోడిదొంగ ఎవరో కాదు, ఈ నారయ్యే' అన్నాడు నవ్వుతూ బీర్బ-ల్. 'నారయ్యా! అసలు కోడిని దొంగతనం చేయలేదు' అని అంటున్నాడు కదా! అని గట్టిగా అడిగారు అక్బర్.

'జహాపనా! నిన్న మీరు సూరయ్యను కూర అడగగానే తడుముకో-కుండా వెంటనే చెప్పాడు, కానీ నారయ్య కాసేపు ఆలోచించి చెకోడీ, పకోడీ అననీ మాటలు తడపడ్డాడు. ఇక రాత్రి ఇద్దరినీ చెరసాలలో బంధించినప్పు-డు సూరయ్య



గురక పెట్టి మరి నిద్రపోయాడు, కానీ నారయ్య మాత్రం భయంగా కోడి నిద్ర పోయాడు. తప్పు-చేసిన వాడికే భయం ఎక్కువ.కాబట్టి ఖచ్చితంగా ఆ కోడి దొంగ ఈ నారయ్యే' అన్నాడు బీర్బల్.

'ప్రభు క్షమించండి! ఏంకూర లేక కాంత-మ్మ కోడిని కోసుకుతిన్నాను. ఆమెకు నేను రెండుకోళ్లు కొనిస్తానూ, ఇక ఎప్పుడూ దొంగత-నం చేయను' అని దండం పెట్టాడు నారయ్య.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# ఆపదలో సాయం

అడవి అంచున ఉన్న చిన్న గుడిసెలో వెంకయ్య అనే పేద కట్టెలు కొట్టే వ్యక్తి నివసించేవాడు. అతని కుటుంబానికి ఆధారం ఒక్కటే. తన చేతిలోని పాత గొడ్డలి. ప్రతిరోజూ అడవికి వెళ్లి కట్టెలు కొట్టి అమ్మితేనే ఇంట్లో పొయ్యి వెలిగేది.

ఒక రోజు ఎప్పటిలాగే అడవిలో ఎండిపోయిన చెట్టును నరుకుతున్నాడు. అకస్మాత్తుగా అతని చేతిలోని గొడ్డలి జారి పక్కనే ఉన్న లోతైన లోయలో పడిపోయింది. ఒక్కసారిగా అతని గుండె ఆగినట్టైంది. లోయలోకి తొంగిచూశాడు. గొడ్డలి కనిపిస్తోంది, కానీ దాన్ని తెచ్చే మార్గం కనిపించలేదు. లోయ చాలా లోతుగా ఉంది. దిగడానికి ప్రాణాలకే ప్రమాదం. "ఇక నా పిల్లలకు అన్నం ఎలా పెడతాను?" అనే ఆలోచనతో వెంకయ్య కళ్లలో నీళ్లు తిరిగాయి. నిస్సహాయంగా ఒక చెట్టు కింద కూర్చుని వెక్కివెక్కి ఏడవసాగాడు. అదే సమయంలో వంటచెరకు కోసం అడవికి వచ్చిన సుబ్బయ్య తన నలుగురు స్నేహితులతో కలిసి అక్కడికి చేరుకున్నాడు. వెంకయ్యను ఆ స్థితిలో చూసి ఆప్యాయంగా కారణం అడిగాడు. జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే, "నీ బాధ ఇక మా బాధ కూడా" అని



ధైర్యం చెప్పాడు. వారంతా తమ వద్ద ఉన్న బలమైన తాళ్లను ఒకదానికొకటి కట్టి జాగ్రత్తగా లోయలోకి దిగారు. ఎంతో శ్రమించి చివరకు గొడ్డలిని వెతికి తీసుకొచ్చి వెంకయ్య చేతిలో పెట్టారు. గొడ్డలిని చూసిన వెంకయ్య ఆనందానికి అవధులు లేకపోయాయి. కళ్లలో ఆనందబాష్పాలు మెరిశాయి. చేతులు జోడించి, "మీరు నాకు గొడ్డలినే కాదు, నా కుటుంబ జీవనాధారాన్ని తిరిగి ఇచ్చారు. మీ ఈ మేలు జీవితాంతం మరువలేను," అని హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపాడు. సుబ్బయ్య చిరునవ్వుతో, "ఆపదలో ఒకరికొకరు తోడుగా నిలవడం మనిషి ధర్మం" అని చెప్పాడు. ఆ రోజు నుంచి వెంకయ్య తన పని మరింత ఉత్సాహంగా కొనసాగించాడు. తనకు కష్టసమయంలో అండగా నిలిచిన సుబ్బయ్య, అతని స్నేహితులను జీవితాంతం కృతజ్ఞతతో గుర్తుచేసుకుంటూ ఉండిపోయాడు.

**నీతి: ఆపదలో చేసిన చిన్న సహాయం కూడా ఒకరి జీవితాన్ని మార్చగలదు. మానవత్వం కంటే గొప్ప సంపద మరొకటి లేదు.**



**ఇసుకుల శ్రీదేవి,**
**5వ తరగతి, ఎంపిపిఎస్,**
**వానపాముల (హెచ్‌డబ్ల్యు),**
**పెదపారుపూడి మండలం,**
**కృష్ణాజిల్లా.**

చిరుమువ్వలు

## బోనాలు సమర్పించాం....

తెలుగు, తెలంగాణా సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తున్న బోనాల సంబరాలు మా పాఠశాలలో చాలా బాగా జరుపుకున్నాం. పోతురాజు, అమ్మవారి వేషధారణలతో బోనాలను మేమంతా తలపై పెట్టుకుని అమ్మవారికి బోనాలు సమర్పించాము. మేమంతా మా ఇళ్ల నుంచి బోనాల కుండలతో పాఠశాల ప్రాంగణానికి చేరుకున్నాం. అనంతరం బోనాలకు, గౌరీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించాం. మాతోపాటుగా మా ఉపాధ్యాయినులు కూడా అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామోత్సవం ముందు పోతురాజు వేషధారణలతో మాలోని కొందరు ఆకట్టుకున్నారు. 'తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు బోనాల సంబరాలు ప్రతీకగా నిలుస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా బోనాల సంబరాలకు ప్రత్యేక స్థానం ఏర్పడింది' అని మా స్కూలు కరస్పాండెంట్ వల్లభనేని మురళీకృష్ణ గారూ, ప్రిన్సిపాల్ వల్లభనేని నాగలక్ష్మి గారు సందేశం ఇచ్చారు. ఈ వేడుకలతో మాలోనూ మన సంస్కృతి, సాంప్రదాయాల పట్ల గౌరవం, ఆనందోత్సవాలు వెల్లి విరిశాయి.



**జాహ్నవి**
**2వ తరగతి, బచపన్ ప్లే స్కూలు,**
**తాడేపల్లి, గుంటూరుజిల్లా.**

## మువ్వన్నెల జెండా

అమ్మ ఒడిలా ఆప్యాయమైనది
నా భారతమాత భూమి...
మువ్వన్నెల జెండా రెపరెపలలో
మన గర్వం చిరునవ్వై మెరిసింది...
ఎన్నో త్యాగాల ఫలితమే
ఈ స్వేచ్ఛ అనే వరం...
భగత్‌సింగ్ ధైర్యం,
అల్లూరి వీరత్వం,
గాంధీజీ అహింసా మార్గం,
మనకు ఎప్పటికీ ఆదర్శం...
చదువుకుని మంచి పౌరులమై,
దేశానికి సేవ చేస్తామని
ఈ రోజు ప్రమాణం చేద్దాం...
చెట్టు నాటుదాం...
ప్రకృతిని కాపాడుదాం...
పరిశుభ్రత పాటిద్దాం...
భారతమాత కీర్తిని పెంచుదాం...
జై జవాన్... జై కిసాన్...





**మలిశెట్టి సాయి ప్రణవి**
**6వ తరగతి,**
**కుమార్ సిబిఎస్ఇ స్కూలు,**
**నూజివీడు,**
**ఏలూరుజిల్లా.**

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్స్అప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి




# విజయసింహుడు

రత్నగిరి రాజ్యాన్ని విజయసింహుడు పరిపాలిస్తున్న రోజులవి. ప్రజలు సుభిక్షంగా ఉన్నారు. వయోభారంతో విజయసింహుడు, తన కుమారున్ని పట్టాభిషేకం చేసి విశ్రాంతి తీసుకుంటున్నాడు. అయితే యువరాజు పాలన గాలికి వదిలేసి అంతఃపుర కన్యలతో కాలం గడిపేవాడు. రాజ్యంలో కరువు సంభవించింది. పంటలు సరిగ్గా పండక ప్రజలు అలమటిస్తున్నారు, దీనికితోడు పన్నుల భారం ఎక్కువయ్యింది. ప్రజలు తమ గోడు చెప్పుకోవటానికి విజయసింహుడిని కలవాలని మంత్రి ద్వారా కబురు పెట్టారు. రాజును నేనుండగా ఆ ముసలి రాజును కలవటమా? యువ రాజు అని ఊగిపోయాడు. వెంటనే తన భటులను ఆజ్ఞాపించి విజయసింహుడిని ఖైదు చేయించాడు. తండ్రి గారిని గౌరవించాలి అలా చేయకూడదు.. అని మంత్రి ఎంత చెప్పినా వినలేదు. విజయసింహుడు ఖైదీగా ఉండటం చూసి మంత్రి చాలా బాధపడ్డాడు. మహారాజు "తల్లి లేని పిల్లాడు అని అతి గారాబంగా పెంచాను, దాని ఫలితమే ఇది. మీరేమి బాధపడకండి. ఏదో ఒకరోజు తనే మారుతాడు" అన్నాడు. యువరాజును ఎలాగైనా మార్చాలి అని ఆలోచనలో పడ్డాడు, మంత్రి. విజయసింహుడిని ఖైదు చేశారని తెలిసి ప్రజలు తమ గోడు వినిపించకుండా వెను తిరిగారు. "భగవాన్ నువ్వే యువరాజు మనసు మార్చాలి" అనుకున్నారు ప్రజలు.

మంత్రి, యువరాజుకు మద్యం ఇచ్చే రాజ నర్తకి నందినితో సమావేశం అయ్యాడు. "మద్యం రెండు రోజుల వరకు అందించవద్దు, అని యువరాజుకు నీళ్ళు, ఫలహారాలు అందించే వారికి కూడా ఆ విషయమే చెప్పాడు. దాంతో నీరసపడ్డాడు యువరాజు.

వెంటనే మహామంత్రికి కబురు పెట్టాడు. "ఏమిటిది యువరాజునైనా నాకే మద్యం, భోజనం లేదా, ఆకలి దంచేస్తోంది, నీళ్ళు లేక నాలుక పిడచకట్టింది. మీరు ఏమి చేస్తున్నారు" అని కోపంగా అడిగాడు. "రెండు రోజులు మీకు ఆహారం లేకపోతేనే మీరు ఇలా నీరసపడ్డారు. మరి ప్రజలు ఎలా ఉంటారు?" అనుకున్నారు. ఎంతో మంది ఆకలితో అలమటిస్తున్నారు, అంతెందుకు మీ నాన్న గారే ఆకలితో బాధపడుతున్నారు" అన్నాడు మహామంత్రి. ఆ మాటకు అతనిలో జ్ఞానోదయం కలిగింది.



తన తండ్రి, ప్రజలు ఆకలితో బాధపడుతున్నారా? అనుకుని తండ్రిని చూడాలని నేరుగా తండ్రి దగ్గరకు వెళ్ళాడు. కారాగారంలో విచారంలో మునిగిపోయాడు మహారాజు. అలికిడి విని యువరాజు వైపు చూశాడు. అతని కళ్ళు పీక్కుపోయాయి. "బాబూ" అన్నాడు మహారాజు. తండ్రి వంక చూసి "నా తప్పు క్షమించండి. పరిపాలన మీరే సాగించండి. మీకు రక్షణగా నేను ఉంటాను" అన్నాడు. అప్పుడే వచ్చాడు మహామంత్రి. "ప్రజలు హాహాకారాలు చేస్తున్నారు యువరాజా!" అంటే, తండ్రి వైపు చూశాడు యువరాజు. తండ్రిని కౌగలించుకుని "మీరే ప్రజలను చూసుకోండి, నా తప్పు క్షమించండి" అని కాళ్లపై పడ్డాడు. "ప్రజల సుఖమే మన సుఖం, బాధపడకు" అన్నాడు మహారాజు. ఆ రోజు నుంచి పన్నులు తగ్గిపోయాయి. ప్రజలు ఆనందపడ్డారు.

దేవాలయాలలో రాజు, యువరాజు పూజలు చేశారు. వారి పుణ్య ఫలం ఏమో కాని వర్షాలు సమృద్ధిగా పడ్డాయి. ప్రతి ఇంటి పాడి పుష్కలంగా ఉంది. "మహారాజు, యువరాజు కలకాలం వర్ధిల్లాలి" అన్నారు ప్రజలు.

మహామంత్రి కళ్ళల్లో ఆనంద భాష్పాలు రాలాయి. "నా ఉపాయం ఫలించింది, తండ్రి, కొడుకు ఒకటి అయ్యారు. ప్రజలు ఆనందంతో ఉన్నారు. అది చాలు జై శివ శంకరా" అనుకున్నాడు మనసులో.

ఆ రోజు నుంచి విజయసింహుడు పగ్గాలు చేపట్టాడు. తండ్రికి రక్షణగా యువరాజు, చక్కటి సలహాలతో మంత్రి, పాలనా దక్షతతో మహారాజు రత్న గిరి రాజ్యాన్ని సుభిక్షంగా పాలించారు. వీరి పాలనలో ప్రజలు ఏ ఇబ్బంది లేకుండా ఉన్నారు.

"మహారాజు, యువరాజు, మహామంత్రి చిరకాలం వర్ధిల్లుదురుగాక" అన్నారు ప్రజలు ముక్త కంఠంతో.

– కనుమ ఎల్లారెడ్డి

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



సూర్య

# బుడత



## బాలల కథ

# పిలిస్తే వస్తాం- ముప్పు




సుందరవనం అనే అడవిలో ఒక కాకి తన పిల్లలతో ఒక చెట్టు పైన నివాసం ఉండేది. ఆ చెట్టు పక్కనే మరొక చెట్టు పైన ఒక పెద్ద పక్షి తన పిల్లలతో నివాసం ఉంది . ఆ రెండు ఎంతో స్నేహంగా ఉండసాగాయి. అయితే ఆ కాకి పావురాలు,చిలుకలు, పిచ్చుకలు, కొంగలు మొదలైన మిగతా అన్నీ పక్షులతో విరోధం పెట్టుకొంది. అది గమనించిన ఆ పెద్ద పక్షి ఆ విరోధం మంచిది కాదనీ, అది వాటితో కలసి ఉండాలని చెప్పింది. అయినా కాకి దాని మాటలను పెడచెవిని పెట్టింది.


ఒకరోజు కాకి ఆహారం కొరకు వెళుతూ తన పిల్లలతో " మీకు ఏమైనా ఆపద వస్తే ప్రక్కన ఉన్న పెద్ద పక్షిని పిలవండి" అని వెళ్ళిపోయింది. కాకి ఊహించినట్లే ఒక పిల్లి చెట్టు పైకి కాకి పిల్లల కొరకై రాసాగింది. అప్పుడు కాకి పిల్లలు " పెద్ద పక్షి మామయ్యా! పెద్ద పక్షి మామయ్యా!" అని పిలిచాయి . కాని ఆ పెద్ద పక్షి కూడా ఆ సమయంలో అక్కడ లేదు.


అప్పుడు పెద్ద పక్షి యొక్క పిల్లలు ఇది గమనించి మాకు ఆపద సంభవించిందని ఆ ఎగిరే పావురాలు,చిలుకలు, కొంగలు, పిచ్చుకలు మొదలైన పక్షులను అన్నింటినీ గట్టిగా రమ్మని పిలిచాయి. ఆ పెద్ద పక్షి అన్నింటితో స్నేహంగా ఉంటుంది కనుక దాని పిల్లల మాటలను వినగానే అవి పరుగెత్తి వెంటనే ఆ చెట్టు వద్దకు వచ్చాయి. అప్పుడు ఆ పెద్ద పక్షి పిల్లలు తమ నేస్తాలకు ఆపద వచ్చిందని చెప్పి అవి వాటికి ఆ కాకి పిల్లల చెట్టును చూపించాయి. తర్వాత అవి ఆ కాకి పిల్లలను కాపాడమంటూ వేడుకున్నాయి. ఈ పెద్ద పక్షిపిల్లల ప్రార్థన కు కరగిపోయిన ఆ ఎగిరే పక్షులు అవి చెప్పినట్లు కాకి పిల్లల చెట్టు వద్దకు వెళ్లాయి. ఆ పిల్లి ఆ మిగతా పక్షులను చూసి భయపడింది. వెంటనే అది వాటి భయానికి ఆ చెట్టు దిగి పారిపోయింది. ఆ కాకి పిల్లలు ఆ వచ్చిన ఎగిరే పక్షులకు ధన్యవాదాలు చెప్పి" ఓ పక్షులారా! మీరు మమ్మల్ని కాపాడారు . మా అమ్మ మీతో విరోధం పెట్టుకొన్నప్పటికినీ మీరు అది మనసులో పెట్టుకోలేదు. మీరెంత మంచివారు. మా అమ్మ నేస్తం అయిన పెద్ద పక్షి పిల్లల పిలుపునకు వెంటనే ప్రతిస్పందించారు" అని అన్నాయి. . అది విన్న ఆ పక్షులు ఇకముందు ఏ ఆపద వచ్చినా తమను పిలవమని, తాము వాటి ముప్పును తొలగిస్తామని చెప్పి అవి కాకి పిల్లలకు ధైర్యం చెప్పి వెళ్లిపోయాయి .


తర్వాత వచ్చిన కాకి విషయం తెలుసుకొని పెద్ద పక్షి పిల్లలతో " ఏయ్ పిల్లలూ! మీరు ఎంత బుద్ధిశాలురు రా! నేను అన్ని పక్షులతో విరోధం పెట్టుకున్నాను. అయినా మీరు పిలిస్తే అవి వచ్చి నా పిల్లలను కాపాడాయి. ఇక ముందు నేను కూడా అందరితో ఎంతో స్నేహంగా ఉంటాను. నా మేలుకోరి చెప్పే మీ అమ్మ మాటలను ఇకముందు తప్పక వింటాను. ఐకమత్యంగా ఉంటే మనకే లాభమని నాకు అర్థం అయింది. అలా అందరం కలిసుంటే మనను చూసి శత్రువులు కూడా భయపడతారు. ఎవరితో ఏ అవసరం ఎప్పుడు పడుతుందో చెప్పలేము. నేను నా నేస్తమైన పెద్ద పక్షి ఉంది కదా అని అనుకున్నాను. కానీ ఆ సమయానికి అది కూడా లేదు. ఇకముందు వీటి రక్షణ గురించిన బెంగ నాకు పోయింది. ఇన్ని రోజులు నేను ఆ ఎగిరే పక్షులతో కలిసి ఉండకున్నా మీరు పిలిస్తే అవి మాకు సాయంగా వచ్చాయి" అని ఆ కాకి ఆ పెద్ద పక్షి పిల్లలకు తన పిల్లలను కాపాడినందుకు ధన్యవాదాలు చెప్పి తాను కూడా ఇతర ఎగిరే పక్షులతో ఆరోజు నుండి స్నేహంగా ఉండసాగింది. అందుకే పిల్లలూ!అందరితో కలిసి ఉండాలి. ఎవ్వరితో విరోధం పెట్టుకోరాదు.

**సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,**
**9908554535**







ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



ప్రపంచంలో ఎవరు ఏ పనిచేసినా, కూలంకషంగా విమర్శించడం ఎంతో తేలిక. ఎటొచ్చీ, ఏపాటి పనినైనా చేయడమే చాలా చాలా కష్టం. ☛ డిస్రెయిలీ






# కథ: హరి, గిరి, హరిత, గిరిజ



తెలుగుమాస్టర్ గారు తరగతి గదిలోకి వచ్చారు. పిల్లలు అందరూ నిలుచుని 'శుభోదయం మాస్టర్ గారు' అని అన్నారు.

'శుభోదయం పిల్లలు. కుదురుగా కూర్చోండి! మిమ్మల్ని ఇప్పుడు కొన్నివిషయాలు అడుగుతాను, మీకు తెలిస్తే, చెప్పండి తెలియకపోతే మీకు నేను వివరంగా చెబుతాను' అన్నారు.

'సరే మాస్టారు గారు' అని పిల్లలందరూ ముక్త కంఠంతో అన్నారు.

'హరి ఊచకోత అంటే ఏంటో తెలుసా!?' అని అడిగారు మాస్టారు. హరి నిలుచుని చేతులు కట్టుకొని 'మరి మాస్టర్‌గారు అదే...అదేనండి... ఊచతో కోయడంనే ఊచకోత అంటారండి' అని చెప్పాడు.

'ఇంకా నయం రంపంతో కోయడం అనలేదు సుమ' అని మాస్టర్ గారు అన్నారు.

అంతే పిల్లలందరూ గొల్లున నవ్వారు.

'ఒకే సమయంలో ఎక్కువమందిని చంపేయడాన్ని ఊచకోత అంటారు' అని మాస్టారు గారు చెప్పారు.

'అవునవును మాస్టారు అనేక మందిని ఊచకోతకోశారని నేను వార్తల్లో విన్నాను మాస్టర్'అని గిరి అన్నాడు.

'సరే గిరి నీవు కాలికి బుద్ధిచెప్పు!?' అంటే ఏంటో చెప్పు' అని మాస్టారు అడిగారు.

'కాలుని బుద్ధిగా నడవమని ముళ్ళు, రాళ్లు గుచ్చుకోకుండా జాగ్రత్తగా ఉండమని బుద్ధులు చెప్పడం అనుకుంటాను మాస్టారు' అని వినయంగా చేతులు కట్టుకొని మరి చెప్పాడు గిరి.

'కాలుకి బుద్ధి చెప్పడం అంటే అది కాదు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు పరిగెత్తమని చెప్పేసందర్భంలో కాలికి బుద్ధి చెప్పడం అంటారు' అని మాస్టారు వివరించారు.

'అవునవును మాస్టారు పోలీసులను, చూసి దొంగకాలికి బుద్ధి చెప్పాడు అని ఓ కథలో చదివాను ఇప్పుడు మీరు చెప్పాక నాకు బాగా అర్థమైంది మాస్టారు' అని హరిత అంది.

'సరే హరిత. కళ్లు కాయలు కాయడం అంటే ఏంటో తెలుసా!?' అని మాస్టారు అడిగారు.

'అదే మాస్టారు కళ్లకు అప్పుడప్పుడు వేడి చేసినప్పుడు కంటి కురుపుల్లా వస్తూ ఉంటాయి కదా వాటిని కళ్లు కాయలు కాయడం అంటారు మాస్టారు' అని హరిత చెప్పింది.

'ఆహా మహా బాగాచెప్పావూ కాయలు, పళ్లు గురించి'అని మాస్టారు అనగానే పిల్లలుగొల్లున నవ్వారు!.

'ఆ నవ్వులు ఆపండి. మీలో ఎవరికైనా తెలిస్తే చెప్పండి మరి' అని మాస్టారు మళ్లీ అడిగారు.

'అదే మాస్టారు ఎవరికోసమైనా మనం ఎదురుచూసినప్పుడు కళ్లు కాయలు కాసేలా చూస్తున్నాం అని అంటారు కదా మాస్టారు' అని గిరిజ చేతులు కట్టుకొని వినయంగా చెప్పింది.

'శభాష్ బాగా చెప్పావు, మరి పెదవి పూత అంటే ఏమిటో తెలుసా!?' అని మళ్లీ మాస్టారు గిరిజను అడిగారు.

'చాలామంది పెదాలకు రంగు రంగులు పూసుకుంటారు కదా. దాన్ని పెదవి పూత అంటారనుకుంటానండి' అని అనుమానంగా చెప్పింది గిరిజ.

'నా తల్లి బాగా చెప్పావు. నువ్వు ఎప్పుడైనా పూసు కున్నావా ఆ రంగులు' అని మాస్టారు అనగానే తరగతి పిల్లలు అందరూ గట్టిగా నవ్వారు.

'ఆ నిశ్శబ్దం... నిశ్శబ్దం. ఎవరికైనా పెదవి పూతంటే తెలుసా!?' అనీ మళ్లీ మాస్టర్ గారు గట్టిగా అడిగారు. 'తెలియదు మాస్టారు' అని పిల్లలందరూ ముక్తకంఠంతో అన్నారు.

'సరే మరి పెదవిపూత అంటే మన శరీరంలో కొన్ని విటమిన్స్ లోపం వల్ల మన నోటిలో అప్పుడప్పుడు తెల్లగా పెసర బద్దల్లా పుండ్లు ఏర్పడతాయి అలా పుండ్లు ఏర్పడడాన్ని 'పెదవి పూత' అని అంటారు. అలా పెదవి పూత పూసినప్పుడు ఆ వ్యక్తి కారముతో కూడిన ఆహార పదార్థాలను తినలేడు! అర్థమైందా పిల్లలు' అని మాస్టారు అన్నారు.

'అర్థమైంది మాస్టారు' అని పిల్లలందరూ అన్నారు.

అంతలోనే గంట మోగింది. తెలుగు మాస్టారు తరగతి గది నుంచి బయటికి వెళ్లారు.

అమ్మిన వెంకట అమ్మిరాజు
94407 08656

## మీకు తెలుసా?

✦ ఎన్నికలంటే బ్యాలెట్ పేపర్ తప్పనిసరి. కాగా, ప్రస్తుతం మనం చూస్తున్న ఈ బ్యాలెట్ పేపరును తొలిసారిగా 1962 సార్వత్రిక ఎన్నికలలో ప్రవేశపెట్టారు. అంతకు ముందు జరిగిన రెండు సార్వత్రిక ఎన్నికలలో ప్రతి అభ్యర్థికి విడివిడిగా బ్యాలెట్ బాక్స్‌లుండేవి. ఓటర్లు తమ కిష్టమైన అభ్యర్థికి సంబంధించిన బ్యాలెట్ బాక్స్‌లో ఓటు వేసేవారు.


✦ ప్రపంచ ప్రఖ్యాతి పరిశోధకుడు థామస్ ఆల్వా ఎడిసన్(1847-1931) విద్యుచ్ఛక్తి బల్బును 1879లో కనుగొన్నాడు. బల్బును కనిపెట్టటానికి తాను చేస్తున్న పరిశోధనలలో 1600రకాల ఫిలమెంటులను వాడారు. ఒకసారి తన అసిస్టెంట్ గడ్డంలోని వెంట్రుకను కూడా ఫిలమెంటుగా ఉపయోగించే ప్రయత్నించి చూశాడట! నూలుదారం ఫిలమెంటుగా పనికి వస్తుందేమోనని ఏకంగా పద్నాలుగు నెలలు ప్రయత్నించి, అది 40గంటలు వెలగ గలదు అని తేల్చాడు. ఆ మహానుభావుడు అనేకానేక పరిశోధనలు చేశాడు. మొదటిసారిగా ఒక ఆవిష్కరణకు 1868లో పేటెంట్ తీసుకున్నాడు. ఈయన కనుగొన్న వాటిలో అతి ఘనమైనది ఫోనోగ్రాఫ్ లేదా గ్రామ్‌ఫోన్, 1877లో ఆవిష్కరించాడు.



## దారి కనుక్కోండి!



పైన కనిపించే ఏనుగులు ఆ నదిలో నుంచి ఈ గజిబిజి దారి గుండా దిగువకు ఎలా చేరుకుంటాయో ఆ దారి కనుక్కోండి!



## తేడాలను గుర్తించండి!



ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో కొన్ని తేడాలున్నాయి. అవేమిటో గుర్తించండి!